సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 331

శుక్రవారం 21-2-2020

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

22 కి.మీ... లక్ష మంది

అహ్మదాబాద్‌లో ట్రంప్ రోడ్‌షో.. తాజ్‌ను సందర్శించనున్న ట్రంప్ దంపతులు - 5లో

నాలీ... ధనాధన్ భేరి

నేటి నుంచి ఆస్ట్రేలియాలో మహిళల టి20 ప్రపంచకప్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

● భర్త అడుగుజాడల్లో..

వైఫ్ ఆఫ్ మేజర్ విభూతి..

జమ్మూకశ్మీర్‌లో గత ఏడాది ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ మేజర్ విభూతి శంకర్ ధౌండియాల్ వీరమరణం పొందగా భర్త స్ఫూర్తితో ఆయన భార్య నిఖితా కౌల్ సైన్యంలో చేరనున్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాసి ఇంటర్వ్యూలో ఎంపికయ్యారు. త్వరలోనే శిక్షణ కోసం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి వెళ్లనున్నారు.

- ఫ్యామిలీలో

● తేరుకోలేకపోతున్నాం..

షాక్ అయ్యాం

చెన్నైలో 'ఇండియన్ 2' షూటింగ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. చిత్రీకరణ కోసం ఏర్పాటు చేసిన భారీ క్రేన్ కుప్పకూలి ముగ్గురు మృతి చెందిన ఘటన షాక్‌కు గురిచేసిందని కమల్ హాసన్ పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు కోటి రూపాయల విరాళం ప్రకటించారు.

- సినిమాలో

● నిర్భయ దోషికి గాయాలు

గోడకి తలబాదుకొని..

నిర్భయ అత్యాచారం, హత్య కేసు దోషుల్లో ఒకడైన వినయ్ శర్మ మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురై ఆదివారం తీహార్ జైలులో తల గోడకేసి బాదుకోవడంతో గాయాలయ్యాయి. వెంటనే అతనికి అక్కడిక్కడే తీహార్ జైలు వైద్యులే చికిత్స అందించినట్టు అధికారులు చెప్పారు.

- 5లో

● తమిళనాడులో 2 ప్రమాదాలు

27 మంది మృతి

తమిళనాడులో గురువారం వేకువజామున రెండు ఘోర ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రెండు ఘటనల్లో కలిపి 27 మంది ప్రాణాలు కోల్పోయారు. తిరుప్పూర్ జిల్లా అవినాశి వద్ద బస్సును లారీ ఢీకొన్న ఘటనలోనే 20 మంది ప్రయాణికులు మృతి చెందారు.

- 5లో

కంది.. రంధి!

రైతుల నుంచి కందులు కొనుగోలు చేయని మార్క్‌ఫెడ్

పోర్టల్‌లో పేరు లేదంటూ తిప్పి పంపిస్తున్న అధికారులు

ఎమ్మెల్యేలు, మంత్రి చెప్పినా పరిష్కారం కాని సమస్య	ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ అధికారుల జులుం	పలుచోట్ల ఆందోళనలు.. దళార్లకు అమ్ముకోవాల్సిన దుస్థితి	మార్క్‌ఫెడ్‌కు మద్దతు ధరకే అమ్ముకుంటున్న దళారులు

సాక్షి, హైదరాబాద్

కంది రైతుకు కష్టాలు వచ్చిపడ్డాయి. మద్దతు ధరకు కందులు విక్రయించాలని భావించినా మార్క్‌ఫెడ్ అధికారుల తీరుతో అదిసాధ్యం కావట్లేదు. మార్క్‌ఫెడ్ అధికారులు కొర్రీలు పెడుతూ రైతులను రాచిరంపాన పెడుతున్నారన్న విమర్శలున్నాయి. దళారులను చేరదీసి వారినుంచి అక్రమంగా కందులు కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రైతులకు సహకరించాలని, కంది రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా మార్క్‌ఫెడ్ అధికారులు సాకులు చెబుతూ రైతు పండించిన కందిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావట్లేదు. మరోవైపు అమ్మిన కందులకు డబ్బు లివ్వడంలోనూ మార్క్‌ఫెడ్ విఫలమవుతోంది. నాఫెడ్ నుంచి సొమ్ము రాబట్టలేకపోతోంది.

ఆన్‌లైన్‌లో పేరు లేకుంటే కొనరా?

వ్యవసాయ శాఖ గతేడాది ఎవరెవరు ఏ పంటలు పండించారన్న సమాచారం సేకరించింది. ఐతే ఆ లెక్కలు చాలావరకు కాకిలెక్కలా అన్న అనుమానాలు ప్రస్తుత పరిస్థితిని బట్టి అర్థమవుతోంది. ఆ లెక్కలను ఆన్‌లైన్‌లో ఎక్కించారు. కందులు పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చాక, ఆన్‌లైన్‌లో వారి పేరుతో కంది పండించారా లేదా పరిశీలిస్తారు. అయితే పోర్టల్‌లో ఆ రైతు వేరే పంట పండించారని ఉంటే, వెంటనే ఆ రైతును వెనక్కి పంపుతున్నారు. పోర్టల్‌లో పత్తి పండించినట్లుందని, కంది లేదని, కాబట్టి కందులు కొనుగోలు చేయబోమని చెప్పేస్తున్నారు. దీంతో రైతులు దళారులకు విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా సగం మంది రైతుల పేర్లు కంది పండించినట్లుగా లేకపోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి.

అధికారుల జులుం..

మార్కెట్లో దళారులు క్వింటాలుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల కంటే మిగతా 2వ పేజీలో ▶

● ఎల్లొద్దాం.. ఎములాడ

మహాశివరాత్రి సందర్భంగా దేదీప్యమానంగా ముస్తాబైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజ రాజేశ్వరస్వామి ఆలయం. గురువారం నుంచి మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్జిత సేవలుఅన్నింటినీ రద్దు చేసి లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రాజన్న గుడి చెరువులో రెండు వేల మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతరకు ఈసారి మూడు లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఉదయం స్వామివారికి టీటీడీ దేవస్థానం పక్షాన పట్టువస్త్రాలను సమర్పిస్తారు. ప్రభుత్వం తరఫున శ్రీస్వామి వారికి దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

- వేములవాడ

త్వరలో రాజ్యసభ 'ద్వైవార్షిక' నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్

పార్లమెంటు ఎగువ సభగా పేర్కొనే రాజ్యసభలో 245 మంది సభ్యులకు గాను ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నవంబర్ మధ్య 73 మంది సభ్యులు తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని రిటైర్ అవుతున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన ఇద్దరు సభ్యుల పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్ రెండో తేదీన ముగియనుంది. రాష్ట్రం నుంచి

ఏప్రిల్ 9న రెండు సీట్లు ఖాళీ

- రిటైర్డ్ సభ్యుల జాబితాలో గరికపాటి, కేవీపీ.. ఏపీ కోటాలో కేకే పదవీ విరమణ
- ఖాళీ అయ్యే రెండు సీట్లు ఈసారి టీఆర్ఎస్‌వే..!
- రేసులో కేకే, కవిత, పొంగులేటి

రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల జాబితాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీపీ రామచంద్రరావు, టీడీపీ నుంచి ఎన్నికై ప్రస్తుతం బీజేపీలో ఉన్న గరికపాటి మోహన్‌రావు ఉన్నారు. రాష్ట్ర పునర్విభజన సందర్భంగా ఏపీ కోటాకు కేటాయించిన టీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షం నేత కె.కేశవరావు కూడా ఏప్రిల్ 2న రాజ్యసభ సభ్యత్వం నుంచి రిటైర్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో జరిగే రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో గరికపాటి మోహన్‌రావు, కేవీపీ రామచంద్రరావు స్థానంలో... తెలంగాణ శాసనసభ్యులు ఇద్దరిని రాజ్యసభ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో జరిగే

మిగతా 2వ పేజీలో ▶

ఆకర్షణీయ పేర్లతో అడ్డగోలు దోపిడీ

- టాప్ ర్యాంకులు సాధించే కొద్దిమంది విద్యార్థులను ఎరగా చూపి కార్పొరేట్ విద్యా సంస్థలు వేల మంది తల్లిదండ్రులను ఆర్థికంగా దండుకుంటున్నాయి. అసౌకర్యాలు, అధిక ఒత్తిడితో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, తల్లిదండ్రులను మోసం చేస్తూ కార్పొరేట్ జూనియర్ కాలేజీలు 13 రకాల ఆకర్షణీయ పేర్లతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి.

4లో

తరలివచ్చిన జలతరంగిణి

- ఎస్సారెస్పీ పూర్తిస్థాయి ఆయకట్టుకు యాసంగిలో అందుతున్న సాగునీరు
- ఇప్పటికే సూర్యాపేట జిల్లా వరకు చేరిన గోదావరి జలాలు
- 69 టీఎంసీల వినియోగం.. 12 లక్షల ఎకరాలకు నీరు
- మార్చి వరకు మరో 20-25 టీఎంసీల మేర వినియోగం
- పునరుజ్జీవ పథకం ద్వారా వరద కాల్వకు సైతం అందుబాటులో నీరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా కురిసిన వర్షాలతో పెరిగిన నీటి లభ్యత, ఎగువ కాళేశ్వరం ద్వారా తరలివచ్చిన గోదావరి జలాలతో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పరీవాహకం ఉప్పొంగుతోంది. గత యాసంగి సీజన్లకు భిన్నంగా ఈ ఏడాది ఎస్సారెస్పీ-1, 2 కింద పూర్తి ఆయకట్టుకు నీరందించడంతో పాటు గరిష్టంగా 65 టీఎంసీల మేర నీటి వినియోగం జరిగింది. మరో 20 నుంచి 25 టీఎంసీల నీటిని మార్చి చివరి వరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటంతో రైతులకు ఉపశమనం కలుగుతోంది. కొత్తగా ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా వరద కాల్వ కింది చెరువులు నింపుతూ, ఆయకట్టుకు నీరిచ్చే ప్రక్రియ మొదలవడంతో జోష్ మరింత పెరిగింది.

చరిత్రలో తొలిసారి..

ఎస్సారెస్పీ ప్రాజెక్టులో స్టేజ్-1 కింద 9.6 లక్షలు, స్టేజ్-2 కింద 3.97 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గతేడాది వర్షాకాల సీజన్‌లో కురిసిన వర్షాలతో 159 టీఎంసీల మేర కొత్త నీరు వచ్చింది. ఇందులోంచి ఖరీఫ్‌లో నీటి వినియోగం పెద్దగా చేయలేదు. దీంతో యాసంగి మొదలయ్యే నాటికి ప్రాజెక్టులో 90 టీఎంసీలకు గాను.. 89 టీఎంసీల మేర లభ్యత ఉండటంతో స్టేజ్-1 కింద లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) వరకున్న 4.62 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఎస్సారెస్పీ నుంచి గతేడాది డిసెంబర్ 25 నుంచి నిరంతరాయంగా నీటిని 4 తడుల ద్వారా విడుదల చేసి సాగునీరిచ్చారు. దీనికే ఇప్పటి వరకు 25 టీఎంసీల మేర నీటి వినియోగం చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 90 టీఎంసీలకు 58 టీఎంసీల మేర నీటి లభ్యత ఉంది. లభ్యత నీటిలోంచి మరో 3 తడుల ద్వారా 20-25 టీఎంసీల మేర నీరిచ్చేందుకు

మిగతా 2వ పేజీలో ▶

ఆర్టీసీ కార్గోకు ప్రైవేటు కాంట్రాక్టర్ల పొగ?

ప్రభుత్వ విభాగాలు సరఫరా చేసే సరుకులు, వస్తువులన్నింటినీ కొత్తగా ప్రవేశపెట్టే కార్గో బస్సుల్లోనే సరఫరా చేసేందుకు ఆర్టీసీ సిద్ధమవుతుండగా ఆ బాధ్యత తమకే దక్కేలా ప్రైవేటు సంస్థలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

4లో

నానుడికత్

ఇక ఆపండి సార్!
అందరూ పగలబడి నవ్వుతున్నారు!

ఆక్రమణకు గురైన తమ స్థలాలు తిరిగి ఇప్పించాలంటూ బాధితులు ఇచ్చిన తాళిబొట్లు, చెవి కమ్మలు

లంచాలివ్వలేం.. తాళిబొట్లు తీసుకోండి

- ఆక్రమణకు గురైన స్థలాలకోసం బాధితుల వినూత్న నిరసన
- యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన
- తాళిబొట్లు, చెవికమ్మలు తీసిచ్చిన మహిళలు
- వాచీలు, ఉంగరాలు, సెల్‌ఫోన్లు ఇచ్చిన పురుషులు
- స్పందించిన తహసీల్దార్.. ఆక్రమణకు గురైన భూమి సర్వే

మోత్కూరు: 'మీకు లంచాలిచ్చేందుకు మా దగ్గర పైసల్లేవు. బండలు కొట్టి బతుకుతున్నం. మా తాళిబొట్లు, చెవికమ్మలు అన్నీ తీసుకొని మా భూమి మాకు ఇప్పించండి' అంటూ పలువురు బాధితులు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం వారికి కేటాయించిన ఇళ్లస్థలాలను అక్రమార్కుల చెర నుంచి విడిపించి అప్పగించాలంటూ రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఇలా వినూత్న రీతిలో నిరసనకు దిగారు.

విసిగిపోయి చివరికిలా...: 1985లో ఎన్టీఆర్ ప్రభుత్వం మోత్కూరు వడ్డెర కాలనీలోని

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణ, ఏపీకి బీజేపీ కొత్త అధ్యక్షులు

- సీఏఏపై మజ్లిస్, టీఆర్ఎస్ ఆలోచన ప్రమాదకరమైనది
- దేశానికి నష్టం చేకూర్చే విపక్షాల వైఖరి అణచే దిశగా ముందుకెళ్తాం
- బీజేపీ సీనియర్ నేత సీహెచ్ విద్యాసాగర్‌రావు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లకు బీజేపీ కొత్త అధ్యక్షులు రాబోతున్నారని ఆ పార్టీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు చెప్పారు. 'తెలంగాణ, ఏపీలో బీజేపీ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ముందుకు సాగే అవకాశం ఉంది. మొన్న జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరగడమే కాకుండా.. కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ లేకుండా పోయింది. ఇక్కడ బీజేపీనే టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయమని స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. ఏపీలో కూడా ఇదే

మిగతా 2వ పేజీలో ▶



పట్టణ ప్రగతికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్

పట్టణ ప్రగతి ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రగతి అమలు కోసం మున్సిపల్ పరిపాలన శాఖ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను మరింత సరళీకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ సూచించారు. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే పట్టణ ప్రగతి కార్యక్రమానికి సంబంధించి గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. వార్డులు, మున్సిపాలిటీల వారీగా సమాచారం సేకరించడంతో పాటు, ప్రతీ వార్డుకు ఒక నోడల్ అధికారిని నియమించాలని, పట్టణ ప్రగతిలో పాల్గొనేందుకు మున్సిపాలిటీ స్థాయిలో అధికార బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ వార్డు స్థాయిలో నాలుగు కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులు ఉండేలా చూడాలన్నారు. కమిటీల ఏర్పాటుతో పాటు కమిటీల సమాచారాన్ని అప్‌లోడ్ చేయడంలో కొన్ని జిల్లాలు వెనుకంజలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం, హరితహారం, కమ్యూనిటీ టాయిలెట్ల కోసం ప్రణాళిక, శ్మశాన వాటికలు, నర్సరీల అభివృద్ధి, సమీకృత కూరగాయలు, మాంసం మార్కెట్లు, ఆట స్థలాలు, పార్కులు తదితరాలపై దృష్టి సారించాలన్నారు. నిరక్షరాస్యులను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలన్నారు. పట్టణ ప్రగతి కోసం ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీహెచ్‌ఎంసీకి రూ.156 కోట్లు, ఇతర మున్సిపాలిటీలకు రూ.140 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసిందన్నారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, సీడీఎంఏ సత్యనారాయణ, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆◆◆

వేములవాడకు హెలికాప్టర్ సర్వీసులు

- త్వరలో ప్రముఖ దేవాలయాలకు హెలికాప్టర్ సర్వీసులు
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

హెలికాప్టర్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే చెన్నమనేని తదితరులు

సాక్షి, హైదరాబాద్: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి తెలంగాణ పర్యాటక శాఖ హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభించింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని నగరంలోని భక్తులకు ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. బేగంపేట విమానాశ్రయంలో గురువారం మంత్రి శ్రీనివాస్ గౌడ్, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, టూరిజం శాఖ చైర్మన్ భూపతి రెడ్డి, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి సర్వీసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల మేడారం జాతరలో ప్రత్యేక హెలికాప్టర్ సర్వీస్ బాగా నడిపించామన్నారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక హెలికాప్టర్ సర్వీస్‌ను నడిపిస్తున్నామని తెలిపారు. టికెట్ ధర హైదరాబాద్ నుంచి వేములవాడకు రూ.30,000 ఉంటుందని చెప్పారు. పర్యాటకరంగాన్ని మరింత పెంచేందుకు సీఎం ఆదేశాల మేరకు ప్రముఖ దేవాలయాలకు హెలికాప్టర్ సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. హెలికాప్టర్‌లో వెళ్లిన వారికి ప్రత్యేక దర్శనం ఉంటుందన్నారు. వేములవాడకు ప్రత్యేక టూరిజం బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ వేములవాడలో జాయ్ రైడ్‌కు రూ. 3,000, వేములవాడ, మిడ్ మానేరు రైడ్‌కు రూ.5,500 చెల్లించాలని తెలిపారు. త్వరలో కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు కూడా హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభిస్తామని ప్రకటించారు. మూడ్రోజుల పాటు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. బుకింగ్ కోసం 09400399999, 09880505905 నంబర్లలో సంప్రదించాలన్నారు.

◆◆◆

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వడ్డెర కాలనీవాసులు

లంచాలివ్వలేం.. తాళిబొట్లు తీసుకోండి

▶ మొదటి పేజీ తరువాయి

సర్వే నెంబర్ 610లో 3.39 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాల కోసం కేటాయించి కొన్ని ఇళ్లు నిర్మించింది. ప్రస్తుతం ఆ కాలనీ 2.39 ఎకరాలకు విస్తరించింది. మిగిలిన ఎకరం స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని తమ స్థలాన్ని తమకు అప్పగించాలని కోరుతూ పలుమార్లు బాధితులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఎంతగా పోరాడినా ఫలితం లేకపోవడంతో విసిగిపోయారు. దీంతో గురువారం వారంతా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ షేక్ అహ్మద్‌ను, ఇతర సిబ్బందిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్వేగానికి గురైన మహిళలు.. లంచాలు ఇవ్వడానికి తమ దగ్గర డబ్బుల్లేవంటూ మెడలో ఉన్న తాళిబొట్లు, చెవికమ్మలు తీసి ఇవ్వగా, పురుషులు తమ ఉంగరాలు, వాచీలు, సెల్‌ఫోన్లు తీసి ఓ టవల్‌లో వేశారు. అవన్నీ తీసుకుని తమ భూమి తమకు ఇప్పించాలని తహసీల్దార్‌ను వేడుకున్నారు. సమస్య పరిష్కరిస్తానని, ఆందోళన విరమించాలని తహసీల్దార్ హామీ ఇచ్చినప్పటికీ.. వెంటనే పరిష్కరిస్తేనే ఆందోళన విరమిస్తామంటూ వారు భీష్మించుకుని కూర్చున్నారు.

10 గుంటల్లో అక్రమ నిర్మాణాలు...

కాలనీవాసుల ఆందోళనతో ఎట్టకేలకు స్పందించిన తహసీల్దార్ షేక్ అహ్మద్.. సర్వేయర్ శ్రీనివాస్‌రాజు, ఆర్‌ఐ నజీర్, వీఆర్వోలతో కలిసి ఆ కాలనీకి వెళ్లారు. ఆక్రమించిన స్థలాన్ని పరిశీలించి సర్వే చేయించారు. మొత్తం 3.39 ఎకరాల భూమిలో 2.39 ఎకరాల్లో కాలనీవాసులు ఇళ్లు నిర్మించుకున్నారని, ఆక్రమణకు గురైన ఎకరం భూమిలో పది గుంటలు రోడ్డులో పోగా 30 గుంటల భూమి మిగిలి ఉందని నిర్ధారించారు. అందులో 10 గుంటల స్థలంలో ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టారని తహశీల్దార్ తెలిపారు. ఆక్రమణదారులకు ఇదివరకే ఒకసారి నోటీసులు ఇచ్చామని, ఇప్పుడు మరోసారి నోటీసులు ఇచ్చి నిర్మాణాలు తొలగించి కాలనీవాసులు అప్పగిస్తామని చెప్పారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

మెడలోంచి పుస్తెలతాళ్లు, చెవి కమ్మలు తీసి ఇస్తున్న మహిళలు

మహా శివరాత్రి సందర్భంగా గురువారం విద్యుత్ కాంతులతో వెలుగులీనుతున్న నల్లగొండ పట్టణంలోని పానగల్ ఛాయ సోమేశ్వరాలయం

తెలంగాణ, ఏపీకి బీజేపీ కొత్త అధ్యక్షులు

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితి ఉంది. అక్కడా తొందరగా మార్పులు వచ్చే అవకాశం ఉంది..'అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలసిన అనంతరం విద్యాసాగర్‌రావు మీడియాతో మాట్లాడారు.

సీఏఏతో నష్టం లేకున్నా..

టీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విద్యాసాగర్‌రావు అన్నారు. 'సీఏఏలో ఎలాంటి నష్టదాయక చర్యలు లేకున్నప్పటికీ దానిపై తుపాకీ పెట్టి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా విమర్శలు గుప్పిస్తున్నారు. సీఏఏపై మజ్లిస్, టీఆర్ఎస్‌ల ఆలోచన ప్రమాదకరమైనది. ప్రతిపక్షాల ఆలోచనలు దేశానికే నష్టం కలిగించేలా ఉన్నాయి. వీటిని అణచాల్సిన బాధ్యత బీజేపీపై ఉంది. కాబట్టి ఆ దిశగా ముందుకెళ్తాం. ముస్లిం సోదరుల పౌరసత్వం తిరస్కరణకు గురవుతుందన్న ఆలోచన సరికాదు. ఇప్పుడున్న చట్టం ప్రకారం ఒక ముస్లిం వ్యక్తి దరఖాస్తు చేసుకుంటే హోంశాఖ ఇస్తుంది. నేను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు పాకిస్తాన్ నుంచి వచ్చిన యువతికి పౌరసత్వం ఇచ్చాను. అందువల్ల మీ ఆలోచన సరికాదు. జాతి సమైక్యతకు ఎన్ఆర్సీ, సీఏఏ, ఎన్పీఆర్‌ల అవసరం ఎంతో ఉంది. ముస్లిం యువత జాతీయ జెండాలతో బయటకు వస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్న ముస్లిం యువత వందేమాతరం, జనగణమన ఆలపించి కార్యక్రమాన్ని ముగించగలరా..? తెలంగాణలో పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తాం. సెప్టెంబర్ 17కు సంబంధించి తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా అమలు చేయాలని నిరసనలు చేపడతాం..'అని వెల్లడించారు. బీజేపీ కార్యకర్తగా పార్టీ ఇచ్చే కార్యక్రమాలు అమలు చేస్తాను..'అని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

త్వరలో రాజ్యసభ 'ద్వైవార్షిక' నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఇద్దరు సభ్యుల ఎన్నిక కోసం ఈ నెల చివరన లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. నిబంధనల ప్రకారం సభ్యుల పదవీ కాలం ముగియడానికి 50 రోజుల ముందే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది.

రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఏడుగురు

రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఏడుగురు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తుండగా ప్రస్తుతం అధికార పార్టీ టీఆర్ఎస్ పార్టీకి ఆరుగురు సభ్యులున్నారు. వీరిలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే రిటైర్ అవుతున్నారు. రాష్ట్ర శాసనసభ్యులు పరోక్ష ఓటింగ్ ద్వారా రాజ్యసభ సభ్యులను ఎన్నుకోనుండగా, అసెంబ్లీలో టీఆర్ఎస్‌కు ఉన్న సంఖ్యా బలం పరంగా చూస్తే రెండు స్థానాలు ఆ పార్టీకే దక్కే సూచనలున్నాయి. 119 మంది శాసనభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో సంఖ్యాపరంగా చూస్తే ప్రస్తుతం టీఆర్ఎస్‌కు 104, ఎఐఎంఐఎంకు 7, కాంగ్రెస్‌కు 6, టీడీపీ, బీజేపీకి ఒక్కో సభ్యుడు చొప్పున ఉన్నారు. 2018 మార్చిలో రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ సీట్ల కోసం జరిగిన ద్వైవార్షిక ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ పి.బలరాంనాయక్‌ను బరిలోకి దించినా, ఎంఐఎం మద్దతుతో టీఆర్ఎస్ మూడు స్థానాల్లోనూ గెలుపొందింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టీఆర్ఎస్ పార్టీకి ఎంఐఎం మిత్రపక్షంగా వ్యవహరిస్తుండటంతో ద్వైవార్షిక ఎన్నికలు జరిగే రెండు రాజ్యసభ స్థానాలు టీఆర్ఎస్‌కే దక్కే అవకాశముంది. దీంతో ద్వైవార్షిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని 7 రాజ్యసభ స్థానాలు టీఆర్ఎస్ పరమయ్యే అవకాశం ఉంది.

ఆశావహుల జాబితాలో పలువురు నేతలు

త్వరలో జరిగే రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో అవకాశం కోసం పలువురు టీఆర్ఎస్ నేతలు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం రిటైరవుతున్న పార్టీ పార్లమెంటరీ నేత కేకే మరోమారు రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఓటమి చెందిన మాజీ ఎంపీ కవిత పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది. వీరితో పాటు గతేడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ అవకాశం దక్కని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మందా జగన్నాథం, ప్రొఫెసర్ సీతారాం నాయక్‌తో పాటు ఇతరులు కూడా రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారు. ప్రస్తుతం పార్టీకి రాజ్యసభలో ఆరుగురు సభ్యుల బలం ఉన్నా అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు లేకపోవడంతో తమకు ప్రాతినిధ్యం ఇవ్వాలని పార్టీ అధినేత కేసీఆర్‌ను కోరుతున్నారు.

విద్యుత్ దీప కాంతుల్లో వెలిగిపోతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని గణపేశ్వరాలయం

తరలివచ్చిన జలతరంగిణి

▶ మొదటి పేజీ తరువాయి

సిద్ధంగా ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఇక ఎల్ఎండీ దిగువన స్టేజ్-1 కిందే ఉన్న మరో 5లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా ఎల్ఎండీకి ఎత్తిపోసిన నీటితో సాగునీరిచ్చారు. స్టేజ్-1 కిందే మొత్తంగా 9.5 లక్షల వరకు ప్రస్తుతం సాగునీరందింది. ఇక స్టేజ్-2 కింద 3.97లక్షల ఎకరాలకు గానూ 2.5 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నారు. దీంతోపాటే 592 చెరువులను నింపుతున్నారు. ఎల్ఎండీ దిగువన మొత్తం 44 టీఎంసీల మేర నీటిని వినియోగించారు. టెయిల్ టు హెడ్ అనే పద్ధతిన నీరు పంపిణీ చేయడంతో ఆయకట్టు చివరి జిల్లా అయిన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలానికి గోదావరి నీళ్లు చేరాయి. మొత్తంగా ఎస్సారెస్పీ కింద చరిత్రలో తొలిసారి 12 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరందింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 69 టీఎంసీల మేర నీటి వినియోగం జరిగింది. గడిచిన పదేళ్లలో యాసంగిలో జరిగిన వినియోగాన్ని పరిశీలిస్తే గరిష్టంగా 2010-11 ఏడాదుల్లో 57.96 టీఎంసీలుగా మాత్రమే ఉంది. కానీ ఇప్పటికే 69 టీఎంసీల మేర వినియోగం పూర్తవ్వడం, మరింత నీటి వినియోగానికి సిద్ధంగా ఉండటంతో మార్చి చివరికి 100 టీఎంసీల మార్కును దాటే అవకాశాలున్నాయి.

పునరుజ్జీవంతో మరింత మేలు..

ఎస్సారెస్పీపైనే ఆధారపడిన వరద కాల్వకు సైతం పునరుజ్జీవ పథకం ద్వారా నీరందిస్తున్నారు. పునరుజ్జీవ పథకంలో భాగంగా ఉన్న రాంపూర్, రాజేశ్వరరావుపేటలోని మోటార్లను ఆరంభించి కాల్వకు నీటిని విడుదల చేశారు. ఒక టీఎంసీ నీటిని పంపింగ్ చేసి 50 చెరువులను నింపనున్నారు. దీంతో పాటే వరద కాల్వ పరిధిలో బోరు మోటార్ల ద్వారా

సాగు చేసిన ఆయకట్టుకు నీటి లభ్యత పెంచనున్నారు. ఎస్సారెస్పీలో ఏప్రిల్ నాటికి యాసంగి వినియోగంతో లభ్యత పడిపోగానే ఇదే ఎగువ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఖాళీ చేసి పునరుజ్జీవన పథకం ద్వారా మళ్లీ నింపనున్నారు. దీంతో మళ్లీ ఖరీఫ్‌లో సాగుకు నీటి కొరత లేకుండా చూసేలా ఇదివరకే ప్రణాళిక రచించారు.

గత పదేళ్లలో ఎస్సారెస్పీకి వచ్చిన వరద నీరు, వినియోగం.. (టీఎంసీల్లో)

సంవత్సరం	వచ్చిన వరద	నీటి వినియోగం
2009-10	27.34	13.61
2010-11	308.82	57.96
2011-12	174.20	33.67
2012-13	54.73	27.38
2013-14	320	56.60
2014-15	14.77	4.11
2015-16	4.42	1.61
2016-17	356.26	43.47
2017-18	75.31	33.42
2018-19	77.17	17.10
2019-20	159	69

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు విధానంలో మార్పు

బయటి సంస్థల నుంచి కూడా కొనుగోలు చేసుకునేలా నిబంధనల్లో మార్పు

సాక్షి, హైదరాబాద్: బహుళ గృహ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీ, ప్రైవేటు సంస్థల విద్యుత్ వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు విధానంలో దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ కొన్ని మార్పులు చేసింది. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం నిర్ణీత రుసుమును చెల్లించిన వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ సమకూరుస్తుండగా, కొత్త విధానం ప్రకారం బయటి సంస్థల నుంచి కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. 25 కేవీఏ,63 కేవీఏ,100 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్, కేబుల్స్, వివిధ పరికరాలు అవసరాలకు సరిపడా తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

వేసవి నేపథ్యంలో..

వేసవిని దృష్టిలో పెట్టుకుని 160 కేవీఏ సామర్థ్యం కలిగిన రెండు వందల ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని రఘుమారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలో ఉపయోగించే 'అమార్ఫస్ కోర్'అనే ముడి పదార్థాన్ని చైనా నుంచి దిగుమతి చేసుకుంటుండగా, ప్రస్తుతం సరఫరాలో జాప్యం ఏర్పడుతోందన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ తయారీ సంస్థలు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేయలేకపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అధీకృత డీలర్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసి టీఎస్ఎస్‌డీఎస్ఎల్ ద్వారా విద్యుత్ కనెక్షన్లు పొందవచ్చని రఘుమారెడ్డి తెలిపారు.

కంది.. రంధి!

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కువకు కొనట్లేరు. అటు మార్క్‌ఫెడ్ తీసుకోక, ఇటు దళారులు తక్కువ ధరకు అడుగుతుండటంతో కంది రైతు కన్నీరు పెడుతున్నాడు. పైగా 'ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో'అని మార్క్‌ఫెడ్ అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారని కొందరు రైతులు వాపోతున్నారు. పలువురు రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకాలు చూపించినా, కంది పంటను సాగుచేసినట్లు అధికారుల ద్వారా ధ్రువీకరణ పత్రాలు తెచ్చినా మార్క్‌ఫెడ్ అధికారులు ససేమిరా అంటున్నారు. ఒకవేళ ఆన్‌లైన్ పోర్టల్‌లో సంబంధిత రైతు కంది పండించినట్లు పేరున్నా, అతను పండించినంతా కొనట్లేదు. తమకు కేంద్రం నిర్దేశించిన కోటా ప్రకారమే కొంటున్నామని, అంతా కొనలేమంటూ తేల్చేస్తున్నారు. ఆన్‌లైన్ సమస్యపై పలువురు ఎమ్మెల్యేలు, ఓ మంత్రి స్వయంగా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

సొమ్ము ఎప్పుడిస్తారో?

రాష్ట్రంలో ఈసారి 2.07 లక్షల మెట్రిక్ టన్నుల కంది దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో కేంద్రం 47,500 మెట్రిక్ టన్నులు మాత్రమే మద్దతు ధరకు కొంటామని తేల్చిచెప్పింది. ఇంకా 56 వేల మెట్రిక్ టన్నులు కొనాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పలుసార్లు విజ్ఞప్తి చేసింది. కానీ ఇప్పటివరకు కేంద్రం నుంచి అనుమతి రాలేదు. అంటే ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్రం కొనుగోలు చేసేది 47,500 మెట్రిక్ టన్నులు మాత్రమే. మిగిలిన దాన్ని కేంద్రం కొనుగోలు చేయకపోయినా తాము కొంటామని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై ఇంకా అధికారికంగా నిర్ణయం ప్రకటించలేదు. అయితే మార్క్‌ఫెడ్ ఇప్పటివరకు 44,833 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేసింది. వాటి విలువ రూ.260.04 కోట్లు. కానీ ఇప్పటివరకు రైతులకు రూ.29.69 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.230.35 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో రైతులు మార్క్‌ఫెడ్‌కు అమ్ముకున్నా సకాలంలో సొమ్ము రాకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు రైతుల నుంచి రూ.4 వేల నుంచి రూ.5 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు. అదే దళారులు అనేకచోట్ల రైతుల నుంచి కొన్న కందులను మార్క్‌ఫెడ్‌కు మద్దతు ధర కింద రూ.5,800కు విక్రయిస్తున్నారు. దీనికి మార్క్‌ఫెడ్‌లో కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అందుకోసం కమీషన్ల రూపంలో దళారుల నుంచి ముడుపులు వస్తున్నాయి. రైతును అడ్డం పెట్టుకొని అటు దళారి, ఇటు కొందరు మార్క్‌ఫెడ్ అధికారులు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

తిప్పి పంపేశారు

మూడు ఎకరాల్లో పత్తి పంటలో అంతర్ పంటగా కంది వేశాను. దాదాపు 13 క్వింటాళ్ల కంది దిగుబడి వచ్చింది. వీటిని విక్రయించేందుకు 15 రోజుల క్రితం మార్కెట్ యార్డులోని కంది కొనుగోలు కేంద్రానికి వెళ్లాను. ఆన్‌లైన్‌లో నా పేరు లేదని, తిప్పి పంపారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో పేరు నమోదైనా రెండున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో ఏమీ చేయలేక దళారులకు విక్రయించాలని నిర్ణయించుకున్నాను.

– బాజా నాగేశ్వర్‌రావు, సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా

కొనుగోళ్లు నిలిపివేశారు

4 ఎకరాల్లో పత్తి, కంది పంట సాగుచేశాను. కంది పంట 10 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. తాంసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయిద్దామనుకుంటే రెండు రోజులే కొనుగోలు చేసి నిలిపేశారు. మళ్లీ ఎప్పుడు కొనుగోలు కేంద్రాలను తెరుస్తారో చెప్పట్లేదు. దళారులకు అమ్ముకుందామంటే తక్కువ ధరకు అడుగుతున్నారు.

– బెండే లక్ష్మణ్, వడ్డాడి గ్రామం, తాంసి మండలం, ఆదిలాబాద్ జిల్లా

ఇబ్బంది పెడితే ఎలా?

10 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. దాదాపు 20 క్వింటాళ్లకు పైగానే దిగుబడి వచ్చింది. కానీ నా పేరు జాబితాలో లేదని కొనలేమని చెబుతున్నారు. నేను వేసిన కంది పంట పొలం చూపిస్తాను.. వచ్చి చూసుకోవాలని చెప్పాను. కంది పంట వేయకపోతే అభ్యంతరం చెప్పాలి కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులను ఇబ్బంది పెడితే ఎలా? రైతుల పేర్లు లేకపోతే ఈ కొనుగోలు కేంద్రం ఎందుకు పెట్టారు.. తీసేయండి. అధికారులకు నాయకులకు రైతుల ఇబ్బందులు కనిపించటం లేదా?

– కె.క్రిష్ణారెడ్డి, రైతు, చేవెళ్ల గ్రామం, రంగారెడ్డి జిల్లా

పేరు లేదని కొనట్లేదు

ఈ ఏడాది 5 ఎకరాల్లో కంది పంట సాగుచేశాను. కందులు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రానికి వస్తే ఆన్‌లైన్ జాబితాలో కంది సాగు చేసినట్లు పేరు లేదని అధికారులు చెప్పారు. నీ కందులు ఇక్కడ కొనలేమని అంటున్నారు. నేను కంది సాగు చేస్తే నాపేరు లేకపోవడమేంటి? ఎవరు రాశారని అడిగితే వ్యవసాయాధికారులు ఇచ్చిన జాబితా మా దగ్గర ఉందంటున్నారు. ఇందులో పేర్లు ఉంటేనే కొనాలని మాకు అదేశాలు ఉన్నాయని చెబుతున్నారు.

–ఎం.రాంరెడ్డి, రైతు, మల్లారెడ్డిగూడ, చేవెళ్ల మండలం, రంగారెడ్డి జిల్లా

ఆన్‌లైన్ సమస్య వాస్తవమే

ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు లేకపోవడంతో సమస్య ఉంది. దీన్ని ఎలా పరిష్కరించాలన్న విషయంపై ప్రభుత్వానికి విన్నవించాం. మరోవైపు రైతుల నుంచి రూ.260 కోట్ల విలువైన కందులను కొనుగోలు చేశాం. వారికి ఇప్పటివరకు రూ.29.69 కోట్లు మాత్రమే ఇచ్చాం. ఇంకా నాఫెడ్ నుంచి రావాల్సి ఉంది. కేంద్రం పరిమితి విధించడంతో ఇప్పటికే దాదాపు 10 జిల్లాల్లో వారి కోటా పూర్తయింది. మిగిలినది కొనాలంటే కేంద్రం నుంచి అనుమతి రావాలి. అందుకోసం మరో 56 వేల మెట్రిక్ టన్నులు కొనాలని ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది.

– చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ ప్రొక్యూర్‌మెంట్ అధికారి, హైదరాబాద్

గోదావరికి జలకళ

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో కాళేశ్వరం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నిండుకుండను తలపిస్తోంది. గురువారం సాయంత్రం వరకు నీటి మట్టం 99.5 మీటర్ల ఎత్తులో నిలిచి భక్తులకు కనువిందు చేస్తోంది. ప్రతి శివరాత్రి పర్వదినం సమయంలో గోదావరి నీటిమట్టం పూర్తిగా తగ్గి ఎండిపోయి కనిపించేది. ప్రస్తుతం పుష్కరఘాట్ నీటితో కళకళలాడుతోంది. లక్ష్మీబ్యారేజీ నుంచి కాళేశ్వరం వరకు సుమారు 26 కిలోమీటర్ల మేర బ్యాక్ వాటర్‌తో సముద్రం మాదిరిగా కనిపిస్తోంది. శివరాత్రి తర్వాత మోటార్లను రన్ చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

– కాళేశ్వరం

ఇది సంస్కరణల తెలంగాణ

ఐదేళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి

- పని చేయకుంటే పదవి పోతుంది
- అందరూ భగీరథ నీళ్లే తాగాలి
- ప్రతి నెలా పంచాయతీలకు రూ .339 కోట్లు
- పంచాయతీరాజ్ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్రం ఐదేళ్లలో అనేక సంస్కరణలకు వేదిక అయిందని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన పల్లె ప్రగతిపై పంచాయతీరాజ్ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పది జిల్లాలు ఉన్న తెలంగాణ పరిపాలన సౌలభ్యం కోసం 33 జిల్లాలుగా మారిందన్నారు. కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీలతో ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు. పల్లె ముఖచిత్రం మార్చేందుకు పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని, ఆ మార్పును కొనసాగించే దిశగా ఇప్పుడు గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం పెంచి పల్లెలను తీర్చిదిద్దాలని కోరారు. పంచాయతీలకు ప్రతినెలా రూ.339 కోట్లు కేటాయిస్తున్నామని, ప్రతి ఊరిలో ట్రాక్టర్ ఉండాలన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పనిచేయకుంటే పదవులు కోల్పోతారని, ఈ విషయంలో కఠినంగా ఉంటామని మంత్రి హెచ్చరించారు. టీఆర్ఎస్ పార్టీ వాళ్లనే ముందు తొలగిస్తామని స్పష్టం చేశారు.

పల్లె ముఖచిత్రం మారాలి

ప్రతి ఊరిలో నర్సరీ ఉండాలని, చెత్త లేకుండా వీధి శుభ్రంగా ఉండాలని, డంపు యార్డులు, శ్మశాన వాటికలు, ఇంకుడు గుంతలు ఉండాలని కేటీఆర్ సూచించారు. పల్లెల్లో సేకరించే తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, పొడి చెత్తను విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తామని చెప్పారు. ఏ ఊరికి ఆ ఊరి ప్రజాప్రతినిధులే కథానాయకులై పల్లెల్లో మార్పు తేవాలన్నారు. అందరూ మిషన్ భగీరథ నీళ్లనే తాగాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆర్వో ప్లాంట్లు మూసివేయాలన్నారు.

ఆకస్మిక తనిఖీలు ఉంటాయి

రాష్ట్రంలో పల్లెల్లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సహా అందరూ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తారని, పల్లెల్లో మార్పు కనిపించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామసభను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. నాటిన మొక్కల్లో 85 శాతం బతకాలన్నారు. జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్‌లకు ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేస్తుందని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం నింపుతాం

ఆడపిల్లలకు ఆత్మరక్షణకు శిక్షణ ఇస్తామని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతామని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో బాలికల హాస్టల్‌లో లైంగిక వేధింపుల ఘటనపై ఆయన గురువారం హాస్టల్‌ను సందర్శించి బాలికలతో మాట్లాడారు. ఇలాంటి ఘటన దురదృష్టకరమని, ఎవరూ చేసినా తప్పేనని కేటీఆర్ అన్నారు. ఈ విషయం తెలియగానే దేవయ్యను టీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించామని, చట్టప్రకారం అరెస్టు చేసి జైలుకు పంపామన్నారు.

సిరిసిల్లలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

పెద్దతండాలో పల్లె ప్రగతిని పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి

వార్ కాకి.. వార్ కాక..!

- జనంతో మంత్రి సత్యవతి ఆత్మీయ పలకరింపు
- సొంతూరులో పల్లె నిద్ర.. పల్లె ప్రగతి పనుల పరిశీలన

కురవి: గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండాలో పల్లె నిద్ర చేశారు. గురువారం తెల్లవారుజామునే నిద్ర లేచిన మంత్రి.. వేప పుల్లతో పండ్లు తోముకుంటూ సొంతూరులో జరిగిన పల్లెప్రగతి పనులను పరిశీలించారు. జనం వద్దకు వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. వార్ కాకి.. వార్ కాకా.. వార్ బాబు.. వార్ బాయి.. (ఎలా ఉన్నావు చిన్నమ్మ, చిన్నాయన, బాపు, అక్కా) అని పలకరిస్తూ వాడవాడలా కలియ తిరిగారు. ఊరిలోని నర్సరీని పరిశీలించి మొక్కలు బాగా పెరగడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న 'పల్లె ప్రగతి'పనులతో గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తోందని చెప్పారు. 30 ఏళ్లుగా గ్రామస్తులతో తనకు అనుబంధం ఉందన్నారు.

పెళ్లి చేసుకుంటావా.. కేసు పెట్టమంటావా?

ఎస్ఐ వేధింపులకు యువకుడి ఆత్మహత్య

మారుతి

కోస్గి: పోలీసులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం చంద్రవంచకు చెందిన మారుతి (19) డిగ్రీ మధ్యలోనే ఆపివేసి హైదరాబాద్‌లో పని చేసుకుంటుండేవాడు. ఏడాదిగా ప్రేమ వ్యవహారం నడిపి తనకు గర్భం రావడానికి కారణమయ్యాడని అదే గ్రామానికి చెందిన ఓ యువతి ఈనెల 17న పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అతడిని స్టేషన్‌కు రప్పించి 'అమ్మాయిని పెళ్లి చేసుకుంటావా.. కేసు పెట్టమంటావా?'అనడంతో భయపడిన మారుతి పెళ్లి చేసుకుంటానని అంగీకారపత్రం రాసిచ్చాడు. ఆ మరుసటి రోజే స్థానిక సాయిబాబా మందిరంలో పెళ్లి చేసేందుకు ఎస్ఐ ఏర్పాట్లు చేశారు. కాగా, చివరి నిమిషంలో మారుతి, తాను మైనర్‌నని.. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా నమోదైందని తెలిపాడు. దీంతో బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని ఎస్ఐ సూచించడంతో అక్కడి నుంచి బయటకు వచ్చిన మారుతి తప్పించుకుని హైదరాబాద్‌కు పారిపోయాడు. తనపై కేసు నమోదు చేశారన్న విషయం తెలుసుకున్న మారుతి బుధవారం రాత్రి స్వగ్రామానికి వచ్చి అర్ధరాత్రి ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడు. కాగా ఎస్ఐ నాగరాజు భయపెట్టడం వల్లే మారుతి ఆత్మహత్య చేసుకున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

దివ్య మరెవరికీ దక్కకూడదనే..

- బ్యాంకు ఉద్యోగి హత్య కేసులో నిందితుడి అరెస్టు
- గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు
- కోర్టులో హాజరుపరిచి.. రిమాండ్‌కు తరలింపు

నిందితుడు వెంకటేశ్‌గౌడ్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గజ్వేల్: సంచలనం సృష్టించిన బ్యాంకు ఉద్యోగి దివ్య హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ శ్వేత గురువారం దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18న గజ్వేల్‌లో హత్యకు గురైన దివ్య తండ్రి లక్ష్మీరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడకు చెందిన వెంకటేశ్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం రాత్రి వేములవాడలో ప్రత్యేక బృందం పోలీసులు వెంకటేశ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. కాగా, తనకు దక్కని దివ్య మరెవరికీ దక్కకూడదనే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు విచారణలో వెంకటేశ్ చెప్పాడని, నిందితునికి కఠిన శిక్ష పడేలా చూస్తామని ఇన్‌చార్జి సీపీ పేర్కొన్నారు. కేసును 24 గంటల్లో ఛేదించిన గజ్వేల్ ఏసీపీ నారాయణ, సీఐ ఆంజనేయులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ శ్వేత అభినందించారు.

నిందితునికి వైద్య పరీక్షలు

నిందితుడు వెంకటేశ్‌గౌడ్‌ను గజ్వేల్ పోలీస్ స్టేషన్ నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ప్రాంగణం వద్ద విలేకరులు వెంకటేశ్‌గౌడ్‌ను సంఘటనకు దారితీసిన పరిస్థితులపై ప్రశ్నించగా.. అతను నోరు విప్పలేదు. సుమారు 15 నిమిషాలపాటు వైద్య పరీక్షలు సాగాయి. ఆ తర్వాత పోలీసులు అతడిని గట్టి బందోబస్తు మధ్య గజ్వేల్‌లోని కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు.

చించావు పో రష్మిక!

జగిత్యాల కలెక్టర్ ట్విట్టర్ ఖాతా నుంచి పోస్ట్

- వైరల్ అయిన ట్వీట్
- పోస్ట్ పెట్టలేదన్న కలెక్టర్
- ఎస్పీ సింధూశర్మకి ఫిర్యాదు
- ఇద్దరు ఉద్యోగులపై వేటు

కలెక్టర్ రవి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సినీ నటి రష్మిక ఫొటోలపై జగిత్యాల కలెక్టర్ ట్విట్టర్‌లో కామెంట్ చేసినట్లు కొన్ని టీవీ చానెళ్లు, సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశమైంది. కలెక్టర్ హోదాలో ఉన్న అధికారి ఓ నటిపై కామెంట్ చేయడం ఏమిటనే విమర్శలకు దారితీసింది. బుధవారం మధ్యాహ్నం 2.38 గంటలకు నటి రష్మికకు కలెక్టర్ అధికారిక ట్విట్టర్ ఖాతా (collector@jagtial) నుంచి 'చించావు పో రష్మిక'అనే కామెంట్ పోస్ట్ అయింది. ఇది సోషల్ మీడియాలో దుమారం లేపింది. దీంతోపాటు పలు మీడియా చానళ్లలో ఈ వార్త ఒకేసారి రావడం అధికార వర్గాలను ఇబ్బందికి గురి చేసింది. ఈ పోస్టింగ్ వెళ్లిన సమయంలో కలెక్టర్ రవి.. మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో ఓ అధికారిక సమావేశంలో పాల్గొనడం గమనార్హం.

నాకు ట్విట్టర్ ఖాతానే లేదు: కలెక్టర్

ఈ విషయమై కలెక్టర్ రవిని వివరణ కోరగా తనకు ట్విట్టర్ ఖాతానే లేదని, ట్విట్టర్ ఉపయోగించేంత సమయం కూడా లేదని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 2.38 గంటలకు బ్రహ్మోత్సవాలకు సంబంధించి మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నానని పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్పీ సింధూశర్మకు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో కలెక్టర్‌కు ట్విట్టర్ ఖాతా ఉండేదని, ఆ ఖాతాను ప్రసాద్ అనే ఉద్యోగి చూస్తున్నాడని, అతనిని విచారించామని తెలిపారు. వేరే ఉద్యోగులు చేశారా అనే దానిపై కూడా విచారణ చేపట్టామన్నారు.

ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులపై వేటు

జగిత్యాలక్రైం: కాగా, ఈ ఘటనపై డీఆర్వో అరుణశ్రీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కలెక్టర్ రవి ట్విట్టర్ ఖాతాను నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రసాద్, మమతలను తొలగించారు.

ట్విట్టర్ పోస్టు

ట్విన్స్ @ 20

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ డీఏవీ పాఠశాలలో చదువుతున్న కవల పిల్లలు

పాల్వంచ: జంట కవలలు రోడ్డు వెంట వెళ్తుంటేనే ఆశ్చర్యంగా చూస్తాం. ఒక్కటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 20 కవల జంటలు.. అదీ ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. చెప్పేందుకు వింతగా ఉన్నా.. ఇది నిజం. ఈనెల 22న కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ కాలనీలో గల డీఏవీ పాఠశాలలో గురువారం కవలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కేటీపీఎస్ ఎస్ఈ జీవీ.ధర్మారావు, ప్రిన్సిపాల్ రామారావు, నృత్య శిక్షకులు కృష్ణారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శుభానందదేవికి స్వర్ణ కిరీటం అలంకరణ

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయంలోని శుభానందదేవి అమ్మవారికి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని బంగారు కిరీటాన్ని గురువారం ప్రత్యేక పూజాకార్యక్రమాలతో అలంకరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల అనంతరం కిరీటాన్ని బ్యాంకులో భద్రపరుస్తారు. సుమారు రూ.35 లక్షల విలువ కలిగిన ఈ బంగారు కిరీటాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు 2016 మే 2న ఇక్కడికి పూజలు చేయడానికి వచ్చిన సందర్భంగా అమ్మవారికి బహూకరించారు. ఉత్సవాల సమయంలో కిరీటాన్ని అమ్మవారికి అలంకరిస్తారు.

మేడారం నగదు ఆదాయం రూ. 11.17 కోట్లు

- కరెన్సీ లెక్కింపు ప్రక్రియ పూర్తి
- శివరాత్రి తర్వాత ఆభరణాల లెక్కింపు

హన్మకొండ కల్చరల్ : ములుగు జిల్లాలోని మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మహాజాతరకు సంబంధించిన కరెన్సీ లెక్కింపు గురువారం పూర్తయింది. అందులో భాగంగా తొమ్మిదో రోజు పది హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.28,84,973 ఆదాయం వచ్చిందని ఈఓ రాజేందర్ తెలిపారు. గురువారం నమోదైన ఆదాయంతో కలుపుకొని రూ.11,17,99,885 నగదు సమకూరినట్లు ఈఓ పేర్కొన్నారు. హుండీల్లో భక్తులు వేసిన ఆభరణాల లెక్కింపు ప్రక్రియ శివరాత్రి తర్వాత చేపట్టనున్నారు. హన్మకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ కానుకల లెక్కింపు కార్యక్రమం జరిగింది.

అమెజాన్ కంపెనీకి టోకరా

రూ. 8 లక్షలు టోపీ

జగిత్యాల క్రైం: ఆన్‌లైన్ షాపింగ్ కంపెనీ అమెజాన్‌కు రూ.8 లక్షలు కుచ్చుటోపీ పెట్టాడు జగిత్యాలకు చెందిన యువకుడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్ ప్రాంతానికి చెందిన అరుణ్ దశలవారీగా అమెజాన్ కంపెనీలో రూ.8 లక్షల విలువైన 40 ఎలక్ట్రానిక్ వస్తువులు ఆర్డర్ చేశాడు. ఆ వస్తువులు అతనికి చేరిన 24 గంటల్లో నచ్చడం లేదని తిరిగి పంపేందుకు రిక్వెస్ట్ పెట్టేవాడు. అదే సమయంలో ఆ వస్తువుల స్థానంలో నాణ్యతలేని వస్తువులను ప్యాక్ చేసి కంపెనీకి రిటర్న్ పంపాడు. ఇలా తన ఖాతాలో రూ.8 లక్షలు తిరిగి చేరాయి. ఈ మోసాన్ని గుర్తించిన కంపెనీ ప్రతినిధులిద్దరు, ఓ న్యాయవాది ఢిల్లీ నుంచి గురువారం జగిత్యాలకు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అరుణ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ జయేశ్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

62 కిలోల గంజాయి పట్టివేత

ఢిల్లీకి చెందిన నలుగురి అరెస్టు

కరీమాబాద్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో గురువారం జీఆర్‌పీ పోలీసులు 62 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు జీఆర్‌పీ సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం–4లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది సాధారణ తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు లగేజీ బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించగా.. వారిని తనిఖీ చేయడంతో బ్యాగుల్లో 11 ప్యాకెట్లలో 62 కిలోల గంజాయి లభించినట్లు సీఐ వివరించారు. ఢిల్లీ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ సక్సేనా (25), మోనా (33), లీపే (20), సాహిద్ (18) రెండు రోజుల క్రితం భద్రాచలం వెళ్లి అక్కడ ప్రశాంత్ వద్ద ఎండు గంజాయి కొనుగోలు చేసి బస్సులో వరంగల్ చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో వేచి ఉండగా పట్టుకున్నట్లు సీఐ చెప్పారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.6.20 లక్షలు ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

విష్ణుమూర్తి, నరసింహ స్వామి, అష్టలక్ష్మి, దశావతార విగ్రహాలు

యాదాద్రి కొండపైకి చేరిన విగ్రహాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సాలహారాల్లో ఏర్పాటు చేసేందుకు వివిధ విగ్రహాలు ఆలయం చెంతకు చేరాయి. అంతర్గత, బాహ్య ప్రాకారాలతో పాటు ప్రధానాలయ మండపం పైభాగంలోని సాలహారాల్లో విష్ణుమూర్తి, నరసింహస్వామి, అష్టలక్ష్మి, దశావతారాల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఏపీలోని కర్నూలు జిల్లా కోయలకుంట్లలో తయారైన 80 విగ్రహాలను కొండపైకి తీసుకువచ్చి, ప్రధాన ఆలయం పక్కన ఉన్న మండపంలో ఉంచారు. త్వరలోనే సాలహారాల్లో ఏర్పాటు చేయనున్నారు.

అవినీతి ఆరోపణలపై ఎస్ఐ సస్పెన్షన్!



ఆంజనేయులు

మెదక్ రూరల్: అవినీతి ఆరోపణలపై ఓ ఎస్ఐని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ రూరల్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులుపై అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ అనంతరం ఆయనను సస్పెండ్ చేస్తూ మెదక్, నిజామాబాద్ రేంజ్ డీఐజీ శివశంకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాకు సహకరించడం, కేసులో స్వాధీనం చేసుకున్న వాహనాలకు కోర్టు క్లియరెన్స్ ఇచ్చినా వదలకుండా డబ్బులను డిమాండ్ చేయడం, ఇటీవల మండల పరిధిలోని జానకంపల్లిలో జరిగిన వివాహిత ఆత్మహత్య కేసులో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కేసును తారుమారు చేయాలని చూడటం వంటి పలు ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారులెవరూ దీనిపై పూర్తి వివరాలు వెల్లడించలేదు.

వృక్షం.. పునరుజ్జీవం!

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్న సింగరేణి సంస్థ పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్ పరిధిలో విస్తృతంగా మొక్కలు పెంచుతోంది. నూతన ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుకు ఇటీవల శ్రీకారం చుట్టిన సంస్థ.. వృక్షాలను తొలగించాల్సి రావడంతో వాటిని నరికి వేయకుండా ఇతర చోట్లకు తరలించాలని నిర్ణయించింది. 17 ఏళ్ల క్రితం నాటిన 40 మర్రి చెట్లను ఇలా కూకటివేళ్లతో పెకిలించారు. వీటిని జీడీకే-3వ గని సమీపంలోని ప్లాంటేషన్ వద్ద నాటుతామని జీఎం నారాయణ తెలిపారు.

– గోదావరిఖని

సాక్షి ఉద్యోగ అవకాశాలు

GUDLAVALLERU ENGINEERING COLLEGE
(An Autonomous Institute with Permanent Affiliation to JNTUK, Kakinada)
Seshadri Rao Knowledge Village, GUDLAVALLERU - 521 356, Krishna District, A.P.
Ph: 08674-273737/273888, Website: www.gecgudlavalleru.ac.in

Staff Recruitment

Applications along with bio-data, photocopies of all certificates and pass port size photo are invited from the candidates for the posts of Professors/ Associate Professors/ Assistant Professors in Civil / EEE / ME / ECE / CSE / IT and Assistant Professors in MBA, English, Mathematics & Physics so as to reach this office on or before 05-03-2020. Qualification and experience as per AICTE guidelines. Candidates with MCA/M.Sc in Mathematics/Physics/ Electronics/ Computer Science, ME/M.Tech, Ph.D in Computer Science / Information Technology may also apply provided they got admitted to the M.Tech programme before 2010. Applications are also invited for the posts of Office Superintendent/ Finance Officer/ Physical Director/ Estate Officer, Electrical Supervisor, Receptionist, Junior Assistants, Steno, Lab Technicians (CE / EEE / ME / ECE) & Computer Operators. For any further information mail to viceprincipal.administration@gecgudlavalleru.ac.in

GEC/Advt/2020, dt. 21-02-2020 Secretary & Correspondent

మోదీ, అమిత్‌షాలకు పాకిస్తాన్ ఆదర్శం

సీపీఐ నేత సురవరం ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగం దేశ ప్రజలకు ఆదర్శం కాగా.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలకు మాత్రం పాకిస్తాన్ ఆదర్శంగా మారిందని సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పాకిస్తాన్ మతపరమైన దేశం కాగా, భారత్ లౌకిక ప్రజాస్వామ్య దేశమని, అయినా మన దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. భారత్‌ను హిందూ దేశంగా మారిస్తే పాకిస్తాన్‌లో మాదిరిగా పరిస్థితులు తయారవుతాయని ఆందోళన వెలిబుచ్చారు. గురువారం మఖ్దూంభవన్‌లో సీపీఐ నేత, హేతువాది గోవింద్ పన్సారే వర్ధంతి సభను లౌకిక పరిరక్షణ దినోత్సవంగా నిర్వహించారు. ఈ సభలో సురవరం మాట్లాడుతూ.. సనాతన సమితికి చెందిన పన్సారే, దబోల్కర్, కల్బుర్గీ, గౌరీ లంకేష్‌లను హత్యచేశారని, బీజేపీ ప్రభుత్వ హయాంలో వీటిపై సరైన విచారణ జరగడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఫాసిస్ట్ శక్తులు అధికారంలోకి వచ్చి, నిరంతరం అబద్ధాలు ప్రచారం చేసి ప్రజల్లో ఉన్మాదాన్ని రెచ్చగొడతాయని, ఇదే పద్ధతిని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి వ్యాసాలు, లేఖల సంకలనాన్ని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లా వెంకట్‌రెడ్డి, ఎన్.బాలమల్లేష్, విజయలక్ష్మి, ఈటీ నరసింహ, డా.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయ పేర్లతో అడ్డగోలు దోపిడీ

ఇంటర్మీడియట్‌లో కార్పొరేట్ కాలేజీల ఫీజు దందా

- 13 రకాల పేర్లతో రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఫీజు వసూళ్లు
- స్కూళ్లలోనూ టెక్నో కరిక్యులం వంటి పేర్లతో ఫీజుల దోపిడీ
- ఆకర్షణీయ పేర్లు వద్దన్నా అవే పేర్లతో దందా చేస్తున్న యాజమాన్యాలు
- పట్టించుకోని ఇంటర్ బోర్డు, పాఠశాల విద్యా శాఖ

సాక్షి, హైదరాబాద్: ర్యాంకుల ప్రచార హోరు, ఆకర్షణీయ ప్రకటనలతో కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నాయి. పిల్లలకు వచ్చే చదువెంతో తెలియదు కానీ తల్లిదండ్రులను ర్యాంకుల పేరుతో కొల్లగొడుతున్నాయి. తమ పిల్లలు డాక్టర్, ఇంజనీర్ కావాలనే ఆశతో ఆర్థిక స్తోమత లేకపోయినా అప్పులు చేసి మరీ తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ జూనియర్ కాలేజీలు, పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. టాప్ ర్యాంకులు సాధించే కొద్దిమంది విద్యార్థులను ఎరగా చూపి కార్పొరేట్ విద్యా సంస్థలు వేల మంది తల్లిదండ్రులను ఆర్థికంగా దండుకుంటున్నాయి. అసౌకర్యాలు, అధిక ఒత్తిడితో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, తల్లిదండ్రులను మోసం చేస్తూ కార్పొరేట్ జూనియర్ కాలేజీలు 13 రకాల ఆర్షణీయ పేర్లతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. పాఠశాలల్లోనూ రూ.45 వేల నుంచి మొదలుకొని టెక్నో కరిక్యులమ్, హాస్టల్ వసతి పేరుతో రూ.1.5 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇలా రాష్ట్రంలో 79 కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఇవ్వకపోయినా వాటిల్లో దాదాపు 10 వేల మంది విద్యార్థులను చేర్చుకొని దండుకుంటున్నాయి.

పీఆర్‌వోల వ్యవస్థతో బురిడీ

పీఆర్‌వోల వ్యవస్థను ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నాయి. మీ పిల్లలకు పదో తరగతిలో 9 కంటే ఎక్కువ గ్రేడ్ పాయింట్ యావరేజ్ వస్తే 50 శాతం ఫీజు రాయితీ ఇస్తామని, 10 పాయింట్లు వస్తే ఉచితంగానే చదివిస్తామని ప్రచారం చేసి చేర్చుకుంటున్నాయి. హాస్టల్ ఫీజు మాత్రమే చెల్లిస్తే చాలని నమ్మబలుకుతున్నాయి. తల్లిదండ్రులు ఆశతో తమ పిల్లలను కార్పొరేట్ కాలేజీల్లో చేర్చుతున్నారు. ఒక్క ఏడాది (ఫస్టియర్) గడవగానే మీ పిల్లల పెర్ఫార్మెన్స్ బాగా లేదంటూ ముక్కుపిండి మొత్తం ఫీజులు వసూలు చేస్తున్నాయి. అంతేకాదు ఉచితంగా చదివిస్తా మని చెప్పి హాస్టల్ ఫీజుల పేరుతో దండుకుంటున్నాయి. ఎలాంటి అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని ఆ రెండు కార్పొరేట్ విద్యా సంస్థలైతే టెక్నో కరిక్యులమ్, ఒలింపియాడ్, జేఈఈ, నీట్, సూపర్ చైనా, ఎంపీఎల్, ఎన్‌పీఎల్, ఎయిమ్స్, మెడికాన్, ఎన్‌ఐపీల్ స్పార్క్ ఎన్-40 వంటి అనేక పేర్లతో ప్రత్యేక బ్యాచ్‌లు అంటూ తల్లిదండ్రుల నుంచి భారీగా దండుకుంటున్నాయి.

ఎన్నెన్నో లోపాలు..

తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుంటున్న యాజమాన్యాలు అనుమతులు తీసుకోకుండానే అదనపు బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. ఒకే క్యాంపస్‌లో రెండేసి కాలేజీలను నడుపుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాయి.

ప్రస్తుతం రాష్ట్రంలో 79 కాలేజీలు అనుమతులు లేకుండానే కొనసాగిస్తున్నా ఇంటర్మీడియట్ బోర్డు చేష్టలుడిగి చూస్తోంది. అందులో 49 కాలేజీలు ఆ రెండు విద్యా సంస్థలకు చెందినవే అయినా ఏమీ చేయలేక పోతోంది. మరోవైపు కార్పొరేట్ పాఠశాలల్లోనూ అదే దందా కొనసాగుతున్నా పాఠశాల విద్యా శాఖ చేతగాని వ్యవస్థగా మారిపోయింది. చివరకు విద్యార్థుల భవిష్యత్తు కావడంతో ఆ 79 కాలేజీల్లోని విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేలా అనుమతిచ్చింది.

నరకానికి నకళ్లు కార్పొరేట్ హాస్టళ్లు..

ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు 2017 చివరలో చేపట్టిన తనిఖీల్లోనే కార్పొరేట్ కాలేజీల లోపాలు అనేకం బయటపడ్డాయి. రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలకు చెందిన 146 కాలేజీల హాస్టళ్లు (రంగారెడ్డిలో 35, మేడ్చల్‌లో 51, హైదరాబాద్‌లో 60) జైళ్లలాగా ఉన్నాయని తేల్చినా వాటిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారు. ఆయా కాలేజీల్లో అకడమిక్ క్యాలెండర్ అమలు చేయట్లేదు. సమయపాలన లేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే బోధన చేపట్టాల్సి ఉన్నా అమలు కావట్లేదు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు చదువుతో విద్యార్థుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తల్లిదండ్రులూ పట్టించుకోవట్లేదు. హాస్టళ్లలో అయితే మరీ దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని అధికారులే తేల్చారు. సరిపడా బాత్రూంలు, టాయిలెట్లు కూడా లేవని తేల్చారు. నలుగురు ఉండాల్సిన గదుల్లో 10 మందిని ఉంచుతూ ఇబ్బందుల పాలు చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. కాలేజీలు, హాస్టళ్లలో కనీస వసతులు ఉన్నాయా లేదా అన్నది కూడా తల్లిదండ్రులు చూసుకోకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసమంటూ వాటిల్లో చేర్చుతూ పిల్లలను ఇబ్బందుల్లోకి నెడుతున్నారు.

ఓ కార్పొరేట్ విద్యా సంస్థలో ఫీజుల వివరాలు..

పేర్లు	వసూలు చేసేది
సూపర్‌చైనా (రెసిడెన్షియల్)	రూ.3 లక్షలు
సూపర్ చైనా	రూ.2.6 లక్షలు
ఎయిమ్స్ ఎస్ 60	రూ.2.6 లక్షలు
ఎంపీల్	రూ.2.2 లక్షలు
ఎన్‌పీఎల్	రూ.2.2 లక్షలు
సీ-120 సెమీ	రూ.2.1 లక్షలు
ఎయిమ్స్ ఎస్ 60 సెమీ	రూ.1.8 లక్షలు
ఎంపీఎల్ సెమీ	రూ.1.6 లక్షలు
సి-ఐపీఎల్	రూ.1.6 లక్షలు
ఎన్‌పీఎల్ సెమీ	రూ.1.5 లక్షలు
ఎయిమ్స్ ఎస్ -60	రూ.1.65 లక్షలు
మెడికాన్	రూ.1.05 లక్షలు
నియాన్	రూ.1.05 లక్షలు
మరో సంస్థలో...	
కో సూపర్ చైనా - ఎన్1. 20	రూ.3 లక్షలు
సూపర్ చైనా (ఎన్1 .20)	రూ.3 లక్షలు
కో సూపర్ చైనా	రూ.3 లక్షలు
ఎన్1.20	రూ.2.5 లక్షలు
సీఐవో-కో-స్పార్క్ సెమీ	రూ.2.25 లక్షలు
ఎన్1.20	రూ.2 లక్షలు
ఎన్ 40	రూ.1.75 లక్షలు
ఎన్ 40 సెమీ	రూ.1.5 లక్షలు
సీఏవో - జెడ్ఎఫ్‌టీబీ	రూ.1.4 లక్షలు
ఎన్ఐపీఎల్ సూపర్ 60	రూ.1.25 లక్షలు
సీఏవో- ఎన్ఏజెడ్	రూ.1.2 లక్షలు
ఎన్ఐపీఎల్ స్పార్క్ ఐసీ	రూ.1.1 లక్షలు
ఎన్ఎంపీఎల్ స్పార్క్ ఐసీ	రూ.1 లక్ష

ఆర్టీసీ కార్గోకు ప్రైవేటు కాంట్రాక్టర్ల పోగ?

- రెండు నెలలు గడుస్తున్నా చప్పుడులేని ప్రభుత్వ విభాగాలు
- సరుకులు, వస్తువులు రవాణా సంస్థకే ఇవ్వాలని గతంలో సీఎం ఆదేశం
- ఇప్పటికే 70 వాహనాలు సిద్ధం చేసి డిపోల్లో ఉంచిన అధికారులు
- ఆర్టీసీకి ఆర్డర్ ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వని ప్రభుత్వ విభాగాలు
- అధికారికంగా కార్గో సర్వీసులు ప్రారంభించలేకపోతున్న ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్: మందులు, మద్యం, పాఠ్యపుస్తకాలు, విత్తనాలు, రేషన్ సరుకులు, యూనిఫామ్స్.. ఇలా ఒక్కటేమిటీ ప్రభుత్వ విభాగాలు సరఫరా చేసే సరుకులు, వస్తువులన్నింటినీ ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టే కార్గో బస్సుల్లోనే సరఫరా చేస్తామని సీఎం కె.చంద్రశేఖర్‌రావు తేల్చిచెప్పారు. నష్టాల్లో ఉన్న సంస్థను గట్టెక్కించేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తదనుగుణంగా బస్సులు సిద్ధం చేయాలని ఆర్టీసీని ఆదేశించారు. ఆర్టీసీ యుద్ధప్రాతిపదికన బస్సులను సిద్ధం చేస్తూ.. రెడీ అయినవాటిని అయినట్లు డిపోలకు పంపుతోంది. వీటి కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వారికి శిక్షణ కూడా ఇచ్చారు. సీఎం చెప్పినట్లు ప్రస్తుతానికి అంతా సిద్ధమైంది. కానీ ప్రభుత్వ విభాగాల నుంచి ఆయా సరుకుల సరఫరా బాధ్యత ఆర్టీసీ కార్గో విభాగానికి ఇస్తున్నట్లు ఇప్పటివరకు ఆదేశాలు వెలువడలేదు. ఫలితంగా 2 నెలలు గడుస్తున్నా, ఆర్టీసీ కార్గో విభాగం ప్రారంభం కాలేదు.

ఎందుకిలా మరి..?

ప్రభుత్వ విభాగాలతో ముడిపడిన వ్యవహారమంటే ప్రతీదీ కాసులు రాల్చే వ్యవహారమే. అందుకే ప్రైవేటు సంస్థలు అవకాశాలను వెతుక్కుని మరీ ఒప్పందాలు చేసుకుని పాతుకుపోతుంటాయి. టెండర్లు తమకే దక్కులా తెరవెనుక ప్రయత్నాలు చేస్తుంటాయి. ఇప్పుడు ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన సరుకులు, వస్తువుల తరలింపును కూడా అలాంటి ప్రైవేటు సంస్థలే దక్కించుకుంటున్నాయి. ఇప్పుడు ఆ వస్తువులు, సరుకుల తరలింపు బాధ్యత మొత్తం ఆర్టీసీకే ఇస్తామని స్వయంగా సీఎం అనేసరికి వాటికి సంబంధించి వ్యక్తుల గుండెలు గుభేల్‌మన్నాయి. దీంతో ఆ బాధ్యత తమకే ఉండేలా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. వారి ఒత్తిడి వల్లే ఆయా విభాగాలు ఉత్తర్వులు జారీ చేయలేదని ఆర్టీసీలో జోరుగా చర్చ నడుస్తోంది.

డిపోల్లో వృథాగా బస్సులు..

ప్రయాణికుల తరలింపు కర్తవ్యంగా కొనసాగుతున్న ఆర్టీసీ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంగతి తెలిసిందే. అప్పులు, నష్టాలతో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవలే ప్రభుత్వం కిలోమీటరుకు 20 పైసలు చొప్పున చార్జీలు పెంచటంతో 2 నెలలుగా ఆర్టీసీ ఆదాయం పెరిగింది. దీనికి తోడు కొత్తగా కార్గో సేవలు ప్రారంభిస్తే ఆర్టీసీ నష్టాలు దాదాపు ఆగిపోతాయని ప్రభుత్వం భావించింది. మరోవైపు ఖర్చు తగ్గించుకునేందుకు పాత బస్సులను తొలగించాలని, వాటిపై పనిచేస్తున్న సిబ్బందిని ఇతర పనులకు వాడుకోవాలని నిర్ణయించింది. ఫలితంగా 800 బస్సులను ఉపసంహరించుకుంది. కొత్తగా ఆర్టీసీ తీసుకుంటున్న 1,300 అద్దె బస్సుల స్థానంలో అంతే సంఖ్యలో సొంత బస్సులను తగ్గించుకోవాలని కూడా నిర్ణయించింది. విరమించుకున్న సర్వీసులకు సంబంధించి దాదాపు 2 వేల సంఖ్యలో సిబ్బందిని ఆయా ప్రాంతాల్లో సర్దారు. కార్గో విభాగానికి కావాల్సిన డ్రైవర్లను కూడా వీరి నుంచే కేటాయించారు. ఇక మిగిలిపోయిన కండక్టర్ల నుంచి 112 మందిని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లుగా కేటాయించారు. వీరిలో కొందరికి ఇప్పటికే హకీంపేటలోని ఆర్టీసీ ట్రెయినింగ్ కాలేజీలో శిక్షణ ఇచ్చారు.

70 బస్సులు సిద్ధమైనా..

పక్కనపెట్టిన పాత బస్సులను కార్గో వాహనాలుగా మార్చే పని ప్రారంభించి, ఇప్పటికే దాదాపు 70 బస్సులను సిద్ధం చేశారు. మిగతావాటి పని కొనసాగుతోంది. సగటున రోజుకు ఒక బస్సు చొప్పున సిద్ధం చేస్తున్నారు. సిద్ధమైన బస్సులను సిటీ డిపోలకు కేటాయించారు. అప్పటి నుంచి అవి డిపోల్లో ఖాళీగా ఉన్నాయి. కార్గో సేవలు మాత్రం ప్రారంభం కావట్లేదు. రెండు నెలలు గడిచినా.. ప్రభుత్వ విభాగాల నుంచి ఉత్తర్వులు వెలువడట్లేదు. ఆర్టీసీతో సమావేశానికి పిలుపు రావట్లేదు. యథావిధిగా ప్రైవేటు సంస్థలతో సరుకులు, వస్తువుల తరలింపు జరుగుతూనే ఉంది. దీంతో ఆర్టీసీ కార్గో ప్రాజెక్టు ప్రస్తుతానికి అయోమయంలో పడినట్లయింది.

పాత బస్సులు కడిగి..

ఇటీవల ఇంటర్ పరీక్షలకు సంబంధించి పత్రాలను సరఫరా చేసే బాధ్యతను ఆర్టీసీకి అప్పగించారు. డిపోల్లో కార్గో సర్వీసు కొత్త బస్సులు సిద్ధంగా ఉన్నా వాటిని పంపలేని దుస్థితి నెలకొంది. ఇప్పటి వరకు కార్గో సర్వీసులను అధికారికంగా ప్రారంభించకపోవటంతో వాటిని వాడేందుకు అనుమతి రాలేదు. దీంతో గతంలో రూపొందించిన పాత వాహనాలను కడిగి అప్పటికప్పుడు సిద్ధం చేసి పంపాల్సి వచ్చింది.

డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు 28న ఎన్నికలు

- ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్
- అదే రోజు ఓట్ల లెక్కింపు... 29న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ

సాక్షి, హైదరాబాద్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు ఈ నెల 28న జరుగనున్నాయి. దీనికి సంబంధించి రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతీ జిల్లాకూ వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇవ్వడం గమనార్హం. మరోవైపు ఈ నెల 22న జిల్లా అధికారులు కూడా మళ్లీ నోటిఫికేషన్లు జారీ చేస్తారని అథారిటీ అధికారులు తెలిపారు. ఈ నెల 25న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అనంతరం ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతారు. 29న ఆఫీస్ బేరర్ల ఎన్నిక జరుగుతుంది. అదే రోజు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారని ఎన్నికల అథారిటీ తెలిపింది. ప్రతీ డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో 20 మంది చొప్పున డైరెక్టర్లను ఆ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) చైర్మన్లు ఎన్నుకుంటారు. డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో ప్యాక్స్ చైర్మన్లంతా వాటిల్లో సభ్యులే. 20 మంది డైరెక్టర్లలో 16 మందిని ప్యాక్స్‌ల నుంచి ఎన్నుకుంటారు. మరో నలుగురిని చేనేత సంఘాలు సహా వివిధ సొసైటీలకు చెందిన వారు ఎన్నుకుంటారు. 16 మంది డైరెక్టర్లలో ఎస్సీలకు 3, ఎస్టీలకు 1, బీసీలకు 2, ఓపెన్ కేటగిరీకి 10 చొప్పున రిజర్వు చేశారు. మరో నాలుగు డైరెక్టర్లకు సంబంధించిన వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓపెన్ కేటగిరీలకు ఒక్కోటి చొప్పున రిజర్వేషన్ కల్పించారు. ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయి. ఎస్సీ కేటగిరీ డైరెక్టర్లను ఎన్నుకునేందుకు పింక్ కలర్ బ్యాలెట్ పేపర్, ఎస్టీకి లైట్ బ్లూ కలర్, బీసీకి లైట్ గ్రీన్ కలర్, ఓపెన్ కేటగిరీకి వైట్ కలర్ బ్యాలెట్ పేపర్‌ను ముద్రిస్తారు.

వచ్చే నెల 5న టెస్కాబ్ చైర్మన్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌ను వచ్చే నెల 5న ఎన్నుకోనున్నారు. అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మూడో తేదీన జారీచేస్తామని సహకార ఎన్నికల అథారిటీ వర్గాలు తెలిపాయి.

జనాభా లెక్కల పేరుతో ఎన్‌పీఆర్ తయారీ

మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జనాభా లెక్కల పేరుతో జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌పీఆర్) తయారు చేస్తున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా బీజేపీ నేతలు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్నార్సీలతో ఎవరికీ నష్టం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పినప్పటికీ ఆందోళనలు ఆగడం లేదన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా కేసీఆర్ రెండ్రోజుల్లో నిర్ణయం తీసుకుంటారని ఎంఐఎం నేత అసదుద్దీన్ చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు స్పందన లేదని ఎద్దేవా చేశారు. కేవలం సీఏఏను వెనక్కు తీసుకోవాలని మాత్రమే కేబినెట్‌లో తీర్మానం చేశారని, దీనిపైనే అసెంబ్లీలో చర్చిస్తామని అంటున్నారని, రాష్ట్రంలో ఎన్‌పీఆర్ అమలు చేయబోమని చెప్పలేదన్నారు. రోహింగ్యాల పేరుతో చాలా మందికి నోటీసులు ఇస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, ఒవైసీ ఇద్దరూ కలసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, కొందరు ఉద్యోగ సంఘాల నేతల ను కేసీఆర్ తన బుట్టలో వేసుకున్నారన్నారు.

పీఆర్‌సీ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం

- ఎన్నికలు వస్తే పీఆర్‌సీ అంటూ మభ్యపెడుతున్న కేసీఆర్
- ఉద్యోగుల ప్రయోజనాలను ఫణంగా పెట్టిన సంఘాల నేతలు
- సంఘాల నాయకులకు భోజనం పెట్టి ఉద్యోగుల కడుపు కొట్టారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపాటు
- వెంటనే పీఆర్‌సీ.. లేదంటే ఐఆర్ ఇవ్వాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాలిస్తామని నిరుద్యోగ యువతను వంచించిన కేసీఆర్, ఇప్పుడు ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్‌సీ లేదా మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఎన్నికలు వస్తే పీఆర్‌సీ అంటూ ఉద్యోగులను మభ్య పెడుతున్నారని మండి పడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్థిక పాలనలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రైతులకు రైతుబంధు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికలు వస్తే మాత్రం రైతులు, ఉద్యోగులు, పీఆర్‌సీ గుర్తుకు వస్తుందన్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల సమయంలో త్వరలోనే పీఆర్‌సీపై మాట్లాడదామని మభ్యపెట్టారన్నారు. ఉద్యోగ సంఘం నాయకులకు భోజనం పెట్టి, ఉద్యోగుల కడుపు కొట్టారన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని, ప్రెండ్లీ ప్రభుత్వం అంటూ ఉద్యోగులను దగా చేస్తున్నారన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులుగా ఉండి సాధారణ ఉద్యోగుల ప్రయోజనాలు పక్కన బెట్టి కొంతమంది ప్రజా ప్రతినిధులు, మంత్రులు అయ్యారన్నారు. ఆర్టీసీ విషయంలోనూ ఉద్యోగుల్లో విభేదాలు సృష్టించి ఉద్యమాన్ని నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టి జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా చేశారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు ఎప్పుడో ఐఆర్ ఇచ్చారని, తెలంగాణలో మాత్రం దిక్కు లేకుండాపోయిందన్నారు. పీఆర్‌సీ గడువును మూడు సార్లు పెంచి ఉద్యోగులను ఆవేదనకు గురి చేస్తున్నారన్నారు. పీఆర్‌సీ గడువు పొడగింపు జీవో 447ను వెంటనే రద్దు చేసి, పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. లేదంటే ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్, ఎంఐఎం కుట్రలు బహిర్గతం చేసేందుకే..

టీఆర్ఎస్ మజ్లిస్‌తో కుమ్మక్కై మత విద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. ఒవైసీ వద్ద కేసీఆర్ మోకరిల్లి ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారన్నారు. సీఏఏ భారతీయులెవరికీ వ్యతిరేకం కాదన్నారు. టీఆర్ఎస్, ఎంఐఎం కుట్రలను బహిర్గతం చేసేందుకు, సీఏఏకు అనుకూలంగా మార్చి 15న భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని, అందులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొంటారన్నారు. అనంతరం నార్సింగి సహకార సంఘ ఎన్నికల్లో వైస్ చైర్మన్‌గా గెలిచిన కె.సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మోత్కుపల్లి నర్సింహులు, చింతా సాంబమూర్తి, శాంతికుమార్, మోహన్‌రెడ్డి, ఎన్‌వీ సుభాష్, సుధాకర శర్మ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
లేఖ సంఖ్య: 392/2020/SB2, జిల్లాకు క్యామంట్ టెండరు ప్రకటన తేది: 20.02.2020
రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ రేంజ్ పరిధిలో మన్సూరాబాద్ రిజర్వు ఫారెస్ట్ Extn-I&II at MHVNP లో గల CRS Wall పైన 1 మీటర్ ఎత్తు (పొడవు 1250 mts) పెంచుటకు గాను నమోదిత కాంట్రాక్టర్లు/ పని అనుభవము గల సంస్థల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ECV రూ.36,11,162/-. బిడ్ దాఖలు డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 24.02.2020 ఉదయం:10.00 గం నుండి ముగింపు తేది: 10.03.2020 మధ్యాహ్నం 3.00 గం. వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 11.03.2020 మధ్యాహ్నం. 3.00 గం. లక. వాణిజ్య బిడ్ తెరచు తేది: 11.03.2020 సా.4.00 గం.లక. తదుపరి వివరాలకై www.eprocurement.gov.in దర్శించగలరు. (ఫోన్ నం: 9441139001).
సం/- అటవీ డివిజినల్ అధికారి, శంషాబాద్, రంగారెడ్డి జిల్లా
DIPR RO. No.2489-DP/CL/ADVT/1/2019-20, Dt: 20.02.2020

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
మైనర్ ఇరిగేషన్ - వికారాబాద్ జిల్లా, నవాబ్ పేట్ మండలము, గంగ్యాడ గ్రామము లోని మూసి నది వద్ద చెక్ డ్యాం నిర్మాణము చేయుట గురించి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ సంఖ్య 21/2019-20, తేది: 17.02.2020 ద్వారా బిడ్లను ఆహ్వానించడమైనది. టెండరు స్వీకరించు ఆఖరు తేది మరియు సమయం 27.02.2020 సా.4.00 గం॥ల వరకు.
అంచనా విలువ: రూ.177.00 లక్షలు.
గమనిక: మిగతా వివరములకొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- కే. ధర్మ, తేది: 20.02.2020 పర్యవేక్షక అభియంత, I & CADD., ఇరిగేషన్ సర్కిల్, రంగారెడ్డి

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
టెండరు నోటీసు నం. 8/APMSIDC Circle/Guntur/2019-20 తేది: 20.02.2020
ఈ సర్కిల్‌లోని దిగువ తెలిపిన జిల్లాలలోని వివిధ ప్రదేశాల వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణము / పటిష్టపరచుట కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి: అవి 1) కృష్ణా జిల్లా (13 ప్యాకేజీలలో 90 నం.లు). పనుల విలువ: సుమారు రూ.3515 లక్షలు 2)

క్లుప్తంగా...

సీఏఏ నిరసనల్లో 'పాక్ జిందాబాద్' నినాదాలు

బెంగళూరు: కర్ణాటకలో జరిగిన పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక ఆందోళనలో 'పాకిస్తాన్ జిందాబాద్' నినాదాలు నిర్వాహకులను ఇబ్బందిపెట్టాయి. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సమక్షంలోనే ఒక మహిళ ఈ నినాదాలు చేసింది. 'సేవ్ కాన్‌స్టిట్యూషన్' పేరుతో బెంగళూరులో గురువారం సీఏఏ వ్యతిరేక ప్రదర్శన జరిగింది. ఆ ప్రదర్శనకు అసదుద్దీన్ ఓవైసీ కూడా హాజరయ్యారు. ఆయన రాగానే వేదిక పైకి వచ్చిన అమూల్య లియోనా అనే మహిళ 'పాకిస్తాన్ జిందాబాద్' అని నినదించడం ప్రారంభించింది. అక్కడ ఉన్న ఆందోళనకారులను కూడా తనతో పాటు నినదించమని కోరింది. నిర్వాహకులు అడ్డుకున్నా.. ఆమె ఊరుకోలేదు. ఈ లోపు ఆమె దగ్గరకు వెళ్లిన అసదుద్దీన్ ఆమె వద్ద నుంచి మైక్‌ను లాగేసుకోవడానికి ప్రయత్నించారు. చివరకు పోలీసులు వచ్చి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై దేశద్రోహం కేసు పెట్టే అవకాశముంది. కాగా, ఆ తరువాత ప్రసంగించిన అసదుద్దీన్.. ఆ మహిళతో, ఆమె అభిప్రాయాలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. నిర్వాహకులు ఆమెను ఈ కార్యక్రమానికి ఆహ్వానించకుండా ఉంటే బావుండేదన్నారు. 'ఆమె ఇలా ప్రవర్తిస్తారని తెలిస్తే.. నేను ఈ కార్యక్రమానికి వచ్చేవాడిని కాదు. మేం భారతీయులం. శత్రుదేశం పాకిస్తాన్‌కు మద్దతిచ్చే ప్రశ్నే లేదు. భారత్‌ను కాపాడాలనేదే మా ఉద్యమం ఉద్దేశం' అని ఓవైసీ వివరించారు. ఈ ఘటనపై బీజేపీ స్పందించింది. సీఏఏ వ్యతిరేక ఆందోళనలన్నీ పాకిస్తాన్, కాంగ్రెస్ నేతృత్వంలోని జాతివ్యతిరేక శక్తుల మధ్య జాయింట్ వెంచర్‌లో భాగమని ఆరోపించింది. బెంగళూరు ఘటనను కాంగ్రెస్ కూడా ఖండించింది.

ఎల్‌పీజీ ధరలు తగ్గొచ్చు: ప్రధాన్

రాయ్‌పూర్: వచ్చే నెలలో ఎల్‌పీజీ ధరలు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజుల పర్యటనకోసం వచ్చిన మంత్రి ఇక్కడి స్వామి వివేకానంద విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌పీజీ ధరల్లో స్థిరమైన పెరుగుదల గురించి అడిగిన ప్రశ్నపై ప్రధాన్ మాట్లాడుతూ, 'ధర నిరంతరం పెరుగుతుందనడం వాస్తవం కాదు. ఈ నెల అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ కారణంగా ధర పెరిగింది. అయితే వచ్చే నెలలో ధరలు దిగిరావచ్చు' అని చెప్పారు. సహజంగా శీతాకాలంలో ఎల్పీజీ వినియోగం పెరుగుతుంది, డిమాండ్ కారణంగా ధర పెరుగుతుంది' అని ఆయన తెలిపారు.

అయోధ్యకు రండి

ప్రధానికి రామ మందిరం ట్రస్టు ఆహ్వానం

న్యూఢిల్లీ: రామ మందిరం ట్రస్టు అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్, ఇతర సభ్యులు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలుసుకున్నారు. అయోధ్యని సందర్శించాల్సిందిగా వారు ప్రధానిని ఆహ్వానించారు. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర తొలిసారి సమావేశమై అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల్ని ఎన్నుకున్న మరునాడే ప్రధానిని కలుసుకున్నారు. ప్రధానితో సమావేశానికి వీహెచ్‌పీ నాయకుడు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపాత్ రాయ్, కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ కూడా హాజరయ్యారు. ప్రధానిని కలుసుకున్న అనంతరం నృత్యగోపాల్ దాస్ విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య సందర్శించాల్సిందిగా మోదీని ఆహ్వానించామని వెల్లడించారు.

జర్మనీలో కాల్పులు

9 మంది మృతి

నావో: జర్మనీలోని హనావో నగరంలో ఓ దుండగుడు (43) రెచ్చిపోయాడు. ఫ్రాంక్‌ఫర్ట్ శివార్లలో ఉన్న రెండు బార్‌లలో తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 9 మంది మృతిచెందారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జాత్యహంకారంతోనే దుండగుడు దాడికి పాల్పడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దేశీయ ఉగ్రవాదంగా దీనిని పరిగణిస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దుండగుడు తొలుత సెంట్రల్ హనావో ప్రాంతంలోని హుక్కా బార్‌లో కాల్పులు జరిపాడు. అనంతరం అక్కడికి 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో బార్‌లో కాల్పులకు తెగబడ్డాడు.

'మైనారిటీ'ని నిర్వచించండి

న్యూఢిల్లీ: మైనారిటీ అనే పదాన్ని నిర్వచించాలని, రాష్ట్రంలోని జనాభా ఆధారంగా ఏదైనా ఒక వర్గానికి మైనారిటీ హోదా కల్పించేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీనిపై సరైన వేదికను ఆశ్రయించేందుకు పిటిషన్‌దారుకు అనుమతినిచ్చింది. బీజేపీ నేత ఉశ్విని ఉపాధ్యాయ వేసిన ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు కోర్టు అనుమతినిచ్చింది. అంతకుముందు ప్రాథమిక విచారణ సందర్భంగా ఉపాధ్యాయ తరపున న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. మైనారిటీ అనే పదాన్ని నిర్వచించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 29, ఆర్టికల్ 30లో మైనారిటీ అనే పదాన్ని వాడారు కానీ ఎక్కడా ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదన్నారు.

మధ్య ఆసియా, దక్షిణ సైబీరియాల నుంచి అరుదుగా భారత్‌కు వలసవచ్చే రెడ్‌స్టార్ట్ పక్షి ఇది. ఈ చిన్నిపిట్ట తాజాగా ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లాలోని ముక్తేశ్వర్‌లో ప్రత్యక్షమైంది.

జర్మనీ-ఫ్రాన్స్ సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న అత్యంత అధునాతన యుద్ధ విమానం నమూనా ఇది. దీని పేరు న్యూ జనరేషన్ ఫైటర్(ఎన్‌జీఎఫ్). కొత్త రకం మానవరహిత విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, యుద్ధవిమానాలతో సరికొత్త వైమానిక రక్షణ వ్యవస్థను ఇరు దేశాలు సిద్ధం చేస్తున్నాయి. అందులో భాగంగానే ఎన్‌జీఎఫ్‌ను తయారుచేస్తున్నాయి. 2040 ఏడాదికల్లా ఇది అందుబాటులోకి రానుంది.

గురువారం ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో 'హునర్ హాట్' మేళాలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దంపతులు

22 కి.మీ... లక్ష మంది

- అహ్మదాబాద్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రోడ్‌షోకు ముమ్మర ఏర్పాట్లు
- మొటెరా స్టేడియంలో 'నమస్తే ట్రంప్'కార్యక్రమం
- ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించనున్న మెలానియా
- సర్వాంగ సుందరంగా ఆగ్రా

ట్రంప్ పర్యటన నేపథ్యంలో తాజ్‌మహల్ పరిసరాలను ముస్తాబుచేస్తున్న దృశ్యం. అహ్మదాబాద్‌లో మొటెరా స్టేడియం వద్ద మోహరించిన పోలీసులు

అహ్మదాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించేందుకు గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ గాంధీనగర్‌లో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24న ట్రంప్, ప్రధాని మోదీ అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి 22 కిలోమీటర్ల మేర నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. ప్రస్తుతం ఉన్న ప్రణాళిక ప్రకారం స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతిపిత మహాత్మాగాంధీ నడయాడిన సబర్మతి ఆశ్రమాన్ని ట్రంప్, మోదీలు సందర్శిస్తారు. తర్వాత ఆశ్రమం నుంచి ఇందిర బ్రిడ్జి పైనుంచి ఎస్పీ రింగు రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు వద్దనున్న మొటెరా స్టేడియంకు చేరుకుంటారు. రోడ్‌షోలో భద్రతా ఏర్పాట్లూ, ట్రాఫిక్ తదితర అంశాలు సహా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు గుజరాత్ హోంమంత్రి ప్రదీప్‌సిన్హా జడేజా చెప్పారు.

రోడ్ షోకి ఒక లక్ష మంది

రోడ్‌షోలో సుమారు లక్ష మంది ప్రజలు భాగస్వాములవుతారని భావిస్తున్నారు. రోడ్‌షోలో 70 లక్షల మంది జనం పాల్గొంటున్నారని ట్రంప్ చెప్పారు. అయితే లక్ష మంది వరకు రోడ్‌షోలో పాల్గొనే అవకాశం ఉన్నట్టు అహ్మదాబాద్ మున్సిపల్ కమిషనర్ విజయ్ నెహ్రా వెల్లడించారు. మొటెరాలో కొత్తగా నిర్మిస్తోన్న క్రికెట్ స్టేడియంలో 'నమస్తే ట్రంప్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సభను ఉద్దేశించి ఇరువురు నేతలూ ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో దాదాపు లక్షా పదివేల మంది ప్రజలు పాల్గొననున్నారు.

సర్వాంగ సుందరంగా ఆగ్రా

తాజ్‌మహల్‌ని ట్రంప్, ఆయన భార్య మెలానియా దర్శించనున్న నేపథ్యంలో తాజ్‌మహల్ పరిసర ప్రాంతాలను యూపీ ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. తాజ్‌మహల్, పరిసర ప్రాంతాలనూ ముస్తాబు చేస్తున్నారు. తాజ్‌మహల్ పక్కనున్న యమునా తీర ప్రాంతంలోని భారీచెత్తను గత రెండు రోజులుగా తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఖెరియా ఎయిర్‌పోర్టు నుంచి తాజ్‌మహల్ వరకు ఎంజీ రోడ్డుపైన భిక్షాటన చేసేవారిని అక్కడి నుంచి ఖాళీచేయించారు. దారిపొడవునా గోడలకు రంగులు వేశారు. భద్రతాకారణాల రీత్యా దారిలో ఉన్న చెట్లను నరికివేశారు. 20వేల మంది విద్యార్థులు జెండాలతో స్వాగతం పలుకుతారు. రామ్‌లీలా, రాస్‌లీలా, పంచకుల, నౌతంకి సహా ఆగ్రా, మథుర, బృందావన్‌ల నుంచి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.

ప్రభుత్వ పాఠశాలను సందర్శించనున్న మెలానియా

మెలానియా దక్షిణ ఢిల్లీలో ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రవేశపెట్టిన 'హ్యాపీనెస్ కరికులమ్' పాఠశాలను సందర్శించనున్నారు. 25న ఢిల్లీకి చేరుకోనున్న ట్రంప్, మెలానియాలకు సీఎం కేజ్రీవాల్ స్వాగతం పలుకుతారు. పిల్లల్లో ఒత్తిడిని తగ్గించేందుకు గతంలో ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 'హ్యాపీనెస్' పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టారు. ఇందులో 40 నిముషాల పాటు మెడిటేషన్, విశ్రాంతి తదితర కార్యక్రమాలుంటాయి.

రోడ్ షోకు డీఆర్‌డీఓ డ్రోన్ నిరోధక వ్యవస్థ

ట్రంప్, మోదీ పాల్గొనే రోడ్ షోలో డీఆర్‌డీఓ(డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) అభివృద్ధి చేసిన డ్రోన్ నిరోధక వ్యవస్థను వాడనున్నారు. అగ్రనేతల భద్రత కోసం స్థానిక పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్, చేతక్ కమాండో, స్టేట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌ల సేవలను వినియోగించుకుంటున్నారు. రోడ్ షో జరిగే ప్రాంతంలోని కీలక, వ్యూహాత్మక ప్రదేశాల్లో వీరిని మోహరిస్తామని క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అజయ్ తోమర్ గురువారం తెలిపారు. డ్రోన్‌ను గుర్తించడంతో పాటు, దాన్ని నాశనం చేసేలా ఈ వ్యవస్థను రూపొందించారు. రోడ్ షో సందర్భంగా ఇరువురు నేతలు ఒకే కారులో ప్రయాణిస్తారా? అన్న విషయంపై తమకు సమాచారం లేదని తోమర్ తెలిపారు. అలాగే, ఓపెన్ వెహికిల్‌ను వారు వాడకపోవచ్చన్నారు.

తమిళనాట నెత్తురోడిన రోడ్లు

బస్సులోనే ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులు

- రెండు ప్రమాదాలు.. 27 మంది మృతి
- అవినాశి వద్ద బస్సును ఢీకొన్న లారీ; 20 మంది కేరళ వాసుల దుర్మరణం
- ఓమలూరు వద్ద రెండు బస్సులు ఢీ; ఏడుగురు నేపాలీయుల మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడులో గురువారం వేకువజామున రెండు ఘోర ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రెండు ఘటనల్లో కలిపి 27 మంది ప్రాణాలు కోల్పోయారు. తిరుప్పూర్ జిల్లా అవినాశి వద్ద బస్సును లారీ ఢీకొనడంతో 20 మంది ప్రయాణికులు మృతి చెందారు. సేలం– బెంగళూరు జాతీయ రహదారిలో సేలం జిల్లా ఓమలూరు వద్ద నేపాల్ నుంచి వచ్చిన పర్యాటకుల బృందం ప్రయాణిస్తున్న మినీ బస్సును మరో ప్రైవేటు బస్సు ఢీ కొన్న మరో ఘటనలో ఏడుగురు నేపాల్ వాసులు మరణించారు.

బెంగళూరు నుంచి వస్తుండగా..

కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు బుధవారం రాత్రి బయలు దేరింది. ఇందులో 48 మంది ప్రయాణికులు ఉన్నారు. గురువారం వేకువజామున 3 గంటల సమయంలో కేరళ నుంచి సేలంకు వెళ్తున్న లారీ అవినాశి రాకియా పాళయం కూడలి వద్ద డివైడర్‌ను ఢీకొట్టి, రోడ్డుకు మరో వైపు దూసుకెళ్లింది. అదే సమయంలో ఆ మార్గంలో వస్తున్న కేరళ ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో

బస్సులోని ఇద్దరు డ్రైవర్లు సహా మొత్తం 20 మంది అక్కడికక్కడే చనిపోయారు. గాయపడ్డ 23 మందిని తిరుప్పూర్, కోయంబత్తూరు ఆసుపత్రులకు తరలించారు.

ఆధ్యాత్మిక పర్యటనలో..

మరో ఘటనలో.. భారత్‌లో ఆధ్యాత్మిక పర్యటనలో ఉన్న నేపాల్‌లోని కఠ్మాండూకు చెందిన 32 మంది బృందం రోడ్డు ప్రమాదం బారిన పడింది. కన్యాకుమారి నుంచి రాజస్తాన్‌కు వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న మినీ బస్సును సేలం– బెంగళూరు జాతీయ రహదారిలోని ఓమలూరు నరిపల్లం వద్ద ఎదురుగా వచ్చిన ఒక ప్రైవేటు బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఏడుగురు నేపాల్ వాసులు మరణించారు. గాయపడ్డ 25 మందిని చికిత్స నిమిత్తం సేలం ఆస్పత్రికి తరలించారు.

సింహాల గణనకు కొత్త విధానం

డెహ్రాడూన్: దేశంలో సింహాల సంఖ్యను లెక్కించేందుకు శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని కనుగొన్నారు. దీంతో వాటి సంరక్షణ చర్యలు సమర్థంగా చేపట్టొచ్చని చెబుతున్నారు. సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా గుజరాత్‌లోని గిర్ అడవుల్లో ఉన్న 50 ఆసియా సింహాల సంఖ్య ప్రస్తుతం 500 వరకు పెరిగినట్లు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు చెందిన కేశబ్ వివరించారు. ప్రస్తుతం ఉన్న లెక్కింపు విధానాల వల్ల కొన్ని సింహాలను లెక్కించకపోవచ్చు. లేదా డబుల్ కౌంటింగ్ జరగొచ్చు.. దీనివల్ల వాటి సంఖ్య వివరాలు పరిమితంగానే తెలుస్తాయి. అందుకే ఆయన సహచరులు కలసి కంప్యూటర్ ప్రోగ్రాం ఉపయోగించి లెక్కించే కొత్త విధానాన్ని రూపొందించారు. ఈ విధానంలో సింహం ముఖంపై ఉన్న మీసాలు, శరీరంపై ఉన్న మచ్చల ఆధారంగా గుర్తిస్తారు. సింహాల ఆహార లభ్యత, ఇతర కారకాలు సింహాల సంఖ్యను ప్రభావితం చేసే అవకాశం ఉందని కేశబ్ చెప్పారు. తాజా అధ్యయనంలో గిర్ అడవుల్లో 368 సింహాల్లో 67 సింహాలను 725 చదరపు కి.మీ.ల విస్తీర్ణంలో గుర్తించారు.

గోడకి తలబాదుకున్న నిర్భయ దోషి

- వినయ్ శర్మకు మానసిక సమస్యలు
- ఎలాంటి చికిత్స ఇస్తున్నారో వెల్లడించాలన్న ఢిల్లీ కోర్టు

వినయ్ శర్మ

న్యూఢిల్లీ: నిర్భయ అత్యాచారం, హత్య కేసు దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, అతనికి మెరుగైన వైద్యం అందించాలంటూ శర్మ తరపున అతని లాయర్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం ఢిల్లీ కోర్టు విచారణ చేపట్టింది. స్కిజోఫేర్నియా అనే మానసిక వ్యాధితో బాధపడుతున్నాడంటూ పిటిషన్‌లో పేర్కొనడంతో ఎలాంటి వైద్యం అందిస్తున్నారో వెల్లడించాలని తీహార్ జైలు అధికారుల్ని ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తి ధర్మేంద్ర రాణా ఆదేశించారు. ఉరిశిక్ష విధించిన దగ్గర్నుంచి వినయ్ శర్మ ఎవరితోనూ సరిగ్గా మాట్లాడడం లేదు. అసహనంగా సెల్‌లోనే పచార్లు చేస్తున్నట్టు తీహార్ జైలు అధికారులు వెల్లడించారు. మానసికంగా తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న వినయ్ శర్మ ఆదివారం మధ్యాహ్నం తీహార్ జైలులో తనను ఉంచిన గదిలో తల గోడకేసి బాదుకోవడంతో గాయాలయ్యాయి. వెంటనే అతనికి అక్కడికక్కడే తీహార్ జైలు వైద్యులే చికిత్స అందించినట్టు అధికారులు చెప్పారు. ఆ గాయాలు ఏమంత పెద్దవి కావని వారు వెల్లడించారు. అయితే శర్మ తరపు లాయర్ మాత్రం క్లయింట్ మానసికంగా తీవ్ర ఆందోళనలో ఉన్నాడని, తన తల్లిని కూడా గుర్తించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వినయ్ శర్మ కుటుంబ సభ్యుల కోరిక మేరకు లాయర్ తీహార్ జైలుకి వెళితే తలకి గాయాలు, కుడి భుజానికి ఫ్రాక్చర్ అయి కట్టుతో కనిపించాడని, అతనికి మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందంటూ లాయర్ తాను దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని విచారించిన కోర్టు తీహార్ జైలు అధికారులు స్పందించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

ఉరిశిక్షపై సుప్రీంకు వెళ్లడానికి దోషులకు 60 రోజుల గడువు

న్యూఢిల్లీ: ఉరిశిక్ష పడిన దోషులు శిక్ష నుంచి ఉపశమనానికి సుప్రీంకోర్టుకెక్కడానికి 60 రోజులు గడువు ఉన్నప్పటికీ ఈ లోగా వారికి డెత్ వారంట్లు ఎందుకు జారీ చేస్తున్నారని సుప్రీం కోర్టు గురువారం ట్రయల్ కోర్టులను ప్రశ్నించింది. 2018లో గుజరాత్‌లోని సూరత్‌లో మూడేళ్ల చిన్నారి అత్యాచారం, హత్యకేసులో అనిల్ సురేంద్ర సింగ్ యాదవ్‌ని ట్రయల్ కోర్టు దోషిగా తేల్చింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుని హైకోర్టు కూడా సమర్థించింది. ఆ తర్వాత కేవలం 33 రోజుల్లోనే కింది కోర్టు డెత్ వారంట్లు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ యాదవ్ సుప్రీంకోర్టుకెక్కాడు. దీంతో బెంచ్ యాదవ్ డెత్ వారంట్‌పై స్టే విధించింది. హైకోర్టు తీర్పుని సుప్రీంలో సవాల్ చేసుకోవడానికి దోషులకు 60 రోజులు గడువు ఉంటుందని, ఈలోగా డెత్ వారంట్లు జారీ చేయకూడదని సుప్రీంకోర్టు గతంలో తీర్పిచ్చింది. అలాంటప్పుడు కింది కోర్టులు డెత్ వారంట్లు ఎలా జారీ చేస్తారని సుప్రీం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

తగ్గుతున్న కోవిడ్ కేసులు

- కోవిడ్ మరణాలు 2వేల పైనే
- 74,576 మందిలో వైరస్

ద.కొరియాలో వైరస్ సోకిందనే అనుమానంతో రోగిని మరో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

బీజింగ్: కోవిడ్–19 విలయం చైనాలో కొనసాగుతూనే ఉంది. ఆ దేశ ఆరోగ్యశాఖ అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటివరకూ ఈ మహమ్మారి బారిన పడ్డవారి సంఖ్య 74,576కు చేరుకోగా మొత్తం 2,118 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఒక్కరోజే 114 మంది కోవిడ్‌కు బలయ్యారని చైనా ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తెలిపారు. హుబేలో కొత్త కేసుల సంఖ్య క్రమేపీ తగ్గుతోందని, అదే సమయంలో చికిత్స తరువాత ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అవుతున్న వారి సంఖ్య వ్యాధిబారిన పడుతున్న వారి కంటే ఎక్కువగా ఉండటం గమనార్హమని అధికారులు చెప్పారు. కోవిడ్ కారణంగా దక్షిణ కొరియాలో తొలి మరణం నమోదైంది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం నివారణ చర్యలకు దిగింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మతపరమైన ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో గుమికూడరాదని డీగూ నగర మేయర్ 25 లక్షల మందికి హెచ్చరికలు జారీ చేశారు.

హాంగ్‌కాంగ్ తిరిగి వచ్చిన ప్రయాణీకులు

జపాన్ తీరంలో లంగరేసిన డైమండ్ ప్రిన్సెస్ క్రూయిజ్‌షిప్‌లోని ప్రయాణీకుల్లో వందమంది గురువారం హాంకాంగ్ చేరుకున్నారు. ప్రత్యేక విమానం ద్వారా వచ్చిన వీరంతా హాంగ్‌కాంగ్ ప్రాంతానికి చెందినవారే. క్రూయిజ్‌షిప్‌లో మొత్తం 3,711 మంది ప్రయాణీకులు ఉండగా వీరిలో సుమారు 500 మందికి స్వస్థలాలకు వెళ్లేందుకు అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. హాంకాంగ్ చేరుకున్న 106 మంది ప్రయాణీకులను ప్రభుత్వ ఆసుపత్రిల్లో పర్యవేక్షణలో ఉంచారు.

విదేశాల్లో మహిళా సేనాని

శాశ్వత కమిషన్‌తో పాటు కమాండ్ పోస్ట్‌ల్లో మహిళా అధికారులను నియమించాలని ఆర్మీని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు నేపథ్యంలో.. ప్రపంచంలోని పలు ఇతర దేశాల్లోని ఆర్మీల్లో మహిళా అధికారుల పరిస్థితిపై చిన్న కథనం.

- చైనా ఆర్మీలో 5%లోపే మహిళా సైన్యాధికారులు
- 2016 తరువాతే అమెరికా పోరాట దళాల్లోకి..

న్యూఢిల్లీ: యుద్ధ విధుల్లో కీలక పాత్ర పోషించే అవకాశం మహిళలకు లభించడం అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇటీవల కాలంలోనే ప్రారంభమైంది. ముఖ్యంగా ప్రత్యక్ష యుద్ధ విధుల్లో, ప్రత్యేక ఆపరేషన్ల కోసం ఏర్పాటైన సుశిక్షిత దళాల్లో మహిళకు అవకాశం కల్పించడం బ్రిటన్‌లో 2018లో ప్రారంభించారు. అంతకుముందు, ఆయా దళాల్లో మహిళా సైనికాధికారులను చేర్చుకునే విషయంలో నిషేధం ఉండేది. అమెరికా సైన్యంలో కూడా 2016 వరకు సాధారణ సైనిక విధులకు మాత్రమే మహిళలు పరిమితమయ్యారు. 2016లో పోరాట దళాల్లోనూ వారికి అవకాశం కల్పించడం ప్రారంభించారు. 2019 సంవత్సరంనాటికి క్షేత్ర స్థాయి పోరాట దళాల్లో కీలక విధుల్లో ఉన్న మహిళా అధికారుల సంఖ్య 2906కి చేరుకుంది. అమెరికా వైమానిక, నౌకా దళాల్లోని పోరాట బృందాల్లో మహిళల భాగస్వామ్యం మాత్రం 1990వ దశకం మొదట్లోనే ప్రారంభమైంది.

చైనాలో..

ప్రపంచంలోనే సంఖ్యాపరంగా అత్యంత పెద్ద సైన్యం.. చైనాకు చెందిన 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ)' అన్న విషయం తెలిసిందే. దాదాపు 14 లక్షల చైనా ఆర్మీ గ్రౌండ్ ఫోర్స్‌లో ఉన్న మహిళా అధికారుల సంఖ్య సుమారు 53 వేలు మాత్రమే. అంటే 5శాతం కూడా లేరు. అలాగే, మన మరో పొరుగుదేశం పాకిస్తాన్ సాయుధ దళాల్లోని మహిళల సంఖ్య 3400 మాత్రమే. కెనడా దేశం 1989 సంవత్సరంలో, డెన్మార్క్ 1988 సంవత్సరంలో, ఇజ్రాయెల్ 1985లో సైనిక పోరాట విధుల్లో మహిళా సైనికులకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. సైన్యంలోకి మహిళలను తీసుకోవడం మాత్రం ఇజ్రాయెల్ 1948లోనే ప్రారంభించింది.

యుద్ధ విధుల్లోని అన్ని స్థాయిల్లో మహిళలకు అవకాశం కల్పించిన తొలి నాటో దేశంగా నార్వే నిలిచింది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటెజిక్ స్టడీస్ గణాంకాల ప్రకారం రష్యా సాయుధ దళాల్లో మహిళలు దాదాపు 10శాతం ఉన్నారు.

ఆర్మీలో లింగ వివక్ష లేదు



మహిళా సైనికాధికారులకు శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, కమాండ్ పోస్ట్‌ల్లో వారికి అవకాశం కల్పించాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఆర్మీ చీఫ్ జనరల్ నరవణె పేర్కొన్నారు. మహిళలకు శాశ్వత కమిషన్ ఏర్పాటుతో లింగ సమానత్వ దిశగా మరింత ముందడుగు వేసినట్లు అవుతుందన్నారు. భారత్‌లో మహిళా అధికారులను సైన్యంలోకి తీసుకోవడం 1993లోనే ప్రారంభమైందన్నారు. ఆర్మీలోని వివిధ స్థాయిల్లో విధులు అప్పగించేందుకు వీలుగా.. 100 మహిళా సైనికులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. శాశ్వత కమిషన్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నిస్తూ సైన్యంలోని మహిళాఅధికారులకు లేఖలను పంపిస్తున్నామని నరవణె వివరించారు.

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 21

ట్రంప్ నిష్ఠూరం!

ఎవరింటికైనా అతిథులుగా వెళ్తున్నప్పుడు వారి గురించి నాలుగు మంచి మాటలు మాట్లాడటం సంప్రదాయం. దేశాల మధ్య దౌత్యంలో అది మరింత అవసరం. పరస్పరం కలహించుకుని, కత్తులు నూరుకున్న దేశాధినేతలు సైతం రాజీ చర్చల కోసం ఒక చోటుకు చేరినప్పుడు అప్రియ భాషణకు, నిష్ఠూరాలకు దూరంగా వుంటారు. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీరే వేరు. ఆ క్షణానికి ఏం అనిపిస్తే దాన్ని మాట్లాడటం ఆయన లక్షణం. దౌత్య మర్యాదలకు భంగం కలుగుతుందా, దేశ ప్రయోజనాలు దెబ్బతింటాయా అన్నది ఆయనకు పట్టదు. దేశాధ్యక్షుడయ్యాక తొలిసారి మన దేశానికొస్తున్న ట్రంప్... భారత్ తనను బాగా చూడదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ అంటే మాత్రం తనకు చాలా ఇష్టమని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. భారత్ వేరు, మోదీ వేరు అని తనకెందుకు అనిపించిందో ఆయన చెబితేగానీ నిర్ధారణగా తెలిసే అవకాశం లేదు. కానీ ఈ పర్యటనపై ఆయన చాలా పెద్ద ఆశలే పెట్టుకుని వుండొచ్చని, అవన్నీ నెరవేరే అవకాశం కనబడకపోవడంతో ఇలా నిష్ఠూరమాడి వుంటారని భారత్-అమెరికా అధికారుల మధ్య ఈ పర్యటన కోసం గత కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చలపై వెలువడుతున్న కథనాలు చూస్తే అర్థమవుతుంది. భారత్ తనను బాగా చూడకపోవడం మాటేమోగానీ... ట్రంప్‌కే భారత్ అంటే చిన్నచూపుందని ఆయన తరచు చేసే వ్యాఖ్యానాలు నిరూపిస్తాయి. మన దేశానికి ఆయన 'టారిఫ్‌ల కింగ్' అని బిరుదు కూడా ఇచ్చారు. తాము విధించే టారిఫ్‌లన్నీ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు లోబడే వున్నాయని మన దేశం అనేక మార్లు చెప్పినా ఆయనకు పట్టదు. తన భారత్ పర్యటన గురించి ట్వీట్‌లు చేయడంతోపాటు ఇప్పటికే రెండు సందర్భాల్లో ఆయన మాట్లాడారు. వాస్తవానికి ఇది రెండు రోజుల పర్యటన అయినా, ఆయన మొత్తంగా మన దేశంలో వుండేది 34 గంటలు. ట్రంప్ పదే పదే చెబుతున్నది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరపబోయే పర్యటన గురించి. ముఖ్యంగా అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి మొతేరా స్టేడియం వరకూ రహదారికి ఇరువైపులా తనకు స్వాగతం చెప్పేందుకు 70 లక్షలమంది జనం వస్తారని మోదీ చెప్పిన మాట ఆయన చెవుల్లో రాత్రింబగళ్లు మార్మోగుతోంది. అంతమంది ప్రజానీకాన్ని కళ్లారా చూడాలని ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. కానీ 'తనను భారత్ బాగా చూడకపోతే...' ఇంతమంది జనం స్వాగతం పలకడానికి ఎందుకొస్తారన్న సందేహం ఆయనకు రావడం లేదు.

వ్యక్తిగా ట్రంప్ ఇష్టాయిష్టాల మాటెలావున్నా... దేశాధ్యక్షుడిగా, మరికొన్నాళ్లలో అధ్యక్ష ఎన్నికల బరిలో నిలబడే నేతగా ఈ పర్యటన నుంచి గరిష్టంగా లబ్ధి పొందాలని ఉవ్విళ్లూరుతున్నారు. మన దేశంతో చాలా పెద్ద వాణిజ్య ఒప్పందం కుదరబోతున్నదని ఆయన ప్రకటించారు. అయితే దానిపై ఈ పర్యటనలో సంతకాలు కాకపోవచ్చని కూడా ఆయనే చెప్పారు. ఇప్పుడు పరిమిత స్థాయిలోనైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని, దాన్ని భవిష్యత్తులో విస్తృత స్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంగా విస్తరించాలని ట్రంప్ గట్టిగా కోరుకుంటున్నారు. కానీ పరిమిత స్థాయి వాణిజ్య ఒప్పందం కూడా తక్షణం నెరవేరేలా కనబడకపోవడం ఆయనకు అసంతృప్తి కలిగిస్తోంది. వ్యవసాయం, డెయిరీ రంగాల్లో సైతం బహుళజాతి సంస్థల్ని అనుమతించాలన్నది అమెరికా కోరిక. ఆ కోర్కెను నెరవేరిస్తే ఆ రెండు రంగాలకూ అది శరాఘాతమవుతుంది. మన దేశంలో చిన్న స్థాయి డెయిరీ రైతులు, స్థానిక సహకార సంఘాలు, చిన్న స్థాయి అమ్మకందారులు మొత్తంగా 15 కోట్ల మంది వున్నారు. మనం పాల ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రగామిగా వుండటానికి, స్వయం స్వయం సమృద్ధికి వీరి నిరంతర కృషే కారణం. పలు దేశాల్లో పెత్తనం చేస్తున్న బహుళజాతి సంస్థలు ఇక్కడ చెల్లుబాటు కావడం లేదు. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం(ఆర్సెప్) ఒప్పందం సాకారమైవుంటే ఈ రంగం చిన్నాభిన్నమయ్యేది. అదృష్టవశాత్తూ ఎన్‌డీఏ ప్రభుత్వం దాన్నుంచి బయటకు రావాలని గత నవంబర్‌లో నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో వున్న చిన్న తరహా డెయిరీల ఉత్పత్తి వార్షిక విలువ పది వేల కోట్ల డాలర్లు. ఉత్పత్తయ్యే పాలలో సగం గ్రామీణ ప్రాంతాల్లోనూ, శేషభాగం విస్తృతంగా వున్న పాల సహకార సంఘాలు, చిన్న వ్యాపారుల ద్వారా పట్టణ, నగర ప్రాంతాలకు వెళ్తుంది. పాల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం డెయిరీ రైతులకు లభిస్తుందని అంచనా.

ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఉపాధికి ఆసరాగా నిలుస్తున్న వ్యవసాయ రంగంపై కూడా అమెరికా దృష్టి పడింది. పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక నష్టాల్లో మునిగి రైతన్నలు రుణభారంతో కుంగుతున్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు రంగప్రవేశం చేస్తే అది మన సాగురంగానికి చావు గంట మోగిస్తుంది. నిరుడు అక్కడి వ్యవసాయ రంగానికి అమెరికా ఇచ్చిన మొత్తం సబ్సిడీల విలువ 86,700 కోట్ల డాలర్లు. కనుక ఆ ఉత్పత్తులు కారు చౌకగా మన మార్కెట్‌లో లభిస్తాయి. ఆ పోటీలో మన సాగు రంగం ధ్వంసమవుతుంది. అమెరికా ఇస్తున్న స్థాయిలో మన రైతుకు కూడా సబ్సిడీలు లభిస్తే అప్పుడది సమవుజ్జీల పోటీగా వుంటుంది. కానీ అది సాధ్యమేనా? అమెరికాతో కుదరబోయే 'పరిమిత' వాణిజ్య ఒప్పందం కింద ఆ దేశం నుంచి ఏటా రూ. 42,000 కోట్ల విలువైన డెయిరీ, వ్యవసాయ ఉత్పత్తులు వచ్చిపడతాయని వ్యవసాయదారుల సంఘాల సమాఖ్య ఇటీవల ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో వాణిజ్య ఒప్పందంపై ముందడుగు వేయడానికి మన దేశం సందేహిస్తోంది. కోట్లాదిమంది జీవితాలతో ముడిపడివుండే సమస్యపై ఇప్పటికిప్పుడు నిర్ణయం ఎలాగని మన అధికారులు ప్రశ్నిస్తున్నట్టు ఒక కథనం చెబుతోంది. ఇదంతా ట్రంప్‌కు అసహనం కలిగించడం సహజమే. ఆయన కోపతాపాల మాటెలావున్నా దేశ ప్రయోజనాలకు విఘాతం కలగని రీతిలో మన పాలకులు నిర్ణయం తీసుకుంటారని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.త్రయోదశి సా.5.34 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం ఉత్తరాషాఢ ఉ.9.50 వరకు, తదుపరి శ్రవణం వర్జ్యం ప.1.10 నుంచి 2.46 వరకు, దుర్ముహూర్తం ఉ.8.45 నుంచి 9.31 వరకు, తదుపరి ప.12.35 నుంచి 1.21 వరకు అమృతఘడియలు... రా.12.10 నుంచి 1.55 వరకు, మహాశివరాత్రి.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

తల్లిభాష నిలవాలి ఇంగ్లీష్‌తో గెలవాలి!

బిలీప్ రెడ్డి

తల్లి భాషమీద తెలుగువారికి భావోద్వేగం ఉన్నంత పట్టుదల లేదు. వీరభక్తి పొంగి పొర్లేపాటి వివేకం లేదు. విధిగా ఏం చేసి భాషను బతికించుకోవచ్చో వివేచన లేదు. పాలకుల్లోనూ గాలి మాటలు చెప్పడమున్నంత కార్యాచరణ లేదు. తల్లి భాషగా తెలుగు బాగుకు, భాషాభివృద్ధికి ప్రభుత్వాల పరంగా చేస్తున్నది పెద్ద బండిసున్న. రెండు వేల ఏళ్లకు పైన వాడుకలో, వెయ్యేండ్లకు పైబడి సాహిత్యంలో తెలుగు నిలిచిందంటే... కవి-పండితులు, ఇతర సాహిత్యకారులు, భాషాభిమానులు, సామాన్యుల నిరంతర కృషి, సాధన, వ్యాప్తి, వ్యవహారమే తప్ప పనిగట్టుకొని ప్రభుత్వాలు చేసిన గొప్ప మేళ్లేమీ లేవు. నిర్దిష్ట కార్యాచరణే లేదు. సర్కార్లు చేసిన మేలు లేకపోగా... అధికారుల ఆంగ్ల ఆధిపత్యధోరణి వల్ల ఇన్నాళ్లు తెలుగుకు జరిగిన ద్రోహమే ఎక్కువ! ఇక భాష వివిధ రూపాల్లోకి, మాండలికాల్లోకి మారుతూ కూడా మౌలికంగా తన స్వభావాన్ని నిలుపుకొని ఈ నేలపై మనుగడ సాగిస్తోందంటే, అందుకు తెలుగు సమాజపు అవసరాలే కారణం. సామాన్యుల నుంచి సంపన్నులు, మహా విద్యావంతుల వరకు రోజువారీ వాడుక, వ్యవహారం వల్ల, అంతో ఇంతో వారి సాహితీ సృజన, ఆసక్తి వల్ల తెలుగు నిలిచింది. ఇప్పుడు తల్లి భాష గురించి తల్లడిల్లే వారిది, ఆంగ్ల భాషను తిట్టిపోసుకునే వారిదీ ఆవేశమే తప్ప సమగ్ర ఆలోచన కాదు. అసలు తెలుగుకు గడ్డుకాలం దాపురించడంలో లోపమెక్కడుందో గుర్తించే తెలివిడీ కాదు. తెలుగుపై సానుభూతి ప్రకటనలో ఆడంబరమే తప్ప కనీసం తమ పిల్లలకు తెలుగు నేర్పించడంలోనూ ఆచరణ శూన్యం! తెలుగు మాతృభాషలోనే ప్రాథమిక విద్యాబోధన జరగాలనే వాదనలో హేతువుంది. మామూలుగా చూసినపుడు ఆ ప్రతిపాదన బాగానే కనిపిస్తున్నా... అలా చదివిన వారు ప్రాథమిక విద్యో, మాధ్యమిక విద్యో ముగిశాక ఎక్కడ మునిగి ఎక్కడ తేలుతున్నారో చూడాలి. తర్వాతి కాలంలో వారెంతగా ఆంగ్లంపై ఆధారపడాల్సి వస్తున్నదో పరిశీలించాలి. అప్పటిదాకా తెలుగులో సాగించిన విద్యాభ్యాసం తమ తదనంతర ఉన్నత విద్యకు, ఉద్యోగం-ఉపాధి పొందడానికి ఎలా ప్రతిబంధకమౌతోందో గమనించాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్ దాటాక కూడా తెలుగు మాధ్యమంలోనే కొనసాగడానికున్న అవకాశాలు-పరిధులు, వనరులు-పరిమితులు, ఇతర సాధన సంపత్తి-కొరత ఏ స్థాయిలో ఉన్నాయో గుర్తించాలి. వాటన్నిటికీ మించి, ఉన్నత-వృత్తి విద్యా కోర్సుల్లో విధి లేని పరిస్థితుల్లో ఇంగ్లీషు మాధ్యమంలోకి మారడం వల్ల వారు ఎదుర్కొంటున్న కష్ట-నష్టాలు బేరీజు వేయాలి. అప్పుడుగాని, మన వాళ్ల భావావేశంలో కొరవడుతున్న సంబద్ధత, తెలుగే కావాలంటూ ఇంగ్లీషును ఈసడించుకోవడంలో లోపిస్తున్న హేతుబద్ధత అర్థం కావు.

పోటీకి సమస్థితి కల్పించాలి

జర్మనీ, జపాన్, చైనా, రష్యా, ఫ్రాన్స్, ఇటలీ... ఇలా అభివృద్ధి చెందిన దేశాలను ఉటంకిస్తూ, వారంతా తల్లిభాషలో ప్రాథమిక విద్య బోధన వల్లే అత్యంత సృజనతో ఎదుగుతున్నారనే వాదన ఉంది. అది నిజమే! ప్రాథమిక విద్య తల్లి భాషలోనే సాగాలన్నప్పుడు, ఇతరేతర సదుపాయాలు, వనరుల కల్పన, సన్నద్ధత ఎంతో అవసరం. పోటీదారుల మధ్య సమ, సానుకూల వాతావరణమూ ముఖ్యమే! ఆంగ్ల-తెలుగు మాధ్యమ విద్యార్థులకు విద్య-ఉద్యోగ-ఉపాధి అవకాశాల్లో వ్యత్యాసాలకు తావులేని సమస్థితి ప్రభుత్వాలు కల్పించాలి. అవసరమైతే తెలుగు మాధ్యమ విద్యార్థులకు ప్రోత్సాహకాలివ్వాలి. రిజర్వేషన్ కల్పించాలి. ఆయా దేశాల్లో లేని ఒక విచిత్ర పరిస్థితి బ్రిటిష్ వలస దేశాల్లో ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాల్లో కొఠారీ విద్యా విధాన ప్రభావం వల్ల ఇంగ్లీషు చదువులొక పార్శ్వంలో వృద్ధి చెందుతూ వచ్చాయి. తెలుగు, తమిళ, కన్నడ వంటి స్థానిక భాషలకు, విశ్వ భాషగా పరిగణించే ఇంగ్లీషుకు మధ్య పోటీ వాతావరణం ఉంటుంది. పైన పేర్కొన్న అభివృద్ధి సమాజాల్లో ఈ పంచాయతీ లేదు. వారికి తల్లి భాషలోనే అన్నీ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంతో పోటీ పడే వారెవరూ ఉండరు. దేశంలోని అన్ని స్థాయిల వారికీ తల్లి భాషలోనే పోటీ! ఇక

భాషాపరమైన వ్యత్యాసాలు, వివక్షకు తావెక్కడ? మన దగ్గర ఇప్పటికీ సంపన్నులు, ఎగువ మధ్య తరగతి, అంతో ఇంతో ఆర్థిక స్తోమత కలిగిన వారు తమ పిల్లలకు ఇంగ్లీషు మాధ్యమంలో విద్యా బోధన జరిపిస్తుంటారు. అది సైన్స్-టెక్నాలజీ అయినా, సామాజిక శాస్త్రాలైనా, వృత్తి కోర్సులయినా... ప్రపంచ స్థాయి విషయ వనరులు, ఆధునిక సమాచారం, కొత్త పరిభాష ఆంగ్లంలోనే లభిస్తుంది. కానీ, తెలుగు వంటి స్థానిక భాషల్లో శాస్త్రీయ పరిశోధనల లేమి, భాష ఎదుగుదల లేకపోవడం, భాషాంతరీకరణలు, అనువాదాలు ఎప్పటికప్పుడు జరగకపోవడం, పారిభాషక పదకోశాలు, నిఘంటువులు సరిగా నిర్మాణం కాకపోవడం వల్ల విషయ వనరుల కొరత ఉంటుంది. బోధన కూడా ఆ స్థాయిలో ఉండదు. భావ ప్రసరణ నైపుణ్యాల్లోనూ వెనుకబాటుతనమే! దాంతో, ఉన్నత విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలప్పుడు ఆంగ్ల మాధ్యమ విద్యార్థులతో పోటీ పడలేని స్థితి తెలుగు మాధ్యమ విద్యార్థులకుంటుంది. ఇందుకు నేపథ్యం... పేద, దిగువ మధ్య తరగతి పిల్లలు ఆంగ్ల మాధ్యమ విద్యాబోధన దొరకని సర్కారీ బడుల్లో, తెలుగులోనే చదువుకోవాల్సి రావడం. ఒక స్థాయి దాటిన తర్వాత వారికి కష్టాలు ఎదురవుతున్నాయి. అవకాశపు తలుపులు మూసుకుపోతున్నాయి. తెలివి, చొరవ, ఆసక్తి, వాటన్నిటికీ మించి అవసరం ఉండి కూడా పోటీని తట్టుకోలేక చతికిలపడుతున్నారు. అందుకే, ఏపీ ప్రభుత్వం ప్రకటించిన సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమ విద్యాబోధనను వారు స్వాగతిస్తున్నారు. ఇవేవీ ఆలోచించకుండా సర్కారు బడుల్లో తెలుగే మాధ్యమంగా ఉండాలని, ఇంగ్లీషు మాధ్యమంగా ఉండకూడదనే వాదన సరికాదు. అది కడకు ఉన్నవారికి-లేనివారికి మధ్య దూరం పెంచడమే! అవకాశాల్లో వివక్షను పెంచి పోషించడమే అవుతుంది. పేదవర్గాలకు చెందిన తెలుగు మాధ్యమ విద్యార్థుల అవకాశాల్ని కర్కశంగా నలిపేయడమే అవుతుంది.

బతికుంచుకునే ఏ యత్నమూ జరగట్లే!

భాష ఎన్నో ప్రయోజనాలు కలిగిన మానవ పనిముట్టు. ఇతర జీవుల నుంచి మనిషిని వేరుపర్చే ప్రత్యేక లక్షణం భాషది. మరే జీవీ మనిషి లాగా భాషనొక సాధనంగా మార్చుకొని తన రోజువారీ అవసరాలు తీర్చుకున్నది లేదు. భాషలెన్ని ఉన్నా... తల్లి భాష ఎంతో ముఖ్యమైంది. రోజువారీ వ్యవహారాల్లోనే కాక మనసు ప్రకటించడం, బంధాలల్లుకోవడం, వక్తిత్వ వికాసం, ఊహ పరిధి విస్తరణ, మానవ సంబంధాల వృద్ధి... ఇలా ఎన్నెన్నో ప్రయోజనాలు భాష వల్లే సాధ్యం. ఇలా పరస్పర భావ ప్రసరణకే కాకుండా వారసత్వంగా వస్తున్న సంప్రదాయ విజ్ఞానాలను భవిష్యత్తరాలకు అందించడానికి, భద్రపరచడానికీ భాష సాధనం. ఐక్యరాజ్య సమితి ఫిబ్రవరి 21 అంతర్జాతీయ తల్లి భాషా దినోత్సవంగా ప్రకటించడానికి ప్రేరణ మన బెంగాలీలే! తూర్పు పాకిస్తానీయులు తమ తల్లి భాష బంగను జాతీయ భాషగా గుర్తించాలని 1952 ఫిబ్రవరి 21న ఢాకాలో ఆందోళన చేస్తున్నపుడు పోలీసులు జరిపిన కాల్పుల్లో పలువురు యువకులు బలయ్యారు. దాంతో కదిలిపోయిన పాక్ ప్రభుత్వం బంగను ఒక జాతీయ భాషగా ప్రకటించింది. తర్వాత 1971లో బంగ్లాదేశ్ ఏర్పడ్డపుడు బంగ భాషే అక్కడ అధికార భాషయింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన తల్లి భాషను కాపాడుకునే నిర్మాణాత్మక ప్రయత్నమేదీ తెలుగు సమాజంలో జరగటం లేదు. రాను రాను తెలుగు చదివే, రాసే వారి సంఖ్య రమారమి తగ్గిపోతోంది. తెలుగుపట్ల కొత్తతరం ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. తెలుగు నేర్చుకొండని తలిదండ్రులూ తమ పిల్లల్ని ఒత్తిడి చేయడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు ప్రతి తరగతిలో తెలుగు ఒక తప్పనిసరి 'విషయం'గా నిర్బంధం చేస్తూ ఆదేశాలిచ్చారు. ఇదివరకు అలా లేదు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంకా ఫ్రెంచ్ తదితర భాషల్లోంచి ఏదైనా ఒకటి ఎంపిక చేసుకునే అవకాశమిస్తూ వచ్చారు. దాంతో, తేలిగ్గా ఉంటుందని, ఎక్కువ మార్కులు తెచ్చుకోవచ్చని ఏ హిందీనో, సంస్కృతమో, ఫ్రెంచో ఎంపిక చేసుకోవడం మన పిల్లలకు అలవాటయింది. దాంతో తెలుగుకు పూర్తిగా దూరమయ్యారు. ఇప్పుడు రెండు ప్రభుత్వాలు తెలుగును నిర్బంధం చేయడం వల్ల విధిగా చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తల్లి భాష పరిరక్షణలో ఇదో ముందడుగు.

ఇంకెంతో చేయాలి

ఉన్నత విద్య ప్రవేశాల్లో, ఉద్యోగ-ఉపాధి అవకాశాల కల్పనలోనూ తెలుగులో అభ్యర్థులకుండే ప్రావీణ్యానికి అదనపు వెయిటేజీ మార్కులివ్వాలి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆధునిక పరిశోధనలు, పరిణామాల సమాచారం నిరంతరం తెలుగులోకి తర్జుమా అయ్యేట్టు చూడాలి. ఇంటర్నెట్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమ వేదికల్లో తెలుగు అందుబాటులో ఉండేట్లు ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలి. తెలుగును ఓ ఆధారపడదగ్గ భాషగా నేటి యువతరానికి విశ్వాసం కల్పించాలి. అధికార భాషా చట్టం నిర్దేశిస్తున్నట్టు, ప్రభుత్వ ఉత్తర్వులు, ఆదేశాలు, నివేదికలు, విధివిధానాలు, నిత్య వ్యవహారాలు... ఇలా అన్నీ తెలుగులోనే జరిగేలా కట్టడి చేయాలి. స్థానిక న్యాయస్థానాల్లో తెలుగులోనే తీర్పులు వెలువడేలా చూడాలి. వారికెంత ఇంగ్లీష్ వచ్చినా, తెలుగువాళ్లు పరస్పరం తెలుగులోనే మాట్లాడుకోవాలి. తల్లి భాషలో మాట్లాడటాన్ని తక్కువ చేసి చూడకూడదు. మాండలికాల్ని ఆదరిస్తూనే ఓ ప్రమాణభాష రూపొందించుకోవాలి. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు తెలంగాణ ప్రభుత్వం 'ప్రతి ఒకరు మరొకరికి నేర్పండి' (ఈచ్ వన్ టీచ్ వన్) అంటోంది. తల్లిభాష వ్యాప్తికి ఇదొక చక్కని అవకాశం. తల్లి భాష తెలుగును కాపాడుకోవడమంటే ప్రపంచపు కిటికీ 'ఇంగ్లీషు'ను వ్యతిరేకించడం కాదు. తెలుగును విని, మాటాడి, చదివి, రాయగలిగితే చాలు. మహా కథకుడు కొడవటిగంటి కుటుంబరావు అన్నట్టు 'తల్లిభాషలో ఒక ఉత్తరం రాయటం చాతగాని వాడు ఎన్ని డాక్టరేట్లు సంపాదించినా నిరక్షరుడే!'

(నేడు అంతర్జాతీయ తల్లిభాషా దినోత్సవం)

ఈ-మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పిల్లిమెడలో గంట

"కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించడానికి కనీసం ఆరు నుంచి ఎనిమిది మంది సమర్థ నేతలు సిద్ధంగా ఉన్నారు. కానీ, పార్టీలో ఎలాంటి కార్యాచరణ ఉండకూడదని భావిస్తున్నారు కాబట్టే సీనియర్లు క్రియాశీలకంగా ఉండరు. ఇలాంటి వారికి రాజకీయాల్లో ఇది చరమాంకం. మహా అయితే వీరు రాజకీయాల్లో నాలుగయిదేళ్లు మాత్రమే కొనసాగుతారు. కాబట్టి ఇకనైనా వీరు నాయకత్వ ఎంపిక ప్రక్రియలో మేధోపరమైన తోడ్పాటు ఇవ్వడానికి ఇదే తగిన సమయం. కానీ పిల్లి మెడలో ముందుగా గంట కట్టేదెవరు?"

– సందీప్ దీక్షిత్, కాంగ్రెస్ యువనేత

బాబు భ్రమ

"గట్టిగా చప్పట్లు కొట్టి తనను ఉత్సాహపరచాలని 70 ఏళ్ల వయసులో చంద్రబాబునాయుడు ప్రాధేయపడుతుంటే జాలేస్తుంది. ఆయన పార్టీ కార్యకర్తలు మరీ స్పందన లేకుండా మారిపోతే ఎలా? అడిగినందుకైనా కాసేపు క్లాప్స్ కొట్టొచ్చుగదా. చివరకు స్లోగన్స్ ఇచ్చి అందరూ తనతోనే ఉన్నారని భ్రమపడి ఇంకో చోటుకి బయలుదేరుతున్నాడు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ

అప్రధానం

"మీ భుజాలపై స్టార్స్ ధరిస్తున్నారు కాబట్టి సైనికులు మిమ్మల్ని గౌరవించడం లేదు. మీరు వారి గౌరవాన్ని సంపాదించుకోవాలి. మీకు సామర్థ్యం ఉందని వారు నమ్మితే, మీతో కలిసి నరకానికి ప్రయాణం చేయడానికైనా సిద్ధపడతారు. మీరు పురుషులా, లేక స్త్రీలా అనేది సమస్య కానేకాదు. నాయకత్వమే ప్రధానం కానీ జెండర్ ప్రధానం కాదు"

– రాజ్యవర్ధన్ రాథోడ్, బీజేపీ ఎంపీ

సెల్యూట్

"నాలుగేళ్ల క్రితం 24 ఏళ్ల వయసున్న సైనికాధికారి నాతో మాట్లాడుతూ, 'సిక్ లీవుపై ఇంటికి వెళ్లడానికి తిరస్కరించిన తోటి సైనికులతో గడపాలనుంది సర్' అని చెప్పాడు. ఇప్పుడు అతడి పార్థివదేహానికి నేను సెల్యూట్ చేశాను. ఆరు అంతస్తుల భవంతిలో చిక్కుకున్న బందీలను విడిపించడానికి కెప్టెన్ పవన్, మరో ఇద్దరు సైనికులు తమ జీవితాలను త్యాగం చేశారు. ధీర సైనికులకు సెల్యూట్!"

– లెఫ్టినెంట్ జనరల్ సతీష్ దువా, భారత సైన్యం

జాతి వ్యతిరేకి

"గత రాత్రి మోంటెక్ సింగ్ అహ్లువాలియా పుస్తకావిష్కరణ సందర్భంగా ఆర్థికవ్యవస్థ పరిస్థితిపై చర్చ జరిపాం. యూపీఏ-2 హయాంలో బ్యాంకుల వైఫల్యంపై, సంకీర్ణ ఒత్తిళ్లను తట్టుకోవడంపై ప్రశ్నలు లేవనెత్తాను. మన్మోహన్ సింగ్ నా ముందు వరసలో ఉన్నారు. మంచి చర్చచేశారని నాతో చెబుతూనే తనను జాతి వ్యతిరేకి అని ఎవరూ పిలవలేదని చెణుకు విసిరారు"

– రాజ్‌దీప్ సర్దేశాయి, సీనియర్ జర్నలిస్టు

ధీరనాయకుడు

"స్వేచ్ఛా భారత్‌పై విశ్వాసమున్న ధీరనాయకుడు మన్మోహన్ సింగ్. కుళ్లుబోతు మనస్కులే ఆయన ప్రతిష్టను భంగపర్చాలని చూస్తున్నారు. కానీ ఆయన ఘన వారసత్వం వీరందరికంటే సమున్నతంగా నిలబడుతుంది"

– సాగరికా ఘోష్, సీనియర్ జర్నలిస్టు

కమ్యూనిస్టు ప్రణాళిక ఘనత

సందర్భం

కొండూరి వీరయ్య

విశ్వమానవ విముక్తి కోరే శక్తులంతా ఒక్కటై విప్లవోద్యమానికి పునరంకితమయ్యే దిశగా జరుగుతున్న ప్రయత్నం ప్రపంచ అరుణ గ్రంథోత్సవం. ప్రపంచ గతిని మార్చిన కమ్యూనిస్టు ప్రణాళిక తొలిసారి పుస్తకరూపంలో విడుదలైన రోజు 1848 ఫిబ్రవరి 21. విశ్వవిపణిలో శ్రమ అమ్ముకోవటం తప్ప మరో జీవనాధారం లేని కోట్లాదిమందికి గొంతుకనిచ్చిన రచన మార్క్స్, ఏంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక. ఈ ప్రణాళిక విడుదల దినోత్సవాన్ని ప్రపంచ అరుణ గ్రంథ దినోత్సవంగా ఇక నుంచి ప్రతి ఏటా ప్రపంచ ప్రజాతంత్ర విప్లవ శక్తులు జరుపుకోనున్నాయి. దాదాపు 170 ఏళ్లు దాటిన తర్వాత కూడా కమ్యూనిస్టు ప్రణాళికను ప్రపంచం ఎందుకు గుర్తు పెట్టుకుంది? ఇంతవరకు ప్రపంచానికి అందుబాటులోకి వచ్చిన కోటానుకోట్ల గ్రంథాల్లో వేల సంవత్సరాల ప్రజల చరిత్రను ప్రజల భాషలో వివరించిన ఏకైక గ్రంథం కమ్యూనిస్టు ప్రణాళిక. ప్రపంచంలో ఏ రోజైనా ఏ ఖండంలోనైనా పరీక్షకు నిలవగల సామాజిక చలన సూత్రాలను ప్రపంచానికి 34 పేజీల నిడివిలో అందించిన గ్రంథం ఇది.

చారిత్రక భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం, రాజకీయ అర్థశాస్త్రం. ఈ మూడింటి సమాహారమే మార్క్సిజం. ఈ మూడు సూత్రాలు విశ్వవిజ్ఞానానికి తలుపులు తెరిచే తాళం చేతులు. ఈ తాళం చేతులు ఏ దేశ ప్రజలు ఒడిసి పట్టుకుంటారో వారే ఆ సమాజంలో జరుగుతున్న మాయలు, మర్మాలు, కుట్రలు, కుతంత్రాలు, మతం పేర ప్రాంతం పేర జరిగే అణచివేతలు, సంపద కేంద్రీకరణ వంటి అనేక దైనందిన సమస్యలకు మూలాలను గుర్తించగలుగుతారు. పిడికెడుమందికి ప్రపంచ సంపద కట్టబెట్టటానికి కోటానుకోట్లమందిని అదుపులో ఉంచాలన్న ప్రయత్నంలో వచ్చిందే రాజ్యం. పొత్తిళ్లలో ఉన్న దశ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ తన ప్రయోజనాలు కాపాడుకోవటానికి అడ్డువచ్చిన అన్నింటినీ దునుమాడుకుంటూ వెళ్లింది. సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, స్వేచ్ఛావాణిజ్యం ఈ పెట్టుబడి ప్రయోజనాలు కాపాడేందుకు పుట్టుకొచ్చిన వ్యవస్థలు. ఆయుధాలు. వీటి మాటున పెట్టుబడి సాగిస్తున్న దాడిని గుర్తించిన రోజున ప్రజలు తమ చరిత్రను తామే రాసుకుంటారు.

ప్రతి సమాజంలోనూ విప్లవానికి అనుకూలమైన పరిస్థితులు ఆ సమాజపు గర్భంలోనే దాగి ఉంటాయి. వాటిని వెలికితీసి ప్రజల ముందుంచటమే విప్లవోద్యమాల కర్తవ్యం. పెట్టుబడిదారీ దోపిడీ మర్మాన్ని, ఈ దోపిడీ నుండి విముక్తి పొందే మార్గాన్ని విప్పి చెప్పే కమ్యూనిస్టు ప్రణాళికను లక్షన్నర కాపీలు ముద్రించి ప్రజలకు అందించటం ద్వారా ప్రపంచ అరుణ గ్రంథోత్సవాన్ని జరుపుకుంటున్నాయి తెలుగు రాష్ట్రాల్లోని విముక్తి శక్తులు. తెలుగు సాహితీ చరిత్రలో ఓ పుస్తకం ఒకేసారి లక్షన్నర ప్రతులు అచ్చు కావటం ఇదే తొలిసారి. అటువంటి చరిత్రాత్మక గ్రంథాన్ని ప్రజలక

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 21-2-2020

షాక్ అయ్యాం
సినిమా పేజీలో...

● నిఖిత, మేజర్ విభూతి శంకర్ (ఫైల్ ఫొటో)

వైఫాఫ్ మేజర్ విభూతి శంకర్

"నువ్వేం చెప్పావ్.. నన్ను ప్రేమించాననే కదా! అయితే నాకన్నా దేశాన్నే ఎక్కువగా ప్రేమించావు. గర్వంగా ఉంది. నీ ప్రేమ గొప్పది. నువ్వెన్నడూ చూడనైనా చూడని వారి కోసం నీ ప్రాణాలను త్యాగం చేశావు. ధైర్యవంతుడివి. నీ జీవిత భాగస్వామిని అయి ఉండటం నాకొక గౌరవం. నా చివరి శ్వాస వరకు నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను. నా జీవితం నీదే".

ఏడాది క్రితం.. ఇదే నెలలో.. కశ్మీర్ నుంచి.. డెహ్రాడూన్ చేరుకున్న మేజర్ విభూతి శంకర్ ధౌండియాల్ భౌతికకాయం ఉన్న శవపేటికపై వాలి, ఆయన భార్య నిఖితా కౌల్ అన్నమాటలివి. మనసులో అనుకోలేదు. గొణుక్కున్నట్లు అనుకోలేదు. స్పష్టంగా.. బతికున్న మనిషితో మాట్లాడినట్లే భర్తపై తన ప్రేమను వ్యక్తం చేశారు నిఖిత. గత ఏడాది ఫిబ్రవరి 18న ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు శంకర్. భీకర పోరు అది. పుల్వామాలో నలభైమంది జవాన్‌లను పొట్టన పెట్టుకున్న జైషే–మొహమ్మద్ ఉగ్రనేత ఘాజీ రిషీద్‌ను నాలుగు రోజుల పాటు వెతికి వేటాడి హతమార్చాక, ఎదురు కాల్పుల్లో తనూ చనిపోయాడు మేజర్ శంకర్. అప్పటికి నిఖితతో అతడి పెళ్లి జరిగి ఏడాది కూడా కాలేదు. భర్త మరణవార్త ఆమెను కుదిపేసింది. అతడికి 33. ఆమెకు 27. ఇంకా చాలా జీవితం ఉంది. భర్త అంత్యక్రియల్లో నిఖిత అన్నమాట ఎవరూ మర్చిపోలేనిది. ప్రతి భారతీయుడిని ఉద్దేశించి ఆమె ఆ మాట అన్నారు. ''ఇలాంటప్పుడే మనం బలంగా ఉండాలి. ఇప్పుడే మనం కలిసికట్టుగా ఉండాలి..' అంటూ, హరిద్వార్‌లో గంగానది ఒడ్డున్న ఆయన చితికి సెల్యూట్ చేశారామె. ఆ క్షణంలోనే శత్రువుపై అంతకంతా తీర్చుకునేందుకు మానసికంగా ఆమె సైన్యంలోకి వెళ్లిపోయారు.

●●●

ఏడాది గడిచింది. ఇండియన్ ఆర్మీలో చేరడానికి నిఖిత ఇప్పుడు సిద్ధంగా ఉన్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్.ఎస్.సి.) పరీక్ష రాశారు. ఇంటర్వ్యూలో ఎంపిక అయ్యారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలోని ఒక ఎమ్.ఎన్.సి. (మల్టీ నేషనల్ కంపెనీ)లో పని చేస్తున్నారు. ఆ ఉద్యోగాన్ని వదిలి, త్వరలోనే ఆర్మీ శిక్షణ కోసం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీకి వెళ్లబోతున్నారు. ఎస్.ఎస్.సి. పరీక్ష రాస్తున్నప్పుడు.. తన భర్త కూడా ఇలాగే పరీక్ష రాసి ఉంటారు కదా అన్న ఆలోచన వచ్చి ఆయనకు తనెంతో దగ్గరగా ఉన్నట్లు అనుభూతి చెందానని నిఖితా కౌల్ అన్నారు. భర్తకు ఒక జ్ఞాపకంగా మాత్రమే ఆమె మిగిలిపోదలచుకోలేదు. భర్త మిగిల్చి వెళ్లిన బాధ్యతల్ని తుపాకీలా భుజాన మోయాలని గట్టిగానే తీర్మానించుకున్నారు. ●

● నిఖిత, మేజర్ విభూతి శంకర్ (ఫైల్ ఫొటోలు)

అతడు.. ఆమె.. సైన్యం

'మీ పెళ్లయి ఎన్నాళ్లయింది?' అడిగింది ఇంటర్వ్యూ బోర్డు.

'దాదాపు రెండేళ్లు' జవాబిచ్చారు నిఖిత.

'కాని మీ పెళ్లయి తొమ్మిది నెలలైనట్టు విన్నామే' అని ఆశ్చర్యపోయారు బోర్డు సభ్యులు.

' నా భర్త భౌతికంగా ఈ లోకాన్ని విడిచి పెట్టినంత మాత్రాన మా పెళ్లి ముగిసినట్లు కాదు కదా?' తిరిగి ప్రశ్నించారు నిఖిత.

నిజమే.. పెళ్లయిన తొమ్మిదినెలలకే భర్త అమరుడయ్యాడు. కాని ఆమె అతని తోడును కోల్పోలేదు. దేశం పట్ల అతనికున్న భక్తి, ఆ యూనిఫామ్ అంటే అతనికున్న నిబద్ధత ఆమె మనసులో అతణ్ణి సజీవంగా ఉంచాయి. తనూ సైన్యంలో చేరడమే తన భర్తకు ఆమె ఇచ్చే ఘనమైన నివాళిగా భావించారు. నిఖిత కౌల్.. కశ్మీర్ వాసి. ఢిల్లీ దగ్గరి నోయిడాలో ఉద్యోగం.

''మన దేశ జెండా గుడ్డలో చుట్టి తెచ్చిన నా భర్త భౌతిక కాయాన్ని చూసి నప్పుడే నిశ్చయించుకున్నాను ఆయన అడుగుజాడల్లో సాగాలని. ముందసలు నా భర్త లేడు అన్న సత్యాన్ని జీర్ణించుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది. నెమ్మది నెమ్మదిగా అలవాటుపడ్డాను. విభూ చాలా ప్రోగ్రెసివ్. తన కన్నా నేను గొప్పగా ఉండాలని ఆశపడేవాడు. ఆయన ఆలోచనలు, ఆశయాలే నన్ను ఇండియన్ ఆర్మీ వైపు నడిపించాయి. నేను తీసుకున్న ఈ నిర్ణయం కరెక్టేనా కాదా అన్న సందేహం ఏమాత్రం వచ్చినా.. ఏ కొంచెం ఆందోళన కలిగినా వెంటనే కళ్లు మూసుకొని విభూ ఉంటే ఏం చేసేవాడు అని ఆలోచించే దాన్ని. వెంటనే నాకున్న సందేహాలు, ఆందోళన మాయం అయిపోయేవి. విభు చనిపోయాక ఆర్నెల్లకు ఎస్ఎస్‌సికి దరఖాస్తు చేశాను. ఆ బాధ నుంచి కోలుకోవడానికి ఎస్ఎస్‌సి ప్రిపరేషన్ ఎంతగానో ఉయయోగపడింది. నేను పరీక్ష రాస్తున్నప్పుడు, ఇంటర్వ్యూకి హాజరవుతున్నప్పుడు విభూనే తలుచుకున్నాను.. ఈ పరీక్ష, ఇంటర్వ్యూలప్పుడు తను ఎలా ఫీలయ్యుంటాడో అని. ఆయన భయాలు, ఆందోళనలతో నేనూ కనెక్ట్ అయ్యాను. ఒకరకంగా అదే నాకు శక్తినిచ్చిందని చెప్పొచ్చు' అంటారు నిఖితా కౌల్.

చెట్టు నీడ

పలికే దైవం

ఆది మధ్యాంత రహితుడు, జనన మరణాలు లేనివాడు, అల్పసంతోషి, అనుగ్రహ ప్రదాత, దేవ దానవ మానవాది సకల జీవరాశినీ కాపాడటం కోసం గరళాన్ని కంఠాన ధరించిన కారుణ్యమూర్తి.. శివుడు. మానవులే కాదు, ఇతర దేవతలు కూడా అమంగళకరమైనవిగా, అశుభకరమైనవిగా భావించే శ్మశానం, కపాలం, చితాభస్మం, విషసర్పాలు వంటివి ఆయనకు ప్రీతిపాత్రమైనవి. తాను శ్మశానవాసిగా భిక్షాటన చేస్తున్నా, తన భక్తులకు సకలైశ్వర్యాలను ప్రసాదించే భక్తసులభుడు, ఆర్తితో పిలిస్తే పలికే దైవం. అటువంటి మహాశివునికి అత్యంత ప్రీతికరమైన రేయి మహాశివరాత్రి. లోకకళ్యాణం కోసం శివుడు మహాశివరాత్రి నాడు అర్ధరాత్రి శివలింగం నుంచి బయటకు వస్తాడని, ఆయన రాకకోసం జాగ్రతతో ఎదురు చూస్తూ జాగరణ చేయాలని పురాణాలు చెబుతున్నాయి. ఆయనకు అన్నివిధాలా అనుకూలవతీ, ఆయనలోని ఐశ్వర్యానికి కారకురాలు అంబ. అందుకే ఆయన సాంబుడయ్యాడు. (స+అంబ). పార్వతితో కూడి ఉంటాడు కనుక పార్వతీ పతి అయ్యాడు. ఆయన ఆదిభిక్షువైతే ఆమె అన్నపూర్ణగా, ఆయన శ్మశాన వాసి అయితే ఆమె సర్వ మంగళ స్వరూపిణిగా, ఆయన లయకారుడైతే, ఆమె జగజ్జననిగా, ఆయన చీకటి అయితే, ఈమె వెలుగుగా. ఆయన అడుగు అయితే ఆమె ఆ అడుగుల సవ్వడిగా అన్నింటా తోడుగా నీడగా పరస్పర అనురాగ వాత్సల్యంతో... భిన్నత్వంలో ఏకత్వంగా ఒకే శరీరంగా కలిసిపోయిన ఆ పార్వతీ పరమేశ్వరులు ఈ జగత్తుకే మాతాపితరులు. ఈ మహాశివరాత్రి పర్వదినాన గుండె అనే గుడిలో భక్తి అనే విబూదిని ధరించి నిండుమనస్సుతో ఆ జగజ్జననీ జనకులను స్మరించుకుందాం... సేవించుకుందాం.

– డి.వి.ఆర్.

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

చిన్నారి సల్వా మరికొన్నాళ్లు.. పూర్తిగా ఊహ వచ్చేవరకు.. తండ్రి చెప్పిన అబద్ధాన్ని నిజం అని నమ్ముతూ హాయిగా నవ్వుతూనే ఉంటుంది. ఇలాంటి ఒక అమాయకపు నవ్వు చాలదా.. పెద్దలు.. తాము ఆడుతున్న యుద్ధం అనే ఆటను ఆపేయడానికి!

● కూతురు సల్వాతో అబ్దుల్

● ఇడ్లిబ్‌లో బాంబు పేలుడు

యుద్ధం నవ్వులపాలు

సల్వాకు మూడేళ్లు. ఆమె తండ్రి అబ్దుల్లా అల్–మొహమ్మద్. ఆ కుటుంబం సిరియాలోని ఇడ్లిబ్ పట్టణంలో ఉంటోంది. ఉండటం కాదు. అదే వారి ఊరు. అదే వారి దేశం. సిరియాలో పదకొండేళ్లుగా అంతర్యుద్ధం జరుగుతోంది. ఉన్నది రెండు కోట్ల జనాభా. బాంబులు, ఫిరంగుల దాడులలో ఇప్పటివరకు 3 లక్షల 70 వేల మందికి పైగా చనిపోయారు. ఇంటి పైకప్పులో ప్రాణాలు పెట్టుకుని నిద్ర లేస్తున్నారు బతికున్న సిరియన్‌లు. ఎప్పుడు ఏ బాంబు, ఏ ఫిరంగి నెత్తిపైన వచ్చిపడుతుందో తెలియదు. రోజూ గుప్పెడు మందైనా విగత జీవులై అరిచేతులు తెరుస్తున్నారు. చనిపోయిన వారిలో 13 వేల మందికి పైగా స్త్రీలు, 21 వేల మందికి పైగా చిన్నారులు. యుద్ధం ఇప్పట్లో ఆగేటట్లు లేదు. ప్రభుత్వాన్ని దించేందుకు పౌరులు, ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు సిరియా ప్రభుత్వ స్నేహ దేశాలు ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు. చిన్న ఆధారం దొరికితే పట్టుకుని శరణార్థులుగా వెళ్లిపోతున్నాయి సాధారణ సిరియన్ కుటుంబాలు.

●●●

అయితే అబ్దుల్లా అల్–మొహమ్మద్ కుటుంబం మాత్రం ఇడ్లిబ్ నుంచి కదలడం లేదు. ఏ క్షణాన గూడు కూలిపోతుందో తెలియదు. అయినా.. అక్కడే, ఆ ఇంట్లోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆకాశంలో విమానం ఉరిమిన ప్రతిసారీ ఇళ్లలోని చిన్నారులు ఉలిక్కిపడుతున్నారు. ఫిరంగులు వచ్చి గోడలకు చిల్లులు కొడుతున్నప్పుడు అమ్మానాన్నని హత్తుకుపోతున్నారు. సల్వా కూడా మొదట్లో ఆ శబ్దాలకు గుక్కపట్టి ఏడ్చేదే కానీ.. అబ్దుల్లా తన కూతురు భయపడకుండా ఉండటం కోసం ఓ ట్రిక్ కనిపెట్టాడు. బాంబు పడిన శబ్దం చెవుల్ని తాకగానే ఆయన పెద్దగా నవ్వేవాడు. ఇంటి గోడకు వచ్చి ఫిరంకి తగిలినప్పుడూ అంతే. పెద్ద నవ్వు. ''ఎందుకు నాన్నా నవ్వుతున్నావ్?' అని అడిగింది ఓ రోజు సల్వా.''బయట పిల్లలెవరో 'ఢాం' అని పేలుస్తున్నారు. ఆ చప్పుళ్లకు నవ్వొస్తోంది'' అని చెప్పాడు. అప్పట్నుంచీ బాంబు పడితే సల్వా కూడా నవ్వడం మొదలు పెట్టింది. అలా ఇద్దరూ నవ్వేవారు. ముఖాలు చూసుకుంటూ నవ్వేవారు. అదిప్పుడు ఆ తండ్రీ కూతుళ్లకు ఒక ఆట అయింది. రోజూ అంతే. ''ఆ చప్పుడేంటో చెప్పుకో! అది విమానం విడిచిన బాంబా? ఫిరంగా?'' అని తండ్రి కూతుర్ని అడుగుతాడు. 'ఆ.. అది ఫిరంగి' అంటుంది కూతురు.. పెద్దగా ఆలోచించకుండానే. చివరికి ఎలాగైందంటే.. విమానం కనిపిస్తే చాలు, సల్వా నవ్వడానికి సిద్ధం అయిపోయేది. 'సల్వా బేటా.. విమానం ఎందుకు వస్తుంది?'' అని అడుగుతాడు తండ్రి. ''మనల్ని నవ్వించడం కోసం'' అంటుంది కూతురు.

●●●

సల్వాకు ఏడాది వయసున్నప్పుడు ఇంటి బయట ఎవరో 'ఈద్'కి బాణాసంచా కాలుస్తుంటే ఆ పేలుడుకి, కళ్లు జిగేల్మనిపించే నిప్పురవ్వలకు భయపడి పెద్దగా ఏడ్చేసింది. అప్పుడే చెప్పాడు అబ్దుల్లా.. అవి పిల్లలు ఆడుకునే ఆటలని. వాటికి భయపడకూడదని. నవ్వాలని. బాంబుదాడుల గురించి ఇప్పుడూ అదే చెబుతున్నాడు. సల్వా నమ్ముతోంది. నవ్వుతోంది. ఒక్కోసారి.. దూరాన్నుంచి బాంబు శబ్దాన్ని తనే ముందు పసిగట్టి.. 'అబ్బాజాన్.. బాంబు పడబోతోంది, నవ్వడానికి సిద్ధంగా ఉండు' అని తండ్రికే చెబుతోంది! వెంటనే కూతుర్ని దగ్గరకు తీసుకుని నవ్వుతాడు. నిజమేమిటో తెలిసీ, నిజమేమిటో తెలియని కూతురితో కలిసి నవ్వుతాడు. వీళ్లిలా నవ్వుతున్నపుడు కుటుంబ సభ్యులు తీసిన వీడియో ఇప్పుడు ప్రపంచం గుండెను బరువెక్కిస్తోంది.

●●●

1997లో 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనే ఇటాలియన్ సినిమా వచ్చింది. కామెడీ డ్రామా. మూడు ఆస్కార్ అవార్డులు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీల చేతికి చిక్కిన ఒక యూదు కుటుంబంలోని తండ్రీ కొడుకుల కథ అది. నిర్బంధ శిబిరాలలో కళ్లముందు జరుగుతున్న ఘోరాలకు కొడుకు బెదిరిపోకుండా ఉండడం కోసం.. అదంతా ఊరికే నవ్వు తెప్పించడానికి చేస్తున్నారని కొడుకుని నమ్మిస్తాడు. చివరి సీన్‌లో ఆ చిన్నారి.. చాటుగా ఉండి చూస్తున్నప్పుడు.. నాజీ సైనికులు తన తండ్రిని గోడ చాటుకు తీసుకెళ్లడం కనిపిస్తుంది. తండ్రి వెనక్కి తిరిగి కొడుకువైపు చూసుకుంటూ వెళుతూ కన్ను కొడతాడు.. ఇదంతా ఆటలో భాగమే అన్నట్లు. తండ్రి అలా కనుమరుగు కాగానే తుపాకీ చప్పుళ్లు వినిపిస్తాయి. ప్రేక్షకులకు అర్థమౌతుంది. అతడిని చంపేశారని. కళ్లలోంచి నీళ్లు వస్తుండగా.. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనిపిస్తుంది మనకు.. అంత మంచి డైరెక్టర్ ఉన్నందుకు. ఇప్పుడూ అనిపించి తీరుతుంది. అబ్దుల్ అనే ఇంతమంచి తండ్రి ఉన్నందుకు. అయితే జీవితంలోని అందం మాత్రం.. చిన్నారుల అమాయకత్వంలోని నమ్మకమే.

అన్వేషణ

ఆకాశంలోని నక్షత్రాలు చిన్ని బుర్రల్లో మెరుపులు మెరిపిస్తాయి. రాగదీపికకు మాత్రం నక్షత్రాల వెలుగుల వెనుక దాగిన చీకట్లను ఛేదించాలనే కోరిక కలిగింది. డ్వార్ఫ్ గెలాక్సీలపై పరిశోధన చేస్తున్న ఈ తెలుగమ్మాయిది గుంటూరు జిల్లా తెనాలి.

గగన దీపిక

● నోబెల్ బహుమతి గ్రహీత బ్రియాన్ షెమిడ్ట్‌తో రాగదీపిక

పిల్లలకు ఒక్కొక్కరికి ఒక్కో ఇష్టం ఉంటుంది. రాగదీపికకు చదువుకోవడం ఇష్టం. అయితే ఆమెకు అంతరిక్షం అంటే ఇంకా ఇష్టమని ఆమె తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు తల్లిదండ్రులకు తెలిసింది. టెన్త్‌క్లాస్‌లో నారాయణ ఒలింపియాడ్‌లో సీట్ వచ్చింది. కానీ చేరలేదు. ఇంటర్‌కి ఢిల్లీలో అత్యంత సాధారణమైన కాలేజ్ సరస్వతి విద్యా మందిర్‌లో చేరింది. అప్పుడే 'ఢిల్లీ విద్యామందిర్ క్లాసెస్' అనే కోచింగ్ సెంటర్‌లో ట్యూషన్‌కు వెళ్లేది. అక్కడ ఒక సబ్జెక్టులో వారానికి నాలుగు క్లాసులు మాత్రమే ఉంటాయి. అలా ఏ మాత్రం ఒత్తిడి లేకుండా ఆడుతూ పాడుతూ ఇంటర్ పూర్తి చేసింది. ఇంటర్ తర్వాత 'నెస్ట్' రాసి విశ్వభారతి యూనివర్సిటీ, శాంతినికేతన్‌లో ఎమ్మెస్సీ ఫిజిక్స్ (ఫైవ్ ఇయర్స్ ఇంటిగ్రేటెడ్ కోర్సు)లో చేరింది. మనదేశంలో పిల్లలను పరిశోధన రంగంవైపు మళ్లించాలనే ఆలోచనతో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ పెట్టించిన కోర్సు ఇది. భువనేశ్వర్, శాంతి నికేతన్, బొంబాయిల్లో మాత్రమే ఈ కోర్సు ఉంది. అందులో దీపిక గోల్డ్ మెడల్ తెచ్చుకుంది.

మరో రెండు పరిశోధనలు

శాస్త్రవిజ్ఞానాన్ని వృత్తిగా స్వీకరించటానికి ప్రోత్సాహం కల్పించాలనేదే నా ఉద్దేశం. మరో రెండేళ్లలో నా పీహెచ్‌డీ పూర్తవుతుంది. తర్వాత ఇంకో రెండు పోస్ట్ డాక్టోరల్ పరిశోధనలు చేయాలనుకుంటున్నాను. పరిశోధనలు సాగిస్తూనే ప్రొఫెసర్‌గా పనిచేయాలనేది నా కోరిక. ఏదైనా సాధించి మంచి సైంటిస్టుగా చరిత్రలో నిలవాలనేది నా లక్ష్యం.

– రాగదీపిక, పీహెచ్‌డీ స్కాలర్

● విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ...

నక్షత్రాల వేట

2018 జనవరిలో అమెరికన్ ఆస్ట్రనామికల్ సొసైటీ సమావేశంలో పోస్టర్ ప్రెజంటేషన్, యూకేలోని డర్హామ్‌లో అంతర్జాతీయ సమావేశంలో 'ఫ్లాష్ టాక్' ఇచ్చింది రాగదీపిక. ప్రస్తుతం ట్యూసాన్‌లోని స్టూవర్డ్ అబ్జర్వేటరి, యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాలో 'డ్వార్ఫ్ గెలాక్సీస్–బ్లాక్ హోల్స్' అనే అంశంపై పరిశోధన చేస్తోంది. 'ఐసీ1613' అనే డ్వార్ఫ్ గెలాక్సీ చుట్టూ అతి పురాతనమైన నక్షత్రాలు ఉన్నాయని ఈ పరిశోధనలోనే రాగదీపిక కనిపెట్టింది.

● తల్లిదండ్రులు కనకదుర్గ, రాజగోపాల్‌తో

భూమ్మీదే ఆగిపోకూడదు

'మనకు బాగా తెలిసిన ఇంజినీరింగ్, మెడిసిన్ రంగాలే కాదు. ప్రపంచం చాలా విశాలమైంది. అంతరిక్షం అంతకంటే విశాలమైనది..' అని.. సెలవులకు ఇండియా వచ్చినప్పుడు ఇచ్చే ప్రసంగాలలో తరచు చెబుతుంటుంది రాగదీపిక. తెనాలి, విజయవాడలోని కొన్ని స్కూళ్లు, కాలేజీల వాళ్లు పిల్లలకు గెస్ట్ లెక్చర్ కోసం దీపికను ఆహ్వానిస్తుంటారు. ''మా నాన్నగారు ఖగోళశాస్త్రం పుస్తకాలు ఇష్టంగా చదివేవారు. దీపికకు తాతతో బాగా మాలిమి. ఆయన చదివే పుస్తకాలను చూస్తూ ఉండేది. దీపిక పదేళ్ల వయసులోనే మా నాన్నగారు పోయారు. కానీ ఈ రంగం మీద తనకు ఇష్టం కలగడానికి చిన్నప్పుడు పడిన తాతగారి ముద్రే కారణం అనిపిస్తుంది'' అన్నారు రాగదీపిక తల్లి కనకదుర్గ.

– బి.ఎల్.నారాయణ,
సాక్షి, తెనాలి

రాజేశ్వరి

అబ్దుల్లా కూతురు

● తల్లిదండ్రులతో వధూవరులు

కున్నరియమ్‌కు చెందిన శరవణన్ అనే రైతు కూలీ కూతురు రాజేశ్వరి. అబ్దుల్లా ఇంట్లో, అతని తోటలో పనిచేసేవాడు శరవణన్. దాంతో చిన్నప్పటినుంచీ రాజేశ్వరికీ అబ్దుల్లా కుటుంబంతో చనువుండేది. రాజేశ్వరి తల్లిలేని పిల్ల. తండ్రితో రోజూ అబ్దుల్లా వాళ్లింటికి రావడం.. అక్కడే అతని పిల్లలతో ఆడుకోవడం చేస్తూండేది. ఈ క్రమంలో శరవణన్ కూడా అనారోగ్యం బారినపడి.. కన్నుమూశాడు. అప్పటికి రాజేశ్వరి వయసు ఏడేళ్లు. అనాథ అయిన ఆ అమ్మాయిని అబ్దుల్లా కుటుంబం అక్కున చేర్చుకుంది. తమ ముగ్గురు కొడుకులతోపాటు రాజేశ్వరినీ పెంచింది.

ఇప్పుడు రాజేశ్వరికి ఇరవై రెండేళ్లు. ఆ ఊరికే చెందిన విష్ణు అనే అబ్బాయి రాజేశ్వరిని ఇష్టపడ్డాడు. ఈ విషయం అబ్దుల్లా వాళ్లింట్లో తెలిసి పెళ్లి విషయం మాట్లాడ్డానికి అబ్బాయి వాళ్లింటికి వెళ్లాడు అబ్దుల్లా తన భార్యను తీసుకొని. ఆ ఇంటి వియ్యం అందుకోడానికి విష్ణు తల్లిదండ్రులు జయంతి, బాలచంద్రన్ సంతోషంగా ఒప్పుకున్నారు. కాని పెళ్లి గుడిలోనే జరగాలనే ఒక షరతుతో. 'దానికేముంది తప్పకుండా' అని వియ్యాల వారి కోరికను మన్నించారు అబ్దుల్లా అండ్ ఫ్యామిలీ. ఈ రెండు కుటుంబాలు కలిసి.. అన్ని మతాల వారికి ఆహ్వానం ఉండే గుడి కోసం వెదికి.. చివరకు కసరగాడ్ లోని మన్యాట్టు దేవాలయాన్ని ఓకే చేసుకున్నారు. ఆ గుడిలో అన్ని మతాల వారికి ప్రవేశం ఉంటుంది. పెళ్లిరోజు అమ్మాయి వాళ్లకన్నా ముందే అబ్బాయి వాళ్లు ఆ గుడికి చేరుకుని.. పెళ్లి కూతురి తరపు వాళ్లకు స్వాగతం పలికారు. ఆలయం లోపల.. వేడుక జరిగే చోట .. కాస్త దూరంగా నిలబడి చూస్తున్న అబ్దుల్లా కుటుంబాన్ని చేయిపట్టుకొని మరీ తీసుకొచ్చి అమ్మాయి పక్కన నిలబెట్టారు విష్ణు తల్లిదండ్రులు. ఈ పెళ్లికి అబ్దుల్లా తల్లి .. 84 ఏళ్ల సఫియుమ్మతో సహా అబ్దుల్లా బంధువులంతా హాజరయ్యారు. ఇదీ రాజేశ్వరీ పరిణయకథ.

ఇటీవలే మసీదులో ఒక హిందూ జంట పెళ్లి జరిపించి లౌకిక తత్వాన్ని చాటుకుంది కేరళ. ఇప్పుడు మళ్లీ అలాంటి వేడుకతో మానవత్వానికీ ప్రతీకగా నిలిచింది. కేరళలోని కున్నరియమ్ పట్టణానికి చెందిన అబ్దుల్లా కుటుంబం రాజేశ్వరి అనే హిందూ అమ్మాయికి విష్ణు అనే అబ్బాయితో గుడిలో పెళ్లి జరిపించింది.

విజయనిర్మల నా భార్య కావడం నా అదృష్టం

- కృష్ణ

''విజయనిర్మల ఐదారు సినిమాల్లో నటించాక డైరెక్ట్ చేస్తానంది.. వంద సినిమాల్లో నటించి, ఆ తర్వాత డైరెక్ట్ చేస్తే బాగుంటుందన్నాను. ఆమె అలానే చేసింది'' అని నటుడు కృష్ణ అన్నారు. గురువారం నటి, దర్శక-నిర్మాత విజయనిర్మల 74వ జయంతి సందర్భంగా నానక్‌రామ్‌గూడలోని కృష్ణ- విజయనిర్మల నివాసంలో ఏర్పాటు చేసిన విజయనిర్మల కాంస్య విగ్రహాన్ని కృష్ణ ఆవిష్కరించారు. తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాళులు అర్పించారు. విజయ నిర్మల స్త్రీ శక్తి పురస్కారాన్ని డైరెక్టర్ నందినీరెడ్డికి నటుడు కృష్ణంరాజు, హీరో మహేష్‌బాబు అందించారు. కృష్ణ మాట్లాడుతూ- ''విజయ నిర్మల దర్శకత్వం వహించిన మొదటి మలయాళ సినిమా 'కవిత' అద్భుతమైన విజయం సాధించింది. ఆ తర్వాత తెలుగులో తీసిన 'మీనా' వందరోజులు ఆడింది. మొత్తం 46 సినిమాలకు దర్శకత్వం వహిస్తే అందులో 95 శాతం హిట్ సినిమాలే. అంత గొప్ప దర్శకురాలు నా భార్య కావడం నా అదృష్టం'' అన్నారు. **కృష్ణంరాజు మాట్లాడుతూ-** ''విజయ నిర్మల విజయాల్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని అటువంటి విజయాల్ని సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''విజయ నిర్మల గారు 50 సినిమాలకి దర్శకత్వం వహించడం ఓ చరిత్ర'' అన్నారు పరుచూరి గోపాలకృష్ణ.

మహేష్ బాబు మాట్లాడుతూ- ''నా సినిమాల మొదటి ఆట చూసి నాన్నగారు నాతో మాట్లాడేవారు. తర్వాత విజయనిర్మలగారు మాట్లాడి అభినందనలు చెప్పేవారు. 'సరిలేరు నీకెవ్వరు' విడుదల తర్వాత నాన్నగారు అభినందించారు.. తర్వాత ఆవిడ మాట్లాడబోతుందనుకుని వెంటనే 'ఆమె లేరు కదా' అనే విషయాన్ని రియలైజ్ అయ్యాను. ఆ రోజు ఆ లోటు కనిపించింది'' అన్నారు. ''మా అమ్మ పేరున నటీనటులకు ప్రతి సంవత్సరం అవార్డు అందించనున్నాం'' అన్నారు నరేష్ విజయకృష్ణ.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

● మహేష్‌బాబు, కృష్ణ, నరేష్, కృష్ణంరాజు

రాజకీయ చదరంగం

శ్రీకాంత్, సునైన్, నాగినీడు, కౌసల్య ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'చదరంగం'. రాజ్ దర్శకత్వంలో మంచు విష్ణు నిర్మించిన ఈ వెబ్ సిరీస్ గురువారం నుంచి జీ5లో ప్రసారమవుతోంది. విష్ణు మాట్లాడుతూ- ''ఎన్టీఆర్‌గారి రాజకీయ ప్రస్థానంలో జరిగిన చిన్న సంఘటన తీసుకుని ఇప్పటి సందర్భానికి లింక్ చేస్తూ చేసిన చిత్రమిది. ఈ సినిమా చేస్తానన్నప్పుడు.. జాగ్రత్తగా తీయాలి, వాస్తవాలను చూపించు అన్నారు నాన్నగారు (మోహన్‌బాబు). రాజీ పడకుండా తీశాం. భవిష్యత్ మొత్తం డిజిటల్‌దే'' అన్నారు. ''ఈ సినిమాలో నా పాత్ర కూడా ఉంటుంది'' అన్నారు రచయిత పరుచూరి గోపాలకృష్ణ. ''ఈ కథ వినగానే విష్ణు ఒప్పుకున్నారు. మొదట శ్రీకాంత్ కొంచెం ఆలోచించినా, విష్ణు కన్విన్స్ చేయడంతో ఒప్పుకున్నారు. ఆయన బాగా నటించారు'' అన్నారు రాజ్.

● మంచు విష్ణు, పరుచూరి గోపాలకృష్ణ

● కమల్‌హాసన్

● కాజల్ అగర్వాల్

షాక్ అయ్యాం

బుధవారం రాత్రి చెన్నైలో 'ఇండియన్ 2' సెట్లో ఘోర ప్రమాదం జరిగింది. చిత్రీకరణ కోసం ఏర్పాటు చేసిన భారీ క్రేన్ కూలిపోవడంతో ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. ఆ క్రేన్ కూలిన చుట్టుపక్కలే కమల్ హాసన్, కాజల్ అగర్వాల్ తదితర తారాగణం ఉన్నారట. మరోవైపు దర్శకుడు శంకర్ తన టీమ్‌తో మానిటర్‌లో షాట్ చెక్ చేసుకుంటున్నారట. శంకర్ కాలికి గాయం అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటన గురించి కమల్ స్పందిస్తూ- ''నేను చాలా ప్రమాదాలను చూశాను కానీ ఇది చాలా తీవ్రమైనది. చనిపోయిన వారి కుటుంబ సభ్యుల బాధను వర్ణించలేం'' అన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయిల విరాళం ప్రకటించారాయన.

''ఈ ఘటనకు చాలా షాక్ అయ్యాను. ఇంకా తేరుకోలేకపోతున్నా. అంతా క్షణికంలో జరిగిపోయింది. ఆ ప్రమాదంలో ఏమీ జరగకుండా సురక్షితంగా ఉండి, ఈ ట్వీట్ చేస్తున్నందుకు దేవుడికి కృతజ్ఞురాలిని. ఈ ఘటనతో జీవితం విలువ, సమయం విలువ అర్థం అయింది. ఈ ప్రమాదంలో చనిపోయినవారి ఆత్మలకు శాంతి చేకూరాలనుకుంటున్నా'' అని ట్వీట్ చేశారు కాజల్.

సల్మాన్‌తో మైత్రి

'శ్రీమంతుడు, జనతా గ్యారేజ్, రంగస్థలం' వంటి చిత్రాలతో ఆరంభంలోనే వరుస బ్లాక్‌బస్టర్ హిట్స్ అందుకున్న బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్. ప్రస్తుతం తెలుగులో వరుస సినిమాలు నిర్మిస్తూ బిజీగా ఉన్నారు ఈ సంస్థ అధినేతలు వై. రవిశంకర్, నవీన్ యర్నేని. ఈ నిర్మాణ సంస్థ బాలీవుడ్‌లో తొలి అడుగు వేయనుంది. సల్మాన్ ఖాన్ హీరోగా ఓ సినిమా నిర్మించడానికి ప్లాన్ చేసింది మైత్రీ మూవీ మేకర్స్. సల్మాన్‌తో చర్చలు కూడా పూర్తయ్యాయి. 2022లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

● సల్మాన్ ఖాన్

ప్రతి సినిమా పరీక్షే

''నా మొదటి సినిమా 'ఛలో' విడుదలయ్యాక, నేను రాసింది నాకే కాదు ఆడియన్స్‌ని కూడా నవ్విస్తుందనే నమ్మకం వచ్చింది. మొదటి సినిమాలానే రెండో సినిమాకి కూడా అదే భయం, నిజాయతీతో పని చేశాను. ప్రతి సినిమా పరీక్షలానే భావించి పని చేస్తాను'' అన్నారు దర్శకుడు వెంకీ కుడుముల. ఆయన దర్శకత్వంలో నితిన్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'భీష్మ'. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఇవాళ విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ - ''ఛలో' సినిమా పూర్తయిన తర్వాత నితిన్‌గారితో సినిమా చేయాలనే కమిట్‌మెంట్ ఉంది. పూర్తి స్క్రిప్ట్ రెడీ అయ్యాకే షూటింగ్ చేద్దాం అని నితిన్‌గారు చెప్పారు. కొంచెం లేట్ అయినా అలానే చేశాం. బౌండ్ స్క్రిప్ట్ వల్ల చిత్రీకరణ సులువుగా జరిగిపోయింది. ఈ సినిమాలో ఇద్దరు భీష్ములు ఉంటారు. ఒకరేమో అనంత్ నాగ్‌గారు. ఆయన ఒక లక్ష్యం కోసం పెళ్లి చేసుకోకుండా ఉంటారు. మరోవైపు నితిన్ పేమించాలనుకున్నా ఎవ్వరూ పడరు. ఆయన పేరు (భీష్మ) వల్లే ఇలా జరుగుతుందని బాధపడుతుంటారు. ఈ ఇద్దరి భీష్ముల మధ్య సంబంధం ఏంటి? అనేది సినిమాలో చూడాలి. తదుపరి సినిమా ఇంకా నిర్ణయించుకోలేదు. మైత్రీ మూవీ మేకర్స్, యూవీ క్రియేషన్స్ బ్యానర్లకు కమిట్‌మెంట్స్ ఉన్నాయి'' అన్నారు.

● వెంకీ కుడుముల

సమాజానికి ఉపయోగపడే సినిమా

- మంగ్లీ

''పక్షులకు దేవుడు రెక్కలిచ్చింది అవి స్వేచ్ఛగా ఎగరాలని.. వాటిని పంజరంలో పెట్టకూడదు. ఆడపిల్లలకూ అలాంటి స్వేచ్ఛనివ్వాలి. పురుషులకు సమానంగా ఆడపిల్లలను కూడా చదివిస్తే వారు ఏ రంగంలో అయినా రాణిస్తారు'' అన్నారు గాయని, నటి మంగ్లీ. కెపీఎన్ చౌహాన్ దర్శకత్వంలో మంగ్లీ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'స్వేచ్ఛ'. రాజు నాయక్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రదర్శించారు. మంగ్లీ మాట్లాడుతూ- ''మా బంజారా కులంలో జరిగే కథాంశంతో స్ఫూర్తినిచ్చే సినిమా తీశారు చౌహాన్. సమాజానికి ఎంతో ఉపయోగపడే చిత్రమిది. సినిమాలో ఒక అమ్మాయిని వాళ్ల నాన్న అమ్మేస్తాడు.. ఆమె బాగా చదువుకుని వచ్చి ఆ ఊరిని బాగు చేస్తుంది. మా సినిమాని అందరూ ఆదరించాలి'' అన్నారు. ''గోర్ జీవన్' పేరుతో బంజారా భాషలో విడుదలైన ఈ సినిమా మంచి విజయం సాధించింది.. దీంతో తెలుగులో విడుదల చేస్తున్నాం'' అన్నారు రాజు నాయక్. ''గోర్ జీవన్' అనే సినిమా బంజారా బాహుబలి. బంజారా భాషలో ఇంత పెద్ద సినిమా లేదు. మహిళలు, వారి స్వేచ్ఛ గురించి తీసిన ఈ చిత్రాన్ని ఆదరించాలి'' అన్నారు సంగీత దర్శకుడు బోలే.

● రాజు నాయక్, మంగ్లీ, బోలే

● టబు

రా రా సరసకు రారా!

'రారా సరసకు రారా...' పాట సౌత్ ఇండస్ట్రీల్లో సూపర్ పాపులర్. 'చంద్రముఖి'లోని ఈ పాటను, పాటలో జ్యోతిక గెటప్‌ను, ఆమె అభినయాన్ని ఎవరూ మర్చిపోలేరు. మలయాళ చిత్రం 'మణిచిత్ర తాళ్' ఆధారంగా కన్నడంలో 'ఆప్తమిత్రన్', తెలుగు/తమిళంలో 'చంద్రముఖి', హిందీలో 'భూల్ బులేయ్యా', బెంగాలీలో 'రాజ్ మొహోల్' సినిమాలు రూపొందాయి. హిందీ రీమేక్‌లో 'రారా సరసకు రారా ('మేరే డోల్‌నా సున్') పాటలో విద్యా బాలన్ నర్తించారు. ఇప్పుడు 'భూల్ బులేయ్యా' సీక్వెల్ 'భూల్ బులేయ్యా 2'లో ఆ పాట రీమిక్స్‌లో డ్యాన్స్ చేయనున్నారు టబు. దెయ్యం పట్టిన డ్యాన్సర్ గెటప్‌లో 'రారా సరసకు రారా' అని పాడనున్నారట. కార్తీక్ ఆర్యన్, కియారా అద్వానీ, టబు ముఖ్య తారలుగా అనీజ్ బజ్మీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం జూలై 31న విడుదల కానుంది.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 21-2-2020

లాక్మే స్పైసీ స్టయిల్

స్పైసెస్ అంటే సుగంధద్రవ్యాలు. వంటల్లో వాడే గరం మసాలా దినుసులు. ఇదే థీమ్‌ని డ్రెస్ డిజైనింగ్‌లో చూపిస్తే... అవి లాక్మే వేదికపైన విరిసిన అందమైన డిజైన్లు అవుతాయి.

చేనేతలతో అందమైన డ్రెస్ డిజైన్లను రూపొందించడంలో మేటిగా పేరొందిన ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా. ఈ ఏడాది లాక్మే ఫ్యాషన్ వీక్‌లో 46 రకాల డిజైనర్ దుస్తులను మోడల్స్ ధరించి ర్యాంప్ వాక్ చేశారు. కిందటేడాది ఖాదీ చీరల ప్రత్యేకతను ఎంచుకున్న గౌరంగ్ ఈ ఏడాది 'సంప్రదాయ చేనేతలలో సమకాలీన మహిళ ఎలా ఉంటుందో ఈ కలెక్షన్ ద్వారా చూపించాలనుకున్నారు. 'గరం మసాలా' పేరుతో చేసిన ఈ ప్రదర్శనలో విలక్షణమైన డిజైన్లకు స్పైసీ లుక్స్‌ని జోడించారు. ఈ డిజైన్స్‌కి భారతీయ సుగంధ ద్రవ్యాల నుండి ప్రేరణ పొందారు. కారంగా ఉండే జాజికాయ, బంగారు రంగు ఆవాలు, కుంకుమ పువ్వు, వెచ్చని దాల్చిన చెక్క వరకు.. వంటశాలలో ఆహారపదార్థాలకు రుచిని పెంచే ఫ్లేవర్ కలర్స్ ఇవి. అదే థీమ్‌తో ఈ కలెక్షన్‌ను సమకాలీన భారతీయ మహిళకు వన్నె తెస్తుందన్నారు' గౌరంగ్.

నిర్వహణ
నిర్మలారెడ్డి

ఫ్యాషన్

గౌరంగ్ షా
ఫ్యాషన్ డిజైనర్

'భారత దేశ సంప్రదాయ శైలులను ప్రదర్శించడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఈ డిజైన్స్ సృష్టించడానికి 6 నెలల సమయం పట్టింది. స్వచ్ఛత, అందం, దయ, దైవత్వం.. మొదలైన వాటితో మహిళల జీవితాన్ని హైలైట్ చేయడానికి ఈ చీరలు, అనార్కలీలు, కుర్తాలు, లెహంగాల శ్రేణి చూపుతుంది. తమిళనాడు కంచి, ఉత్తర ప్రదేశ్ బెనారస్, గుజరాత్ పటాన్, రాజస్థాన్ కోటా, తెలంగాణ పుట్టపాక, ఉప్పాడ, ఆంధ్ర ప్రదేశ్ ఖాదీ, మహారాష్ట్ర పైథానీ, కాశ్మీర్ కని.. ఇలా ఈ చేనేతలను మా కలెక్షన్‌లో ఉపయోగించాం' అని తెలిపారు డిజైనర్ గౌరంగ్ షా. లాక్మే ఫ్యాషన్ వేదికపైన ఈ డిజైనర్ రూపొందించిన కంజీవరం లెహంగా మీదకు పటాన్ చీరను దుపట్టాగా అలంకరించిన బాలీవుడ్ నటి టబు ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

సందర్భం

మారిషస్ మహా పండుగ శివరాత్రి...

పచ్చని చెరుకు పొలాలు, వెండి జలపాతాలు, పగడపు దిబ్బలు, కట్టిపడేసే సూర్యోదయాలు, ఎగిరే డాల్ఫిన్లు, గోల్ఫ్ కోర్సులు, బీచ్‌లు, దూరంగా కనిపించే సముద్రపు సొరచేపలు, దీవిని చుట్టిన తెల్లని ఇసుక తీరం, స్కూబా డైవింగ్, హనీమూన్ జంటలు, సినిమా షూటింగ్‌లు, భోజన ప్రియుల కోసం దీవి చుట్టూ స్వాగతం పలికే ఇండియన్ రెస్టారెంట్లు... మారిషస్ అంటే ఎన్నో ఎన్నో..

ప్రపంచంలో 27 వ అతి చిన్న దేశం అయినా బహు భాషల, బహు సంస్కృతులకు నిలయం మారిషస్. తొమ్మిది జిల్లాలు, ఐదు భాషలు (ఇంగ్లిష్ , క్రియోల్, ఫ్రెంచ్, హిందీ, తమిళం) ఇక్కడ వారి సొంతం. ఇవన్నీ అలా ఉంచితే దేశమంతా పవిత్రంగా భావించే రోజు మహాశివరాత్రి. ఆఫ్రికా ఆగ్నేయ తీరంలో ఉన్న ఈ చిన్న ద్వీపంలో మహాశివుడు ఎలా వెలిశాడు.. మహాశివరాత్రి ఎందుకు ఇక్కడ అంత ప్రాచుర్యం సంతరించుకుంది అంటే..

మహా శివుడంటే ఎనలేని భక్తి..

శివరాత్రికి ఇక్కడ జాతీయ సెలవుదినం. మారిషస్ హిందువులకు చాలా పవిత్రమైన రోజు. మహాశివరాత్రిని గ్రాండ్ బాసిన్‌లోని సరస్సు వద్ద విశేషంగా జరుపుకుంటారు. ఈ సరస్సునే గంగా తలావ్ అని కూడా పిలుస్తారు. శివరాత్రి సమయంలో దాదాపు 6 లక్షల మంది ఈ సరస్సుకు యాత్రగా వెళతారు. ఢోలక్ లాంటి వాయిద్యాలను వాయిస్తూ, కాలినడక, వాహనాల ద్వారా సరస్సుకి చేరుకుంటారు. అక్కడ శివుడిని అర్చించి, సరస్సులోని నీటిని ఇంటికి తీసుకుని వెళతారు. శివరాత్రికి ఉపవాసం ఉండి మరుసటి ఉదయం ఖర్జూరం, వాల్‌నట్స్, స్వీట్ పోటాటోస్‌తో ఉపవాస దీక్షను వదులుతారు. భక్తులకు దారి పొడుగునా అల్పాహారం, పానీయాలను స్వచ్ఛందంగా అందిస్తారు.

గంగా సరస్సు

గంగా తలావ్

గంగా తలావ్ అంటే 'గంగా సరస్సు' అని అర్థం. మన గంగానది సూచకంగా ఈ ప్రాంతాన్ని భావిస్తారు. మారిషస్ నడిబొడ్డున లోతైన సావన్నే జిల్లాలో ఏకాంత పర్వత ప్రాంతంలో ఉన్న సరస్సు. ఇది సముద్ర మట్టానికి 1800 అడుగుల ఎత్తులో ఉంది. మారిషస్‌లో ఇది అత్యంత పవిత్రమైన హిందూ ప్రదేశంగా పరిగణిస్తారు. సరస్సు ఒడ్డున శివ మందిరం ఉంది. గ్రాండ్ బాసిన్ వెంట హనుమంతుడు, గంగాదేవి, గణేష్‌లతో సహా ఇతర దేవాలయాలు ఉన్నాయి.

అనేక కథలు

ఈ సరస్సు గురించి స్థానికంగా అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. శివుడి ఝుట నుంచి రాలిన ఒక నీటి బిందువు ఈ సరస్సుగా మారిందని ఒక కథ. ఇక్కడ సరస్సు ఉందని ట్రియోలెట్ గ్రామానికి చెందిన పూజారికి కల రావటం, అక్కడ నిజంగానే సరస్సు ఉండటంతో ప్రజల్లో విపరీతమైన భక్తి, విశ్వాసాలు ఏర్పడ్డాయి.

ప్రవేశద్వారం వద్ద శివుడి విగ్రహం

గంగా తలావోకు వెళ్ళిన మొదటి యాత్రికుల బృందం ట్రియోలెట్ గ్రామానికి చెందినది. దీనికి 1898 లో టెర్రె రూజ్ నుండి పండిట్ గిరి గోస్సేన్ నాయకత్వం వహించారు. 1866 లో పాండి సంజి బోన్లాల్ రీయూనియన్ ద్వీపం ద్వారా వ్యాపారిగా వచ్చారు. ట్రియోలెట్ వద్ద మిస్టర్ లాంగ్లోయిస్ భవనాన్ని కొనుగోలు చేసి, గ్రాండ్ బాసిన్‌ను తీర్థయాత్రగా మార్చటానికి కృషి చేశారు. ఆయన కొన్న భవనాన్ని ఆలయంగా మార్చాడు. పోర్ట్ లూయిస్‌లోని సోకలింగం మీనాట్చీ అమ్మెన్ కోవిల్ నిర్మిస్తున్న కొందరు ఆలయానికి ప్రస్తుత ఆకృతిని ఇవ్వడంలో సహాయపడ్డారు. తర్వాత ఆయన భారత దేశానికి వెళ్లి, భారీ శివలింగాన్ని తీసుకువచ్చి గుడిలో ప్రతిష్టించారు. ముందు ఈ సరస్సును 'పరి తలావ్' అని పిలిచేవారు. 1998 లో దీనిని 'పవిత్ర సరస్సు'గా ప్రకటించారు. 1972లో ప్రధాని రామ్ గూలం గోముఖ్ భారతదేశంలోని గంగానది నుంచి నీటిని తీసుకువచ్చి, గ్రాండ్ బాసిన్ నీటితో కలిపి గంగా తలావ్ అని పేరు పెట్టారు.

సరస్సు, ఆలయ ప్రాంగణం

గంగా తలావ్ ప్రవేశద్వారం వద్ద త్రిశూలంతో నిలబడి ఉన్న శివుడి విగ్రహం ఉంటుంది. మంగల్ మహాదేవ్‌గా పిలిచే ఈ విగ్రహం 33 మీ (108 అడుగులు) ఎత్తు ఉంటుంది. 2007 లో ప్రతిష్టించిన ఈ విగ్రహం గుజరాత్ వడోదరలోని సుర్సాగర్ సరస్సులో ఉన్న శివవిగ్రహం నమూనా. శివుడితో పాటు ఇక్కడ అనేక దేవీదేవతల విగ్రహాలున్నాయి.

శివరాత్రి రోజున దేశమంతా ఒక్కచోటికి వచ్చి, ఏకాగ్రతతో శివుడి భక్తిలో లయం అయినట్లు అనిపిస్తుంది. యువత ఈ పండుగ సమయంలో అందించే సేవల గురించి విశేషమైనవి.

– మహేశ్ విశ్వనాథ, ట్రావెలర్

ఆహారం

మిన్న.. జొన్న

ఇటీవల రాత్రిపూట చాలామంది రోటీలు తింటుండటం చూస్తూనే ఉన్నాం. మరి కొందరు గోధుమరొట్టెలకు బదులు కాస్తంత మార్పు అంటూ జొన్నరొట్టెలు తింటున్నారు. తక్కువ వర్షపాతంలో కూడా జొన్నలు తేలిగ్గా పండుతాయి. కాబట్టి వర్షపాతం అంతగా లేనిచోట కూడా జొన్నలను విస్తృతంగా సాగుచేస్తుంటారు. అందుకే చాలా సంస్కృతుల్లో జొన్నన్నం, జొన్నరొట్టెలూ నిత్య ఆహారంగా ఉన్నాయి. మనం రెండు మూడు తరాల కిందవరి ఆహారానికి మారకముందు జొన్న అన్నం, జొన్నరొట్టెలు తినడమే పరిపాటి.

జొన్నల్లో ప్రోటీన్లు ఎక్కువే. అందుకే జొన్నరొట్టెల్ని బలవర్ధక ఆహారంగా పరిగణిస్తుంటారు. వీటిల్లో ఐరన్, క్యాల్షియమ్, పొటాషియమ్, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఎక్కువ. థయామిన్, రైబోఫ్లేవిన్ వంటి బీకాంప్లెక్స్‌కు సంబంధించిన విటమిన్లు ఎక్కువ. జొన్నల్లో ఉండే ఫీనాలిక్ యాసిడ్స్, ట్యానిన్స్, యాంథోసయనిన్ వంటి పోషకాలు అనేక రకాల క్యాన్సర్లను నివారిస్తాయి.

అన్నిటికంటే ప్రధానమైన అంశం... జొన్నలు తినే వారికి స్థూలకాయం వచ్చే అవకాశాలు దాదాపు లేనట్టే. అందువల్ల ఊబకాయం (ఒబేసిటీ) ద్వారా వచ్చే ఎన్నో అనర్థాలను నివారించినట్లు అవుతుంది. గుండె ఆరోగ్యానికీ జొన్న ఎంతో మేలు చేస్తుంది.

ఇందులోని పీచుపదార్థాలు జీర్ణవ్యవస్థకు వచ్చే ఎన్నోరకాల సమస్యలను నివారిస్తాయి. మలబద్ధకం సమస్యను స్వాభావికంగా అధిగమించవచ్చు. యాంటీ ఆక్సిడెంట్స్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల చాలాకాలం పాటు యౌవనంగా కనిపించడం సాధ్యమవుతుంది. గ్లూటెన్ కారణంగా గోధుమ వల్ల అలర్జీ ఉన్నవారికి ఇది ఒక ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం.

ఆభరణం

వెస్ట్రన్ డ్రెస్‌కి ఇండియన్ హారం

స్కర్ట్, క్రాప్‌టాప్స్, ఫ్రాక్స్, లాంగ్ గౌన్స్ ఇలాంటి పాశ్చాత్య దుస్తులు ధరించినప్పుడు అలాంటి ఫ్యాషన్ జ్యువెలరీ ధరిస్తేనే బాగుంటుంది, సంప్రదాయ ఆభరణాలు అస్సలు నప్పవు అనుకుంటారు. కానీ, వెస్ట్రన్ దుస్తులకు మీదకు ఇప్పుడు మన వెడ్డింగ్ జ్యువెలరీనీ మ్యాచ్ చేయవచ్చు.

బ్లాక్ థండర్

వెస్ట్రన్ కాక్‌టెయిల్ పార్టీలకు, ఈవెనింగ్ క్యాజువల్ డ్రెస్‌గా పేరొందింది నల్లటి మ్యాక్సీ డ్రెస్. దీనికి మన వివాహ వేడుకల సమయంలో ధరించే కుందన్ నెక్లెస్, చెవి లోలాకులు అద్భుతమైన కాంబినేషన్‌గా అదరగొట్టేస్తాయి. గౌన్ 'వి' నెక్‌లో ఉంటే దానికి రాణి హారం వేసి, పైన కుందన్ నెక్లెస్ ధరించవచ్చు. అంతేకాదు వివాహ వేడుకల సమయంలో ధరించే మీనకారి చెవి జూకాలు కూడా ఈ వెస్ట్రన్ డ్రెస్ మీదకు బాగా నప్పుతాయి.

వైట్ వండర్

వెస్ట్రన్ పార్టీలలో నలుపు ఎలాగో తెలుపు డ్రెస్ కూడా అంత అద్భుతమైన అందంతో తళుక్కుమంటుంది. తెల్లటి డ్రెస్ వేసుకుంటే దానిమీదకు పోల్కి నెక్లెస్, పెద్ద పెద్ద బంగారు గాజులు వేసుకుంటే ఇండోవెస్ట్రన్ కలయికతో అద్భుతమైన లుక్‌ని తీసుకురావచ్చు. సంప్రదాయ లెహంగా చోలీ డ్రెస్సుల మీదకు ఉపయోగించే ఆక్సిడైజ్డ్ సిల్వర్ గాజులు, నెక్లెస్, జూకాలు, నెక్లెస్ వంటివి జీన్స్-వైట్ షర్ట్ మీదకు మాక్సీ డ్రెస్సుల మీదకు సరైన ఎంపిక అవుతుంది.

చేతికి అందం హాత్‌ఫూల్

షర్ట్ మీదకు పచి వర్క్ హారం

ఫ్రాక్‌కి జూకాలు

హాత్‌ఫూల్

వివాహవేడుకల్లో వేళ్లను-మణికట్టును కలుపుతూ ఉండే హాత్‌ఫూల్ ఆభరణం పాశ్చాత్య దుస్తులకు భిన్నమైన లుక్ తీసుకువస్తుంది. డిన్నర్ పార్టీకి పొడవాటి చేతులున్న టాప్స్, స్ట్రాప్స్ బ్లౌజ్‌లు ధరించినప్పుడు హాత్‌ఫూల్‌ను అందంగా అలంకరించుకోవచ్చు.

వరసల హారాలు

వివాహ వేడుకల కోసం బంగారు హారాలు తీసుకుంటారు. ఇవి మళ్లీ సంప్రదాయ చీర, లెహంగాల మీదకే బాగుంటాయనుకుంటే పొరపాటు. టర్టిల్ నెక్, కాలర్ షర్ట్స్, డీప్ నెక్ టాప్స్ ధరించినప్పుడు ఒకటికి మూడు వరసలు ఉన్నవి, పచి వర్క్ హారలు కూడా ధరించవచ్చు,

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్వర్థయా వర్ధతే విద్య
శుక్రవారం
21-2-2020

» ఏప్రిల్ 5, 7, 8, 9, 11 తేదీల్లో జేఈఈ మెయిన్-2020 (ఏప్రిల్)
» ఆన్‌లైన్ విధానంలో జరుగనున్న పరీక్ష
» దరఖాస్తులకు చివరి తేది: మార్చి 06, 2020

జేఈఈ మెయిన్-2020 (ఏప్రిల్)

జాతీయస్థాయిలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, సీఎఫ్‌టీఐల్లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాలనుకునే ఇంటర్ విద్యార్థుల కోసం జేఈఈ-మెయిన్ 2020(ఏప్రిల్) షెడ్యూల్ విడుదలైంది. ఒకవైపు ఇంటర్ బోర్డు పరీక్షలు, మరోవైపు జేఈఈ-మెయిన్ పరీక్షలు.. ఈతరుణంలో విద్యార్థులు ఎంతో ఒత్తిడికి లోనవుతుంటారు. జనవరిలో మొదటిసారి పరీక్షలు రాసిన అభ్యర్థులే కాకుండా.. కొత్తగా ఏప్రిల్‌లో పరీక్షలకు సిద్ధమయ్యే వారి సంఖ్య కూడా లక్షల్లోనే ఉంది. ఈ నేపథ్యంలో.. జేఈఈ మెయిన్ తీరుతెన్నులు.. పరీక్ష విధానం.. సిలబస్ వివరాలు.. ప్రిపరేషన్ ప్రణాళిక గురించి తెలుసుకుందాం..

జేఈఈ.. జయం ఇలా..!

జేఈఈ-మెయిన్

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, సీఎఫ్‌టీఐల్లో ఇంజనీరింగ్ సీటు సాధించాలంటే.. జేఈఈ మెయిన్ స్కోర్ తప్పనిసరి. ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు జనవరి, ఏప్రిల్‌ల్లో జేఈఈ మెయిన్ పరీక్ష జరుగుతుంది. రెండుసార్లు పరీక్ష రాసిన అభ్యర్థులకు సంబంధించి ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. మెయిన్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులకు జేఈఈ అడ్వాన్స్ రాసే అవకాశం లభిస్తుంది. అడ్వాన్స్‌డ్‌లో మంచి స్కోర్ ద్వారా ఐఐటీల్లో ప్రవేశం పొందొచ్చు. జేఈఈ మొదటి విడత పరీక్షను జనవరిలో నిర్వహించారు. వాటి ఫలితాలు కూడా వెలువడ్డాయి. ప్రస్తుతం రెండోసారి ఏప్రిల్‌లో పరీక్షకు సంబంధించి ఎన్‌టీఏ షెడ్యూల్‌ను ఖారారు చేసింది. జేఈఈ మెయిన్ జనవరిలో పరీక్ష రాసిన అభ్యర్థులు మళ్లీ ఏప్రిల్ పరీక్షకు హాజరుకావచ్చు. జనవరిలో పరీక్షకు హాజరుకాని అభ్యర్థులు కూడా ఏప్రిల్‌లో పరీక్ష రాయొచ్చు.

అర్హతలు

» జేఈఈ మెయిన్‌కి దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యను2018, 2019లో పూర్తిచేసి ఉండాలి.
» 2020లో ఇంటర్ ఫైనల్ పరీక్షలు రాయబోయే వారు కూడా దరఖాస్తుకు అర్హులే.

సిలబస్‌పై దృష్టి

బీఈ/బీటెక్

- **ఫిజిక్స్:** ఇందులో ముఖ్యంగా మోషన్ ఇన్ టూ డైమెన్షన్ అండ్ ప్రొజెక్టైల్ మోషన్, సెంటర్ ఆఫ్ మాస్ అండ్ కొలిజన్, రొటేషనల్ మోషన్, గ్రావిటేషన్, లాస్ ఆఫ్ థర్మోడైనమిక్స్, టోటల్ ఎలక్ట్రిసిటీ, రే ఆప్టిక్స్, మోడర్న్ ఫిజిక్స్ అండ్ సెమీకండక్టర్ డివైజెస్‌పై ఎక్కువ దృష్టిపెట్టాలి. గతంతో పోలిస్తే జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు సంబంధించి అడిగే ప్రశ్నల తీరులో మార్పు కనిపిస్తోంది. ఫిజిక్స్ కష్టమనే భావన నుంచి విద్యార్థులు బయటపడాలి.
- **కెమిస్ట్రీ:** కెమిస్ట్రీకి సంబంధించి కెమికల్ బాండింగ్ అండ్ మాలిక్యులర్ స్ట్రక్చర్, థర్మోడైనమిక్స్, కెమికల్ ఈక్విలిబ్రియమ్స్, హైడ్రోజన్ అండ్ ఇట్స్ కాంపౌండ్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎలక్ట్రోకెమిస్ట్రీ, పీ-బ్లాక్ బయోమాలిక్యూల్స్, ఆర్గానిక్ కాంపౌండ్స్ కంటైనింగ్ **H, O, N** ముఖ్యమైనవి.
- **మ్యాథమెటిక్స్:** 2019 మెయిన్, 2020 జనవరిలో జరిగిన మెయిన్ పరీక్షలను పరిశీలిస్తే.. దాదాపు మ్యాథమెటిక్స్ ప్రశ్నలన్నీ బేసిక్ కాన్సెప్ట్‌ల నుంచే వచ్చాయి. కాబట్టి మ్యాథమెటిక్స్‌లో సీక్వెన్సెస్ అండ్ సిరీస్, బైనామియల్ థీరమ్, కాంప్లెక్స్ నంబర్, మాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్, ప్రాబబిలిటీ, అప్లికేషన్ ఆఫ్ డెరివేటివ్స్, డెఫినిట్ ఇంటిగ్రేషన్, ఏరియాస్ ఆఫ్ కర్వ్స్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, కానిక్ సెక్షన్స్ బీస్టాటిస్టిక్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్‌ను ఎక్కువగా ప్రాక్టీస్‌చేయాలి.

పరీక్ష విధానం... కోర్సుల వారీగా

బీఈ/బీటెక్ పరీక్ష విధానం

బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షలో 75 ప్రశ్నలు ఉంటాయి. మ్యాథమెటిక్స్ 25 ప్రశ్నలు-100 మార్కులు, ఫిజిక్స్ 25 ప్రశ్నలు-100 మార్కులు, కెమిస్ట్రీ 25 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి సబ్జెక్టుకు కేటాయించిన 25 ప్రశ్నల్లో.. 20 ప్రశ్నలు ఎంసీక్యూలైతే.. 5 ప్రశ్నలు న్యూమరికల్ విలువ ఆధారితంగా ఉంటాయి. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 3 గంటలు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. తప్పు సమాధానం గుర్తిస్తే ఒక మార్కు కోత ఉంటుంది. న్యూమరికల్ విలువ ఆధారిత ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు ఉండవు.

బీఆర్క్ పరీక్ష ఇలా

బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్షలో.. మ్యాథమెటిక్స్ పార్ట్-1, ఆప్టిట్యూడ్ టెస్ట్ పార్ట్-2.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. డ్రాయింగ్ టెస్ట్ మాత్రం పెన్-పేపర్ విధానంలో జరుగుతుంది. మ్యాథమెటిక్స్ పార్ట్-1లో 25 ప్రశ్నలు-100 మార్కులు ఉంటాయి. ఇందులో 5 ప్రశ్నలు న్యూమరికల్ విలువ ఆధారితమైనవి. అలాగే ఆప్టిట్యూడ్ టెస్ట్ పార్ట్-2..50 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష ఉంటుంది. అదేవిధంగా డ్రాయింగ్ టెస్ట్ పార్ట్ 3లో 2 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. మొత్తం బీఆర్క్ పరీక్ష 77 ప్రశ్నలు-400మార్కులకు నిర్వహిస్తారు.

బీప్లానింగ్ పరీక్ష తీరు

బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్షలో.. మ్యాథమెటిక్స్ పార్ట్-1, ఆప్టిట్యూడ్ టెస్ట్ పార్ట్-2, ప్లానింగ్ బేస్డ్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అన్నీ కూడా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ పార్ట్-1లో 25 ప్రశ్నలు-100 మార్కులు ఉంటాయి. ఇందులో 5 ప్రశ్నలు న్యూమరికల్ విలువ ఆధారితమైనవి. అలాగే ఆప్టిట్యూడ్ టెస్ట్ పార్ట్-2.. 50 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష ఉంటుంది. అదేవిధంగా ప్లానింగ్ బేస్డ్ ఆబ్జెక్టివ్ టైప్ పరీక్ష 25 ప్రశ్నలు-100 మార్కులకు జరుగుతుంది. మొత్తం బీఆర్క్ పరీక్ష 77 ప్రశ్నలు-400మార్కులకు నిర్వహిస్తారు.

స్కోరును మెరుగుపరుచుకోండిలా

- జనవరిలో జేఈఈ మెయిన్ పరీక్షలు రాసిన విద్యార్థులు తమ స్కోరును మెరుగుపరుచుకోవడానికి ఏప్రిల్ సెషన్‌ను ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల మొదటి విడతలో వచ్చిన ఫలితం కంటే మరింత మెరుగైన ఫలితం వచ్చే అవకాశం ఉంటుంది.
- జేఈఈ మెయిన్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు ఆయా సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేకంగా సొంతంగా టైం టేబుల్ రూపొందించుకొని ప్రతి రోజూ మూడు నుంచి 4 గంటల సమయాన్ని ప్రిపరేషన్ కోసం కేటాయించాలి. ఇంటర్మీడియట్‌లోని మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలి. అలాగే పాత జేఈఈ ప్రశ్నపత్రాలను సాధనచేయడం, గత జనవరి పరీక్షల్లో అడిగిన ప్రశ్నల తీరుతెన్నులపై అవగాహన పెంచుకోవాలి.
- ఏప్రిల్‌లో మెయిన్ పరీక్షల ప్రిపరేషన్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు జనవరిలో నిర్వహించిన ఆయా సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. దీనిద్వారా అప్పుడు అడిగిన ప్రశ్నల సరళి, ప్రశ్నల స్థాయి వంటి వాటిపై పట్టు వస్తుంది.
- న్యూమరికల్ వాల్యూ ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు లేవు కాబట్టి మనకు అనుకూల అంశాలు ఏవీ అనే అంశాలపైన దృష్టి సారించి.. ఆ దిశగా సాధన చేయాలి.
- జేఈఈ మెయిన్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు మాత్రమే చదువుతుంటారు. కానీ ప్రతి అంశంపైన పూర్తి పట్టు రావాలంటే.. విభిన్న తరహా ప్రశ్నలను ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి.

దరఖాస్తు విధానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- జేఈఈ మెయిన్‌కు కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయి దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేయాలి.
- జనవరి పరీక్షలకు దరఖాస్తు చేసుకొని పరీక్షలు రాసిన అభ్యర్థులు.. తమ పాత ఐడీతో తిరిగి లాగిన్ అయి పరీక్ష ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.
- జనరల్, ఓబీసీ పురుష అభ్యర్థులు ఏదైనా ఒక పేపర్‌కు రూ.650, రెండు పేపర్లకు రూ.1300, మహిళ అభ్యర్థులు రూ.325, రెండు పేపర్లకు రూ.650 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు ఒక పేపర్‌కు రూ.325, రెండు పేపర్లకు 650 దరఖాస్తు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 06, 2020
- **ఎడిట్ ఆప్షన్:** మార్చి 8-12 తేదీ వరకు
- **అడ్మిట్ కార్డ్:** మార్చి 20, 2020
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 5, 7, 8, 9, 11 తేదీల్లో
- **పరీక్ష సమయం:** ఫస్ట్ షిఫ్ట్-ఉదయం 9.30 నుంచి 12.30 వరకు; మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు
- **ఫలితాలు:** ఏప్రిల్ 30, 2020
- **వెబ్‌సైట్:** jeemain.nic.in and nta.ac.in

ఒత్తిడిని అధిగమించాలి

మార్చిలో ఇంటర్ బోర్డు పరీక్షలు.. అవి ముగిసిన 20 రోజులకే జేఈఈ-మెయిన్ ఉంటుంది. కాబట్టి విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతుంటారు. జనవరిలో పరీక్ష రాసిన విద్యార్థులు ఇంకాస్త కష్టపడితే సరిపోతుంది. ఇదివరకే ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ వంటి వాటిపైన అవగాహన కలిగి ఉంటారు. కాబట్టి గత పరీక్షల్లో ఎక్కడ పొరపాట్లు చేశారో గుర్తించి.. వాటిపైన దృష్టి కేంద్రీకరించడం మేలు.

-ఎంఎన్ రావు, సబ్జెక్ట్ నిపుణులు

ఉద్యోగ సమాచారం

హెచ్ఎంటీ-16

బెంగళూరులోని భారత ప్రభుత్వానికి చెందిన హెచ్ఎంటీ లిమిటెడ్.. 16 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** జాయింట్ జనరల్ మేనేజర్-3, డిప్యూటీ జనరల్ మేనేజర్-3, మేనేజర్-2, రీజనల్ మేనేజర్స్-4, మెడికల్ ఆఫీసర్-4.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ, సీఏ/సీఎంఏ/ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 10, 2020
- **వెబ్‌సైట్:** www.hmtindia.com

ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు ప్రిపరేషన్
స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్, జీకే, ఆన్‌లైన్ టెస్టులు, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
SOCIAL STUDIES

టీఎస్ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలు

తెలంగాణలో వెనుకబడిన మండలాల విద్యార్థుల కోసం ఉత్తమ ఉపాధ్యాయులు, అధునాతన సౌకర్యాలతో పాఠశాల విద్యను అందించేందుకు మోడల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టారు. తాజాగా రాష్ట్రంలో 194 వెనుకబడిన మండలాల్లో ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్స్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో..బాలబాలికలకు ఉపయోగపడేలా తెలంగాణ మోడల్‌స్కూల్స్ దరఖాస్తు విధానం, అర్హతలు, ఎంపిక ప్రక్రియ గురించి తెలుసుకుందాం...

- **సీట్లు:** ప్రతి తరగతిలో 100 మందికి ప్రవేశం కల్పిస్తారు. ఆరో తరగతిలో రెండు సెక్షన్లు ఉంటాయి. ఏడు నుంచి పదోతరగతి వరకు ఖాళీల ఆధారంగా లేటర్ ఎంట్రీకి అవకాశం ఉంది. ప్రవేశానికి సంబంధించి అన్ని తరగతులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- **వయసు:** 6వ తరగతి- ఆగస్టు 31 నాటికి పదేళ్లు నిండి ఉండాలి. 7వ తరగతి- ఆగస్టు 31 నాటికి పదకొండేళ్లు నిండి ఉండాలి. 8వ తరగతి- ఆగస్టు 31 నాటికి పన్నెండేళ్లు నిండి ఉండాలి. 9వ తరగతి- ఆగస్టు 31 నాటికి పదమూడేళ్లు నిండి ఉండాలి. 10వ తరగతి- ఆగస్టు 31 నాటికి పద్నాలుగేళ్లు నిండి ఉండాలి.
- **రిజర్వేషన్లు:** ప్రతి తరగతిలో సీట్లలో 15 శాతాన్ని ఎస్సీలకు, 6 శాతాన్ని ఎస్టీలకు, 29 శాతాన్ని బీసీలకు రిజర్వ్ చేశారు. మొత్తంగా 33.33 శాతం సీట్లను బాలికలకు కేటాయిస్తారు.

పరీక్ష విధానం

ఆరోతరగతి

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
తెలుగు	25	25
మ్యాథ్స్	25	25
సైన్స్,సోషల్(ఈవీఎస్)	25	25
ఇంగ్లీష్	25	25
మొత్తం	100	100

- ప్రశ్నపత్రం ఐదోతరగతి సిలబస్‌పై ఉంటుంది. పేపర్‌ను మల్టిపుల్ చాయిస్ విధానంలో రూపొందిస్తారు. -మ్యాథ్స్, ఈవీఎస్ విభాగాలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి.

7-10వ తరగతులు

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లీష్	25	25
మ్యాథ్స్	25	25
జనరల్ సైన్స్	25	25
సోషల్ స్టడీస్	25	25
మొత్తం	100	100

- ఇంగ్లీష్ మినహా మిగిలిన అన్ని విభాగాలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి.

మోడల్ స్కూల్స్ ప్రత్యేకతలు

- విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయరు.
- ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన.
- మోడల్ స్కూల్స్‌ను పక్కా భవనాల్లో ఏర్పాటు చేశారు.
- విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ
- ఆరు నుంచి పదోతరగతి వరకు మధ్యాహ్న భోజనం పథకం వర్తింపు.
- విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం అందిస్తారు.
- బాలికలకు హాస్టల్ వసతి(వంద మంది వరకు).
- సైన్స్, కంప్యూటర్, లైబ్రరీ వసతి.
- విద్యార్థులకు డిజిటల్ తరగతులు.
- ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ, టీపీటీ, సివిల్స్‌కు ఉచిత కోచింగ్.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు, ఫీజు చెల్లింపునకు చివరితేదీ:** 6వ తరగతి: ఫిబ్రవరి 29
  7-10వ తరగతులు: మార్చి 2
- **హాల్‌టికెట్ల జారీ:** ఏప్రిల్ 9 నుంచి ప్రారంభం
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 12, 2020 (ఆరోతరగతి-ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; 7-10వ తరగతులు- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు)
- **ఫలితాల వెల్లడి:** మే 20, 2020
- **ఎంపిక జాబితా ప్రకటన:** మే 27,2020
- **సర్టిఫికేట్ వెరిఫికేషన్, ప్రవేశాలు:** మే 28-31
- **పరీక్ష ఫీజు:** ఎస్సీ,ఎస్టీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75, ఇతరులకు రూ.150.

వెనుకబడిన ప్రాంతాలకు వరం..

తెలంగాణ మోడల్ స్కూల్స్‌ను వెనుకబడిన ప్రాంతాలకు వరంగా చెప్పాలి. మోడల్ స్కూల్స్ ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అందుబాటులో ఉంది. ప్రస్తుతం ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. పదోతరగతి ఫలితాలు వెలువడిన తర్వాత ఇంటర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తాం. మోడల్ స్కూల్స్‌లో బోధనంతా ఇంగ్లీష్ మీడియంలోనే సాగుతుంది. ప్రస్తుతం 194 మోడల్ స్కూల్స్‌లో ఆరోతరగతికి సంబంధించి 19,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన తరగతుల్లో ఖాళీల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తాము. మోడల్ స్కూల్స్‌లో ఎలాంటి ఫీజు లేకుండా అత్యుత్తమ బోధన అందిస్తున్నాము. పోటీ పరీక్షలకు సైతం శిక్షణ ఇస్తున్నాము. కాబట్టి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఎ. సత్యనారాయణరెడ్డి,
ప్రాజెక్టు డైరెక్టర్, టీఎస్ మోడల్ స్కూల్స్

ఫెలోషిప్

ఐఐటీలో సమ్మర్ ఫెలోషిప్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- బాంబే-2020కి గాను ఫ్రీ/లిబరల్ అండ్ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ ఫర్ ఎడ్యుకేషన్(ఎఫ్ఓఎస్ఎస్ఈఈ)సమ్మర్ ఫెలోషిప్‌లను అందిస్తోంది. ఇది కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రాజెక్టు. నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ త్రూ ఐసీటీ దీనికి నిధులను అందజేస్తుంది. ఇంజనీరింగ్,సైన్స్, ఆర్ట్స్, కామర్స్.. ఇలా అన్ని విభాగాలకు చెందిన బ్యాచిలర్, మాస్టర్స్, పీహెచ్‌డీ విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. తగిన అర్హతలు, ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు లేదు.

టాస్క్ పూర్తిచేస్తేనే

ఫెలోషిప్ పొందడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంతోపాటు స్క్రీనింగ్ టాస్క్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రెండు టాపిక్స్‌ను ఎంచుకునేందుకు అవకాశం ఉంది. టాస్క్ పూర్తిచేయడానికి నెలకుపైగా పడుతుందని చెబుతున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. టాస్క్ పూర్తి చేసిన తర్వాత గడువులోగా వెబ్‌సైట్‌లో సమర్పించాలి. వీటిని ఎఫ్ఓఎస్ఎస్ఈఈ నిపుణుల బృందం పరిశీలిస్తుంది. టాస్క్‌ను ఉత్తమంగా పూర్తిచేసిన వారిని విజేతలుగా ప్రకటించి.. ఫెలోషిప్‌కు అవకాశం కల్పిస్తారు. స్క్రీనింగ్ టాస్క్ పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తారు. గతంలో సమ్మర్‌ఫెలోషిప్‌లో పాల్గొన్న వారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **నమోదు చేసుకోవడానికి చివరి తేది:** ఫిబ్రవరి 25, 2020
- **దరఖాస్తు సమర్పించడానికి చివరి తేది:** మార్చి 7, 2020
- **ఫలితాల వెల్లడి:** ఏప్రిల్ 2020
- **ఫెలోషిప్ ప్రారంభం:** మే 2020
- **వెబ్‌సైట్:** https://fossee.in/fellowship/2020

నారీ...ధనాధన్ భేరి

ట్రోఫీతో పది జట్ల కెప్టెన్లు

మహిళల క్రికెట్‌కు మళ్లీ ప్రపంచ కప్ కళ వచ్చింది. ఏడాది పాటు ఎన్ని టోర్నీలు, ద్వైపాక్షిక సిరీస్‌లు జరిగినా ఆకర్షణలో విశ్వ సమరం తర్వాతే ఏదైనా! పొట్టి ఫార్మాట్‌లో తమ సత్తా చాటేందుకు అగ్రశ్రేణి ఆస్ట్రేలియా నుంచి ఆటలో తప్పటడగులు వేస్తున్న థాయ్‌లాండ్ వరకు 10 జట్లు సన్నద్ధమయ్యాయి. తొలి నాలుగు టి20 ప్రపంచ కప్‌లు పురుషుల టోర్నీలతో సమాంతరంగా జరగడంతో స్త్రీ శక్తికి రావాల్సిన గుర్తింపు దక్కలేదు. రెండేళ్ల క్రితం విడిగా నిర్వహించినా తగినంత ప్రచారం లభించలేదు. అయితే ఇప్పుడు ఆస్ట్రేలియా వేదికగా జరుగుతుండటంతో ఒక్కసారిగా టోర్నీకు ఊపు వచ్చేసింది. ఇక 17 రోజుల పాటు నారీమణుల బ్యాట్‌ల నుంచి గర్జనలు ఖాయం.

టి20ల్లో ఆరు సార్లు ప్రపంచ కప్ జరిగితే నాలుగుసార్లు ఆస్ట్రేలియానే విజేతగా నిలిచింది. ఒకసారి వెస్టిండీస్ మహిళలు గెలుపు కిరీటం దక్కించుకోగా, మొదటి టోర్నీలో చాంపియన్ అయిన ఇంగ్లండ్ మళ్లీ ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. మన భారత్ మాత్రం మూడుసార్లు సెమీఫైనల్ దశలోనే ఆగిపోయింది. ప్రతీసారి బలమైన పోటీదారుగా కనిపిస్తున్నా టైటిల్ మాత్రం న్యూజిలాండ్‌కు అందని ద్రాక్షే అయింది. ఈసారి కూడా సొంత గడ్డపై లేడీ కంగారూలు ఫేవరెట్‌లు అనడంలో సందేహం లేదు. పురుషుల క్రికెట్‌కు ఏమాత్రం తగ్గని రీతిలో ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన మార్చి 8న జరిగే ఫైనల్లో తుది విజేత ఎవరో వేచి చూడాలి.

-సాక్షి క్రీడా విభాగం

నేటి నుంచి మహిళల టి20 ప్రపంచకప్

- టైటిల్ బరిలో 10 జట్లు
- మార్చి 8న ఫైనల్ మ్యాచ్
- తొలి పోరులో ఆస్ట్రేలియాతో భారత్ ఢీ

మధ్యాహ్నం గం. 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

2009: తొలి టి20 ప్రపంచ కప్ జరిగిన ఏడాది. పురుషులతో పాటు వరుసగా నాలుగు టోర్నీలు జరిగాయి. 2018లో మాత్రం పురుషుల వరల్డ్ కప్ జరగకపోగా, మహిళల ఈవెంట్‌ను విడిగా నిర్వహించారు. ఈసారి ఇదే ఏడాది అక్టోబరులో ఆస్ట్రేలియాలోనే పురుషుల ప్రపంచ కప్ ఉన్నా... మహిళల టోర్నీ ప్రత్యేకత నిలబెట్టేందుకు, ప్రేక్షకుల, ప్రసారకర్తల దృష్టి మళ్లకుండా ఉండేందుకు ముందుగానే నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ఐసీసీ పెద్ద మొత్తంలోనే ఖర్చు చేసింది.

'ఉమెన్ ఇన్ బ్లూ' ఆశలు!

విశ్వ వేదికపై ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయినా... మళ్లీ పొట్టి ప్రపంచ కప్‌లో భారత్ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమైంది. ఆరు టి20 వరల్డ్ కప్‌లలో ఒక్కసారి కూడా మన జట్టు తుది పోరుకు అర్హత సాధించలేకపోయింది. మూడుసార్లు సెమీస్‌లోనే ప్రస్థానం ముగిసింది. గతంతో పోలిస్తే ఈసారి మన టీమ్ కాస్త మెరుగ్గా కనిపిస్తోంది. సరిగ్గా చెప్పాలంటే ఫార్మాట్‌కు తగిన విధంగా దూకుడు పెరిగింది. కోచ్ డబ్ల్యూవీ రామన్ మార్గనిర్దేశనంలో అమ్మాయిలు మరింతగా రాటుదేలారు. గత టోర్నీలాగే ఇప్పుడూ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోనే జట్టు బరిలోకి దిగుతోంది. ఆతిథ్య జట్టు, డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌లతో పోలిస్తే ఇంకా కొంత వెనుకబడినట్లు అనిపిస్తున్నా... ఈ ఫార్మాట్‌లో సంచలనానికీ అవకాశం ఉంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఓడించి శుభారంభం చేయాలని భారత్ పట్టుదలగా ఉంది. ఫామ్ ప్రకారం చూస్తే 2019 నుంచి భారత్ 10 టి20లు మ్యాచ్‌లు గెలిచి మరో 10 ఓడింది. ఇది కాస్త నిలకడలేమిని చూపిస్తోంది. ఇటీవల జరిగిన ముక్కోణపు టోర్నీలోనూ ఇది కనిపించింది.

స్మృతి మంధాన

2018 నుంచి చూస్తే స్మృతి మంధాన అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌వుమన్‌గా నిలిచింది. 42 ఇన్నింగ్స్‌లలో ఆమె 1,243 పరుగులు చేసింది. స్ట్రయిక్ రేట్ కూడా దాదాపు 130 ఉంది. బిగ్‌బాష్ లీగ్‌లోనూ ఆడిన అనుభవం ఉన్న స్మృతి ఇచ్చే ఆరంభంపైనే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మూడో స్థానంలో ఉన్న కెప్టెన్ హర్మన్ కూడా 933 పరుగులు సాధించింది. వీరిద్దరి బ్యాటింగ్, అనుభవం జట్టుకు పెద్ద బలం. ఇక జెమీమా రోడ్రిగ్స్, ఇటీవల సంచలన బ్యాటింగ్ ప్రదర్శన కనబరుస్తున్న షఫాలీ వర్మ కూడా దూకుడుగా ఆడితే భారత్‌కు బ్యాటింగ్‌లో తిరుగుండదు. భారీ షాట్లు ఆడగల వేద కృష్ణమూర్తి తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. ఈ ఫార్మాట్‌లో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కూడా కీలకం కానుంది. పేస్ బౌలింగ్‌లో శిఖా పాండే ఓవరాల్ రికార్డు గొప్పగా లేకపోయినా... ఇటీవల పునరాగమనం తర్వాత ఆమె చాలా మెరుగ్గా ఆడుతోంది. అన్నింటికి మించి స్పిన్ బలగంపై కూడా భారత్ నమ్మకం పెట్టుకుంది. భిన్నమైన శైలి గల పూనమ్ యాదవ్, రాధా యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్‌ల ప్రదర్శన జట్టు గెలుపోటములను ప్రభావితం చేయవచ్చు.

అంచనా...

జట్టు కూర్పు, ఫామ్, కీలక ఆటగాళ్ల రికార్డులను బట్టి చూస్తే కనీసం ఫైనల్ చేరాల్సిందే. అంతకంటే తక్కువ ఫలితాన్ని సాధిస్తే అది ఏ రకమైన ఘనతా అనిపించుకోదు. ఇంతకంటే మెరుగైన అవకాశం కూడా మళ్లీ రాకపోవచ్చు. ఇక తుది పోరులో కూడా గెలవగలిగితే చరిత్ర సృష్టించినట్లే.

జట్టు వివరాలు

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్, దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి, రిచా ఘోష్, తానియా, పూనమ్ యాదవ్, రాధ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్, శిఖా పాండే, పూజ, అరుంధతి రెడ్డి.

ఎవరికెంత ప్రైజ్‌మనీ...

విజేత: 10 లక్షల డాలర్లు (రూ. 7 కోట్ల 18 లక్షలు)
రన్నరప్: 5 లక్షల డాలర్లు (రూ. 3 కోట్ల 59 లక్షలు)
సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లకు:
2 లక్షల 10 వేల డాలర్ల చొప్పున (రూ. కోటీ 50 లక్షలు)
గ్రూప్ మ్యాచ్‌లో ఒక్కో విజయానికి:
15 వేల డాలర్ల చొప్పున (రూ. 10 లక్షల 77 వేలు)
గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ఆరు జట్లకు:
30 వేల డాలర్ల చొప్పున (రూ. 21 లక్షల 54 వేలు)

3	14	95,000
టోర్నీలో భారత్ మూడు సార్లు 2009, 2010, 2018లలో సెమీఫైనల్ వరకు చేరగలిగింది. ఒక్కసారి కూడా ఫైనల్లోకి అడుగు పెట్టలేదు.	వరుసగా ఏడో వరల్డ్ కప్ బరిలోకి దిగుతున్న అమ్మాయిలు 9 జట్లలో కలిపి 14 మంది ఉన్నారు. థాయ్‌లాండ్‌కు మాత్రం ఇదే తొలి వరల్డ్ కప్.	ఫైనల్ జరిగే మెల్‌బోర్న్ ఎంసీజీ మైదానం సామర్థ్యం. తుది పోరుకు స్టేడియం నిండితే ఒక అంతర్జాతీయ మహిళల మ్యాచ్‌కు అత్యధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరైన రికార్డు నమోదవుతుంది. అమెరికాలోని రోజ్‌బౌల్‌లో జరిగిన 1999 మహిళల ఫుట్‌బాల్ వరల్డ్ కప్ ఫైనల్‌కు 90, 185 వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

టీవీ అంపైర్ 'నోబాల్స్'ను పర్యవేక్షించనున్న తొలి ఐసీసీ టోర్నీ ఇదే

గత విజేతలు	2009	2010, 2012, 2014, 2018	2016
	ఇంగ్లండ్	ఆస్ట్రేలియా	వెస్టిండీస్

టి20 ప్రపంచకప్ షెడ్యూల్

మ్యాచ్‌ల సమయం భారత కాలమానం ప్రకారం

- ఫిబ్రవరి 21: భారత్ X ఆస్ట్రేలియా సిడ్నీ మ.గం. 1.30 నుంచి
- ఫిబ్రవరి 22: వెస్టిండీస్ X థాయ్‌లాండ్ పెర్త్ మ.గం. 12.30
- ఫిబ్రవరి 22: న్యూజిలాండ్ X శ్రీలంక పెర్త్ సా.గం. 4.30
- ఫిబ్రవరి 23: ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా పెర్త్ సా.గం. 4.30
- ఫిబ్రవరి 24: ఆస్ట్రేలియా X శ్రీలంక పెర్త్ ఉ.గం. 11.30
- ఫిబ్రవరి 24: భారత్ X బంగ్లాదేశ్ పెర్త్ సా.గం. 4.30
- ఫిబ్రవరి 26: ఇంగ్లండ్ X థాయ్‌లాండ్ కాన్‌బెర్రా ఉ.గం. 9.30
- ఫిబ్రవరి 26: పాకిస్తాన్ X వెస్టిండీస్ కాన్‌బెర్రా మ.గం. 1.30
- ఫిబ్రవరి 27: భారత్ X న్యూజిలాండ్ మెల్‌బోర్న్ ఉ.గం. 9.30
- ఫిబ్రవరి 27: ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్ కాన్‌బెర్రా మ.గం. 1.30
- ఫిబ్రవరి 28: దక్షిణాఫ్రికా X థాయ్‌లాండ్ కాన్‌బెర్రా ఉ.గం. 9.30
- ఫిబ్రవరి 28: ఇంగ్లండ్ X పాకిస్తాన్ కాన్‌బెర్రా మ.గం. 1.30
- ఫిబ్రవరి 29: న్యూజిలాండ్ X బంగ్లాదేశ్ మెల్‌బోర్న్ ఉ.గం. 5.30
- ఫిబ్రవరి 29: భారత్ X శ్రీలంక మెల్‌బోర్న్ మ.గం. 1.30
- మార్చి 1: దక్షిణాఫ్రికా X పాకిస్తాన్ సిడ్నీ ఉ.గం. 9.30
- మార్చి 1: ఇంగ్లండ్ X వెస్టిండీస్ సిడ్నీ మ.గం. 1.30
- మార్చి 2: బంగ్లాదేశ్ X శ్రీలంక మెల్‌బోర్న్ ఉ.గం. 5.30
- మార్చి 2: ఆస్ట్రేలియా X న్యూజిలాండ్ మెల్‌బోర్న్ ఉ.గం. 9.30
- మార్చి 3: పాకిస్తాన్ X థాయ్‌లాండ్ సిడ్నీ ఉ.గం. 9.30
- మార్చి 3: వెస్టిండీస్ X దక్షిణాఫ్రికా సిడ్నీ మ.గం. 1.30
- మార్చి 5: తొలి సెమీఫైనల్ సిడ్నీ (బి1 X ఏ2) ఉ.గం. 9.30
- మార్చి 5: రెండో సెమీఫైనల్ (ఏ1X బి2) సిడ్నీ మ.గం. 1.30
- మార్చి 8: ఫైనల్ మెల్‌బోర్న్ మ.గం. 12.30 నుంచి

గ్రూప్‌ల వివరాలు

గ్రూప్ 'ఎ': భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్.

గ్రూప్ 'బి': ఇంగ్లండ్, వెస్టిండీస్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, థాయ్‌లాండ్.

ఈ టోర్నీలో పాల్గొంటున్న జట్ల సంఖ్య 10 కాగా... మొత్తం మ్యాచ్‌ల సంఖ్య 23. లీగ్ దశలో ప్రతీ జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన రెండేసి జట్లు ఆయా గ్రూప్‌ల నుంచి సెమీఫైనల్‌కు చేరుతాయి.

అన్ని మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

'త్రిస్వర్ణ' కాంతులు...

- ఆసియా సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో భారత మహిళా రెజ్లర్లకు మూడు స్వర్ణాలు
- పసిడి పతకాలు నెగ్గిన సరిత, దివ్య, పింకీ

న్యూఢిల్లీ: సొంతగడ్డపై భారత మహిళా రెజ్లర్లు స్వర్ణ కాంతులీనారు. ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం మొదలైన మహిళల ఫ్రీస్టయిల్ పోటీల్లో భారత్‌కు ఒకే రోజు మూడు స్వర్ణాలు, ఒక రజతం లభించాయి. దివ్య కాక్రాన్ (68 కేజీలు), సరితా మోర్ (59 కేజీలు), పింకీ (55 కేజీలు) పసిడి పతకాలు సొంతం చేసుకోగా... నిర్మలా దేవి (50 కేజీలు) రజతం దక్కించుకుంది. కిరణ్ (76 కేజీలు) మాత్రం విఫలమైంది. ఫైనల్స్‌లో సరిత 3-2తో బాట్‌సెట్‌సెగ్ అల్టాంట్‌సెగ్ (మంగోలియా)పై... పింకీ 2-1తో డల్గున్ బొలోర్మా (మంగోలియా)పై గెలిచారు. నిర్మలా దేవి 2-3తో మిహో ఇగారషి (జపాన్) చేతిలో ఓడిపోయింది. 68 కేజీల విభాగంలో ఐదుగురు రెజ్లర్లు మాత్రమే ఉండటంతో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. దివ్య బరిలోకి దిగిన నాలుగు బౌట్‌లలోనూ గెలిచి విజేతగా అవతరించింది. దివ్య వరుసగా 6-0తో అల్బీనా (కజకిస్తాన్)పై, 11-2తో డెల్‌గెరామా (మంగోలియా)పై, 8-0తో అజోదా (ఉజ్బెకిస్తాన్)పై, 6-4తో నరువా మత్సుయుకి (జపాన్)పై గెలిచి అజేయంగా నిలిచింది. ఇంతకుముందు ఆసియా చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు ఏకైక స్వర్ణం 2018లో నవ్‌జ్యోత్ కౌర్ (65 కేజీలు) రూపంలో లభించింది. ఈసారి మాత్రం ఒకేరోజు మూడు పసిడి పతకాలు లభించడం విశేషం.

సరిత

దివ్య

పింకీ

శ్రీకాంత్‌కు చుక్కెదురు

- 28 నిమిషాల్లోనే జయరామ్ చేతిలో ఓటమి
- క్వార్టర్స్‌లో సైనా, సమీర్

బార్సిలోనా: కొంతకాలంగా పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తోన్న భారత బ్యాడ్మింటన్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ మళ్లీ తడబడ్డాడు. బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించాడు. భారత్‌కే చెందిన ప్రపంచ 68వ ర్యాంకర్ అజయ్ జయరామ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 28 నిమిషాల్లో 6-21, 17-21తో ఓడిపోయాడు. పురుషుల సింగిల్స్ మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో సమీర్ వర్మ (భారత్) 21-14, 16-21, 21-15తో కాయ్ షాఫెర్ (జర్మనీ)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సైనా నెహ్వాల్ (భారత్) 21-10, 21-19తో మరియా ఉలిటినా (ఉక్రెయిన్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-అశ్విని (భారత్) జంట 18-21, 14-21తో గాబ్రియెలా-స్టెఫానీ (బల్గేరియా) జోడీ చేతిలో... మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా (భారత్) ద్వయం 16-21, 21-16, 13-21తో సూన్ హువాట్-లాయ్ షెవోన్ జేమీ (మలేసియా) జంట చేతిలో ఓడిపోయాయి.

క్వార్టర్స్‌లో దివిజ్ జంట

ఫ్లోరిడా (అమెరికా): డెల్‌రే బీచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో దివిజ్ శరణ్ (భారత్)-ఆర్తెమ్ సితాక్ (న్యూజిలాండ్) జంట క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో దివిజ్-సితాక్ ద్వయం 5-7, 6-4, 10-7తో ఆండ్రె గొరంసన్ (స్వీడన్)-ఉగో హమ్‌బర్ట్ (ఫ్రాన్స్) జంటపై 'సూపర్ టైబ్రేక్'లో గెలుపొందింది. క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ బాబ్ బ్రయాన్-మైక్ బ్రయాన్ (అమెరికా) ద్వయంతో దివిజ్-ఆర్తెమ్ జోడీ తలపడుతుంది.

సౌరాష్ట్ర 226/6

- పృథ్వీరాజ్‌కు 3 వికెట్లు
- ఆంధ్రతో రంజీ క్వార్టర్స్ మ్యాచ్

సాక్షి, ఒంగోలు: రంజీ ట్రోఫీలో తొలిసారి సెమీఫైనల్‌కు చేరుకోవడమే లక్ష్యంగా... సౌరాష్ట్రతో గురువారం మొదలైన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర క్రికెట్ జట్టు బౌలర్లు ఆకట్టుకున్నారు. యెర్రా పృథ్వీరాజ్ (3/51), కేవీ శశికాంత్ (2/82) రాణించడంతో... ఇక్కడి సీఎస్‌ఆర్ శర్మ కాలేజీ మైదానంలో ఆరంభమైన మ్యాచ్‌లో గురువారం ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 226 పరుగులు చేసింది. విశ్వరాజ్ జడేజా (73; 10 ఫోర్లు), షెల్డన్ జాక్సన్ (50; 9 ఫోర్లు, సిక్స్), చిరాగ్ జానీ (53 బ్యాటింగ్; 5 ఫోర్లు) అర్ధ శతకాలతో రాణించారు. ఒక దశలో ఆంధ్ర బౌలర్ల ధాటికి సౌరాష్ట్ర 140 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. అయితే విశ్వరాజ్ జడేజా, చిరాగ్ జోడీ ఆరో వికెట్‌కు 81 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దింది.

విశ్వరాజ్

చిరాగ్ జానీ

ఇతర క్వార్టర్స్ మ్యాచ్‌ల సంక్షిప్త స్కోర్లు

- **బెంగాల్ తొలి ఇన్నింగ్స్:** 308/6 (86 ఓవర్లలో) (అనుస్తుప్ మజుందార్ 136 బ్యాటింగ్, షహబాజ్ అహ్మద్ 82 బ్యాటింగ్); ఒడిషాతో కటక్‌లోమ్యాచ్ ● **గుజరాత్ తొలి ఇన్నింగ్స్:** 330/4 (90 ఓవర్లలో) (పార్థివ్ పటేల్ 118 బ్యాటింగ్, భార్గవ్ మెరాయ్ 84, సమిత్ 52); గోవాతో వల్సాడ్‌లో మ్యాచ్. ● **కర్ణాటక తొలి ఇన్నింగ్స్:** 14/2 (6 ఓవర్లలో); జమ్మూ కశ్మీర్‌తో జమ్మూలో మ్యాచ్.

ఇక్కడ 320 మంచి స్కోరు: రహానే

నేటి నుంచి భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టు

వెల్లింగ్టన్: తొలిటెస్టుకు ఆతిథ్యమిస్తున్న బేసిన్ రిజర్వ్ మైదానం పిచ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 320 పరుగులైన ఉత్తమ స్కోరే అని భారత వైస్ కెప్టెన్ అజింక్య రహానే అన్నాడు. 'కివీస్ సొంతగడ్డపై జరిగే ఈ టెస్టు సిరీస్‌లో న్యూజిలాండే ఫేవరెట్. ఎందుకంటే ఇక్కడి ట్రాక్‌పై వారి బౌలర్లకు, బ్యాట్స్‌మెన్‌కు ఉన్న అవగాహన ఇంకెవరికీ ఉండదు. కివీస్ మైదానాలన్నీ భిన్నంగా ఉంటాయి. అయితే ఓ జట్టుగా అవి ఎలా ఉంటాయోనన్న విషయాల్ని మేం వెంటనే పసిగడితేనే మ్యాచ్‌పై పట్టు సాధించగలం' అని అన్నాడు. లార్డ్స్ (2014), అడిలైడ్ (2018) టెస్టుల్లో తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులలోపు చేసి చారిత్రక టెస్టు విజయాల్ని సాధించామని ఇప్పుడు ఇక్కడా అదే ఫార్ములాను నమ్ముకున్నామని రహానే చెప్పాడు. గతంలో ఇంగ్లండ్‌లో 295 పరుగులు, ఆసీస్‌లో 250 పరుగులు చేసినా భారత్ గెలిచింది. 'ముందుగా బ్యాటింగ్ చేస్తే తాజా మైండ్‌సెట్‌తో సానుకూల దృక్పథంతో పరుగులు సాధించే వీలవుతుంది. పైగా విదేశీ గడ్డపై 320, 330 పరుగుల స్కోర్లే ఉత్తమ స్కోర్లవుతాయి. మేం ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల్లో సాధించిన టెస్టు విజయాలకు ఆ స్కోర్లే పట్టుచిక్కేలా చేశాయి' అని వైస్ కెప్టెన్ అన్నాడు. వెల్లింగ్టన్‌లోని బెసిన్ రిజర్వ్ వేదికపై రహానేకు తీపి గుర్తులున్నాయి. 2014లో ఇక్కడ టెస్టు కెరీర్‌లో తను తొలి సెంచరీ నమోదు చేశాడు.

ఫ్రెంచ్ ఓపెన్‌కు ఫెడరర్ దూరం

బాసెల్ (స్విట్జర్లాండ్): కుడి మోకాలికి శస్త్ర చికిత్స జరగడంతో... స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ నాలుగు నెలలపాటు ఆటకు దూరం కానున్నాడు. ఈ నేపథ్యంలో 38 ఏళ్ల ఫెడరర్ వచ్చే నాలుగు నెలల్లో జరిగే దుబాయ్ ఓపెన్, ఇండియన్ వెల్స్ ఓపెన్, బొగోటా ఓపెన్, మయామి ఓపెన్ టోర్నీలతో సహా మే 24 నుంచి జూన్ 7 వరకు జరిగే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీకీ అందుబాటులో ఉండటం లేదు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
21-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
153	45
41,170	12,081

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గంటలకు)

నాస్‌డాక్	9,705	112
డోజోన్స్	29,132	216
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,437	20
డాక్స్	13,664	125
షాంఘై	3,030	55
నికాయ్	23,479	78

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	71.00	72.65
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	91.06	94.30
€	యూరో	థామస్‌కుక్	76.11	79.01
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	63.30	65.66
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	46.61	48.78
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	50.34	52.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.31	19.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	19.04	20.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.58	10.83

కోవిడ్ ఎఫెక్ట్...

శాంసంగ్ దూకుడు!

- 9 కొత్త మొబైల్ ఫోన్లు తెచ్చేందుకు సన్నాహాలు
- చైనా కంపెనీల ప్రణాళికలపై వైరస్ ప్రభావం
- ఉత్పత్తుల విడుదలలో జాప్యం

న్యూఢిల్లీ: కోవిడ్-19(కరోనా) వైరస్ చైనా ఎలక్ట్రానిక్ కంపెనీలను కలవరపెడుతుంటే.. భారత మార్కెట్లో ఆధిపత్యం కోసం తీవ్రంగా శ్రమిస్తున్న దక్షిణ కొరియా కంపెనీ శాంసంగ్ ఈ వైరస్ రూపంలో లాభపడనుంది.! చైనా మొబైల్ తయారీ కంపెనీలు, ఎలక్ట్రానిక్ సంస్థల ప్రణాళికలపై కోవిడ్ ప్రభావం చూపిస్తోంది. యాపిల్‌తోపాటు చైనాకు చెందిన షావోమీ, ఒప్పో, వివో, రియల్‌మీ తదితర ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల విడుదల ప్రణాళికల ను సమీక్షించుకుంటున్నాయి. కానీ, శాంసంగ్ మాత్రం తన ప్రణాళికలను వాయిదా వేసుకోకుండా మరింత దూకుడుగా ఉత్పత్తులను విడుదల చేసే కార్యక్రమంలో ఉంది. భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) గణాంకాల ప్రకారం.. శాంసంగ్ ఇండియా 2020 ప్రారంభంలోనే 9 నూతన మొబైల్ ఫోన్లకు సంబంధించి బీఐఎస్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. కానీ, ఇదే సమయంలో షావోమీకి చెందిన రెడ్‌మీ, దక్షిణ కొరియాకు చెందిన మరో సంస్థ ఎల్‌జీ రెండేసి ఉత్పత్తులకు రిజిస్ట్రేషన్ కోరడం చూస్తుంటే.. శాంసంగ్ దూకుడు పెంచినట్టు తెలుస్తోంది. ఇక ఇదే కాలంలో మోటరోలా, కూల్‌ప్యాడ్ సంస్థలు ఒక్కొక్క ఉత్పత్తి రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు పెట్టుకున్నాయి.

దేశీయ కంపెనీలదీ దూకుడే..: ఈ సమయంలో దేశీయ కంపెనీలు కూడా తమ ఉత్పత్తుల విడుదలలో వేగాన్ని పెంచడాన్ని పరిశీలించాలి. ఢిల్లీకి చెందిన సెల్‌కార్ జనవరి 1 నుంచి ఇప్పటికే 15 మోడళ్లకు బీఐఎస్ రిజిస్ట్రేషన్ తీసుకుని చార్ట్‌లో అగ్రస్థానంలో ఉంది. మరో స్థానిక బ్రాండ్ హైటెక్ కూడా మూడు మోడళ్లకు ఈ కాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గమనార్హం. ''పెద్ద తయారీ సంస్థలు (ఓఈఎంలు) తమ ఉత్పత్తుల విడుదలను జాప్యం చేస్తున్నట్టు కనిపిస్తోంది. సాధారణంగా బీఐఎస్ రిజిస్ట్రేషన్ తర్వాత ఉత్పత్తుల విడుదలకు 4-6 వారాలు తీసుకుంటుంది. ప్రస్తుత పరిస్థితి శాంసంగ్‌కు అనుకూలం. ఎందుకంటే పోయే హ్యాండ్‌సెట్‌గా జెడ్ ఫ్లిప్ నిలిచిపోనుందని ఈ సందర్భంగా కంపెనీ ఇండియా డైరెక్టర్(మొబైల్) ఆదిత్య బబ్బర్ వ్యాఖ్యానించారు. ఇక స్పెసిఫికేషన్స్ విషయానికి వస్తే.. 6.7 అంగుళాల పూర్తి హెచ్‌డీ డైనమిక్ అమోలెడ్ ఇన్ఫినిటీ ఫ్లెక్స్ డిస్‌ప్లే, 8 జీబీ ర్యామ్, 256 స్టోరేజ్, ఆండ్రాయిడ్ 10 ఓఎస్, 3300 ఎంఏహెచ్ బ్యాటరీ, వెనుకవైపు రెండు 12 మెగా పిక్సెల్ కెమెరాలు, 10ఎంపీ సెల్ఫీ కెమెరా ఉన్నాయి.

ధర రూ.1.10 లక్షలు

వ్యవస్థపై వైరస్ ప్రభావం ఉండదు'' అని టెక్‌ఆర్క్‌కు చెందిన ముఖ్య అనలిస్ట్ ఫైసల్ కవూసా తెలిపారు.

చైనా కంపెనీలకు ఇబ్బందులు.. చైనాలో కోవిడ్ వైరస్ తీవ్రతతో కొన్ని ప్రాంతాల్లో తయారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇది సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపించనుంది. దీని తాలూకూ వేడి భారత్‌లో కార్యకలాపాలు కలిగి ఉన్న చైనా కంపెనీలకు ఇప్పటికే తాకింది. చైనాకు చెందిన ప్రముఖ కంపెనీలకు భారత్‌లో తయారీ కేంద్రాలు ఉన్నప్పటికీ.. విడి భాగాల కోసం అవి మాతృదేశంపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. కానీ, వైరస్ ప్రభావం శాంసంగ్‌పై తక్కువే ఉండనుంది. ఎందుకంటే అధిక శాతం మొబైల్ ఫోన్లను ఈ సంస్థ నోయిడాలోని కేంద్రంలోనే తయారు చేస్తోంది. పైగా 2018లో తయారీ సామర్థ్యాన్ని కూడా గణనీయంగా పెంచుకుంది. అంతకుముందు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 68 మిలియన్ యూనిట్లుగా ఉంటే, 120 మిలియన్ యూనిట్లకు విస్తరించింది. ఇక విడిభాగాలను కూడా స్థానికంగానే సమీకరించుకుంటోంది. అలాగే, వియత్నాంలో భారీ తయారీ కేంద్రం కూడా కలిగి ఉంది. ''చైనా సంస్థలతో పోలిస్తే శాంసంగ్ కార్యకలాపాలు ఎన్నో ఖండాల్లో విస్తరించి ఉన్నాయి. కనుక అతిపెద్ద నిల్వలను కలిగి ఉంటుంది. చైనా నుంచి సరఫరా పరంగా ఉన్న ఇబ్బందులు మొదటి త్రైమాసికంలో శాంసంగ్‌కు కలసి రానున్నాయి'' అని ప్రముఖ తయారీ కంపెనీగా కొరియా, ఇతర ప్రాంతాల నుంచి విడిభాగాలను సమీకరించుకుంటుంది. దీంతో కంపెనీ సరఫరా పరంగా చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి.

టీవీ రేట్లకు రెక్కలు..!!

- 10 శాతం దాకా పెరగనున్న ధరలు
- మార్చి నుంచే అమల్లోకి
- కరోనా దెబ్బతో ప్యానళ్ల కొరతే కారణం

న్యూఢిల్లీ: టీవీలకు కూడా కరోనా వైరస్ (కోవిడ్-19) సెగ తగలనుంది. టీవీల్లో కీలకమైన ఓపెన్ సెల్ టెలివిజన్ ప్యానళ్ల సరఫరా తగ్గి, కొరత పెరిగిపోతుండటంతో మార్చి నుంచి రేట్లు 10 శాతం దాకా ఎగియనున్నాయి. ప్రధానమైన ఈ భాగాన్ని దేశీ సంస్థలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. టీవీ యూనిట్ రేటులో దాదాపు 60 శాతం భాగం టీవీ ప్యానళ్లదే ఉంటుంది. చైనా కొత్త సంవత్సరం సెలవులను దృష్టిలో ఉంచుకుని చాలామటుకు కంపెనీలు ముందస్తుగానే వీటిని నిల్వ చేసుకున్నాయి. కానీ ఊహించని విధంగా కరోనా వైరస్ ప్రభావంతో ప్యానళ్ల కొరత ఏర్పడింది. చైనాలో కొన్ని ఫ్యాక్టరీలు తిరిగి తెరుచుకున్నప్పటికీ, అర కొర సిబ్బందితోనే పనిచేస్తున్నాయి. దీంతో ప్యానళ్ల ధరలు దాదాపు 20 శాతం దాకా పెరిగినట్లు పరిశ్రమవర్గాలు తెలిపాయి. 'చైనాలో కరోనా వైరస్ సంక్షోభం వల్ల ముడిసరుకులకు భారీ కొరత నెలకొంది. ఓపెన్ సెల్ ప్యానళ్ళ ధరలు ఏకంగా 20 శాతం ఎగిశాయి. దీంతో మార్చి నాటికి టీవీల ధరలు 10 శాతం మేర పెరగనున్నాయి' అని ఎస్‌పీఐఎల్ సీఈవో అవ్‌నీత్ సింగ్ మార్వా చెప్పారు. భారత్‌లో థామ్సన్ టీవీలకు ఈ సంస్థ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ లైసెన్సీగా వ్యవహరిస్తోంది. టీవీ ప్యానళ్ల కొరత కారణంగా టీవీల రేట్లూ పెరగవచ్చని పానాసోనిక్ ఇండియా సీఈవో మనీష్ శర్మ తెలిపారు. 'పరిస్థితి మెరుగుపడితే ఏప్రిల్ నుంచి రేట్లు స్థిరంగానైనా ఉండవచ్చు లేదా ఇదే ధోరణి కొనసాగితే 3-5% దాకా పెరగవచ్చు' అని చెప్పారు.

ఫ్రిజ్‌లు.. ఏసీలు కూడా.. రాబోయే వారాల్లో ఫ్రిజ్‌లు, ఏసీల ధరలు కూడా పెరుగుతాయని హయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎరిక్ బ్రగాంజా చెప్పారు. 'మార్చి ప్రారంభం నుంచి టీవీల రేట్లు పెరుగుతాయి. ఆ తర్వాత ఫ్రిజ్‌లు, ఏసీల ధరలూ పెరుగుతాయి. డీప్ ఫ్రీజర్ల రేట్లు ఇప్పటికే 2.5 శాతం పెరిగాయి' అని ఆయన చెప్పారు. చాలా కంపెనీలు ఏసీ, రిఫ్రిజిరేటర్లకు అవసరమైన కంప్రెసర్లను ఎక్కువగా చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి.

మరో 3 నెలల్లో సాధారణ స్థాయికి... ఉత్పత్తి, సరఫరా మళ్లీ సాధారణ స్థాయికి రావాలంటే కనీసం ఒక త్రైమాసికమైనా పడుతుందని మార్వా వివరించారు. కన్సల్టెన్సీ సంస్థ ఫ్రాస్ట్ అండ్ సలివాన్, పరిశ్రమ సమాఖ్య సీఈఏఎంఏ అధ్యయనం ప్రకారం.. 2018-19లో 1.75 కోట్ల యూనిట్లుగా ఉన్న టీవీ మార్కెట్ 2024-25 నాటికి 2.84 కోట్లకు చేరగలదని అంచనా. టీవీలో కీలకమైన ఓపెన్ సెల్ ప్యానల్, చిప్స్ ప్రధానంగా చైనాతో పాటు తైవాన్, థాయ్‌లాండ్, వియత్నాం వంటి మార్కెట్ల నుంచి దిగుమతవుతున్నాయి. భారత్‌లో అసెంబ్లింగ్ మాత్రమే జరుగుతోంది. దేశీ తయారీని ప్రోత్సహించేందుకు, టీవీల ఖరీదును తగ్గించేందుకు ఓపెన్ సెల్ ప్యానళ్లపై కేంద్రం దిగుమతి సుంకాలను తొలగించిందని నివేదిక వివరించింది.

భారత మార్కెట్లో 'గెలాక్సీ జెడ్ ఫ్లిప్'

న్యూఢిల్లీ: శాంసంగ్.. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ 'గెలాక్సీ జెడ్ ఫ్లిప్'ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. గత వారంలోనే అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో తన ఆల్ట్రా-ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ను ప్రదర్శించిన కంపెనీ.. ఇక్కడ మార్కెట్లో దీన్ని గురువారం విడుదలచేసింది. ధర రూ. 1.10 లక్షలు కాగా, రెండు యాప్‌లను ఒకేసారి తెరవగలిగే సౌలభ్యం ఇందులో ఉందని, సాంకేతిక ఆవిష్కరణలో మైలురాయిగా నిలిచి

జీఎంఆర్‌లో ఫ్రాన్స్ సంస్థకు వాటాలు

- ఎయిర్‌పోర్ట్ వ్యాపారంలో 49% కొనుగోలు చేయనున్న గ్రూప్ ఏడీపీ
- డీల్ విలువ రూ. 10,780 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫ్రాన్స్‌కు చెందిన గ్రూప్ ఏడీపీ తమ ఎయిర్‌పోర్ట్ వ్యాపార విభాగంలో 49 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్లు జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్లడించింది. ఈ డీల్ విలువ రూ. 10,780 కోట్లు ఉంటుందని పేర్కొంది. దీని ప్రకారం జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) విలువ సుమారు రూ. 22,000 కోట్లుగా ఉండనుంది. నిర్దిష్ట మైలురాళ్లను సాధించిన పక్షంలో మరో రూ. 4,475 కోట్లు లభించగలవని, దీంతో మొత్తం వేల్యుయేషన్ రూ. 26,475 కోట్ల స్థాయిలో ఉండగలదని జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. డీల్ ప్రకారం జీఎంఆర్ గ్రూప్ నుంచి రూ. 9,780 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేయనున్న గ్రూప్ ఏడీపీ.. మరో రూ. 1,000 కోట్లు ఈక్విటీ కింద జీఏఎల్‌లో ఇన్వెస్ట్ చేయనుంది. 'తొలి విడతలో రూ. 5,248 కోట్లు తక్షణమే జీఎంఆర్ గ్రూప్‌కు లభిస్తాయి. రుణభారాన్ని మరింత తగ్గించుకునేందుకు ఈ నిధులను వినియోగించనున్నాం' అని జీఎంఆర్ గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. ఒప్పందం ప్రకారం.. ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగంపై జీఎంఆర్‌కు నియంత్రణ కొనసాగుతుంది. ఏడీపీకి జీఏఎల్,కీలక అనుబంధ సంస్థల బోర్డుల్లో ప్రాతినిధ్యం, ఇతర హక్కులు లభిస్తాయి. మరిన్ని అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశించేందుకు గ్రూప్ ఏడీపీతో భాగస్వామ్యం దోహదపడగలదని జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ జీఎం రావు తెలిపారు. మరోవైపు, తమ వ్యూహంలో భాగంగానే జీఏఎల్‌లో వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు గ్రూప్ ఏడీపీ చైర్మన్ అగస్టిన్ డి రొమానెట్ పేర్కొన్నారు.

33.6 కోట్ల ప్రయాణికులు.. జీఏఎల్, గ్రూప్ ఏడీపీ కలిసి 2019లో దాదాపు 33.65 కోట్ల మంది ప్రయాణికులను హ్యాండిల్ చేసినట్లు జీఎంఆర్ పేర్కొంది. ఇది ప్రపంచంలోనే అత్యధికమని వివరించింది. గ్రూప్ ఏడీపీ సంస్థ.. విమానాశ్రయాల అభివృద్ధి, నిర్వహణ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది. ప్యారిస్‌లోని చార్లెస్ డి గాల్, ఒర్లి మొదలైనవి వీటిలో ఉన్నాయి.

రూ.1,075 కోట్లు సమీకరించిన జీఎంఆర్ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అనుబంధ కంపెనీ ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్.. సీనియర్ సెక్యూర్డ్ నోట్స్ జారీ ద్వారా రూ.1,075 కోట్లు సమీకరించినట్లు జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ గ్రంధి కిరణ్ కుమార్ తెలిపారు.

మార్చి 2 నుంచి ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ

- ఇష్యూ సైజు రూ.9,000 కోట్లు
- ప్రైస్ బాండ్ రూ.750-755 !
- వచ్చే నెల 16న లిస్టింగ్ !

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్‌ల విభాగం, ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) వచ్చే నెల 2 నుంచి ఆరంభం అవుతుంది. అదే నెల 5న ముగిసే ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.9,000 కోట్లు సమీకరిస్తుందని అంచనా. ఈ ఐపీఓలో భాగంగా రూ.500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. అంతే కాకుండా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) విధానంలో 13 కోట్లకు పైగా షేర్లను విక్రయిస్తారు. దీంట్లో ఎస్‌బీఐ 3.7 కోట్లు, కార్లైల్ గ్రూప్ 9.3 కోట్ల షేర్లను విక్రయిస్తాయి.

మార్కెట్ లాట్‌గా 19 షేర్లను నిర్ణయించారు. ఈ ఐపీఓకు ప్రైస్ బాండ్ రూ.750-755గా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎస్‌బీఐ ఉద్యోగులకు 15 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.

జీఎమ్‌పీ రూ.320-330 వచ్చే నెల 16న ఈ కంపెనీ స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం జీఎమ్‌పీ (గ్రే మార్కెట్ ప్రీమియమ్) రూ.320-330 రేంజ్‌లో ఉందని సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే అతి పెద్ద ఐపీఓ కానున్నది. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, డీఎస్‌పీ మెరిల్ లించ్, నొమురా ఫైనాన్షియల్ అడ్వైజరీ, హెచ్‌ఎస్‌బీసీ సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ వ్యవహరిస్తున్నాయి.

ఎస్‌బీఐ కార్డ్స్ కంపెనీలో ఎస్‌బీఐకు 76 శాతం, కార్లైల్ గ్రూప్‌నకు 24 శాతం చొప్పున వాటాలున్నాయి. ఐపీఓలో భాగంగా 10 శాతం వాటాకు సమానమైన షేర్లను కార్లైల్ గ్రూప్, 4 శాతం వాటాకు సమానమైన షేర్లను ఎస్‌బీఐ విక్రయిస్తున్నాయి. దేశంలో అత్యధికంగా క్రెడిట్ కార్డులు జారీ చేసిన రెండో అతి పెద్ద కంపెనీగా ఎస్‌బీఐ కార్డ్స్ నిలిచింది. మన దేశ క్రెడిట్ కార్డ్‌ల మార్కెట్లో ఈ కంపెనీ వాటా 18 శాతం. ఈ కంపెనీ వినియోగదారులు 90 లక్షలకు పైగా ఉన్నారు.

ఈ కంపెనీ ఐపీఓ వివరాలు వెల్లడైన నేపథ్యంలో ఈ కంపెనీ అత్యధిక వాటా ఉన్న ఎస్‌బీఐ షేర్ లాభపడింది. బీఎస్‌ఈలో 2.3 శాతం లాభంతో రూ.328 వద్ద ముగిసింది.

జనవరిలో తగ్గిన ప్యాసింజర్ వాహన విక్రయాలు

రిజిస్ట్రేషన్ల ఆధారంగా వెల్లడించిన ఎఫ్ఏడీఏ

న్యూఢిల్లీ: దేశీ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఈ ఏడాది జనవరిలో తగ్గుదలను నమోదుచేసినట్లు ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (ఎఫ్ఏడీఏ) వెల్లడించింది. గతనెల్లో 2,90,879 యూనిట్ల విక్రయాలు నమోదుకాగా, అంతక్రితం ఏడాది ఇదే కాలంలోని 3,04,929 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే 4.61% క్షీణత ఉన్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1,432 ప్రాంతీయ రవాణా కార్యాలయాలు(ఆర్‌టీఓ) ఉండగా.. 1,223 ఆర్‌టీఓల్లో నమోదైన వాహన రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఈ డేటాను రూపొందించినట్లు వెల్లడించింది. ద్విచక్ర వాహన విక్రయాలు 8.82% క్షీణతతో 12,67,366 యూనిట్లుగా నమోదుకాగా, వాణిజ్య వాహనాలు 6.89% తగ్గి 82,187 యూనిట్లుగా ఉన్నాయి.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...
- ఈ లార్జ్‌క్యాప్స్ మీ పోర్టుఫోలియోలో ఉన్నాయా?
- టెస్లా.. వాల్‌స్ట్రీట్ నయా బుల్!
- మల్టీప్లెక్స్ షేర్లు సూపర్ హిట్- ఎందుకంటే?
- అంతర్జాతీయ బ్రోకరేజ్‌ల నుంచి 4 స్టాక్ రికమెండేషన్లు

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
WWW.BUSINESS.SAKSHI.COM

టెలికంలో అసాధారణ సంక్షోభం..

- ఏజీఆర్ బాకీల చెల్లింపులపై సుప్రీం ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం
- భారతి ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్ వెల్లడి
- కేంద్ర టెలికం మంత్రి రవి శంకర్ ప్రసాద్‌తో భేటీ



న్యూఢిల్లీ: సవరించిన స్థూల ఆదాయాల (ఏజీఆర్) ప్రాతిపదికన టెల్కోలు భారీ బకాయిలు కట్టాల్సి రావడం .. టెలికం పరిశ్రమలో గతంలో ఎన్నడూ చూడని విధంగా, అసాధారణ సంక్షోభం తలెత్తిందని భారతి ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్ వ్యాఖ్యానించారు. అయితే, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం బాకీలను కట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని, సాధ్యమైనంత త్వరగా మిగతా చెల్లింపులు జరుపుతామని ఆయన చెప్పారు. తమకు మార్చి 17 దాకా సమయం ఉన్నప్పటికీ.. ఈలోగానే కట్టేస్తామని వివరించారు. గురువారం కేంద్ర టెలికం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో భేటీ అయిన తర్వాత మిట్టల్ ఈ విషయాలు తెలిపారు. భేటీ సందర్భంగా పరిశ్రమపై భారీ పన్నుల భారం ఉంటోందని, వీటిని తగ్గించాలని ఆయన కోరారు.

మరో రూ. 1,000 కోట్లు కట్టిన వొడాఫోన్ ఏజీఆర్ బకాయిల కింద టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా గురువారం మరో రూ. 1,000 కోట్లు.. టెలికం శాఖకు (డాట్) చెల్లించింది. సోమవారమే కంపెనీ 2,500 కోట్లు కట్టిన సంగతి తెలిసిందే. వొడాఫోన్ ఐడియా మొత్తం రూ. 53,000 కోట్ల బాకీలు కట్టాల్సి ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు, టాటా టెలీసర్వీసెస్ నుంచి మిగతా బాకీల వసూలుకు ఒకటి.. రెండు రోజుల్లో నోటీసులు పంపించనున్నట్లు వివరించాయి. డాట్ లెక్కల ప్రకారం టాటా టెలీ సర్వీసెస్ దాదాపు రూ. 14,000 కోట్లు కట్టాల్సి ఉండగా..ఆ సంస్థ సోమవారం నాడు రూ. 2,197 కోట్లు మాత్రమే కట్టింది.

ఏజీఆర్ లెక్కల మదింపులో కేంద్రం.. ఇక ఏజీఆర్ బాకీలు డాట్ చెబుతున్న దానికంటే చాలా తక్కువగా ఉంటాయని టెల్కోలు చెబుతున్న నేపథ్యంలో టెలికం శాఖ ఈ అంశంపై దృష్టి సారించింది. మార్చి 17లోగా టెల్కోల లెక్కలను టెలికం శాఖ మదింపు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అన్ని టెల్కోల గణాంకాలను టెస్ట్ చెక్ చేయనున్నప్పటికీ.. మొత్తం బాకీలు కట్టేశామంటున్న సంస్థలతో ముందుగా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు వివరించాయి. డాట్ సొంత లెక్కలు, టెల్కోల లెక్కలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను కనిపెట్టేందుకు ఇది ఉపయోగపడనుంది. టెలికం సంస్థలు కట్టాల్సిన లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం యూసేజీ చార్జీలను లెక్కించేందుకు టెలికంయేతర కార్యకలాపాల ద్వారా కూడా వచ్చిన ఆదాయాలను పరిగణనలోకి తీసుకోవచ్చంటూ డాట్‌కు అనుకూలంగా సుప్రీం కోర్టు గతేడాది ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం టెలికం సంస్థలు ఏకంగా రూ. 1.47 లక్షల కోట్లు కట్టాల్సి రానుంది. గతంలో విధించిన జనవరి 23 డెడ్‌లైన్‌ను టెల్కోలు ఉల్లంఘించడంపై ఆగ్రహించిన సుప్రీం కోర్టు తాజాగా దీనిపై విచారణను మార్చి 17కి వాయిదా వేసింది.

అందరికీ ప్రయోజనంపై కేంద్రం దృష్టి.. ఏజీఆర్ బాకీల విషయంలో అటు సుప్రీం కోర్టు ఆదేశాలు అమలు చేస్తూనే.. ఇటు టెలికం రంగం.. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. టెలికం సంస్థలు ఇప్పటిదాకా రూ. 16,000 కోట్ల ఏజీఆర్ బాకీలు చెల్లించినట్లు వివరించాయి. మరో 7-8 రోజుల్లో మరిన్ని చెల్లింపులు జరుపుతామని టెల్కోలు చెప్పాయని ఓ అధికారి పేర్కొన్నారు.

టెల్కోల బాకీల్లో వడ్డీ, పెనాల్టీలే అధికం..

టెలికం సంస్థలు లైసెన్సు ఫీజు బాకీల కింద కట్టాల్సినది రూ. 22,589 కోట్లని.. అయితే వడ్డీ, పెనాల్టీలు కలిపితే ఇది రూ. 92,641 కోట్లకు పెరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు కట్టాల్సినది రూ. 16,746 కోట్లు ఉంటుందని పేర్కొన్నాయి. భారతి ఎయిర్‌టెల్ బాకీలు రూ. 5,529 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ. 6,871 కోట్లు, టాటా గ్రూప్ రూ. 2,321 కోట్లు, టెలినార్ (ప్రస్తుతం ఎయిర్‌టెల్‌లో విలీనమైంది) రూ. 529 కోట్లు, బీఎస్ఎన్ఎల్ రూ. 614 కోట్లు, ఎంటీఎన్ఎల్ బకాయిలు రూ. 876 కోట్లు ఉంటాయని వివరించాయి. ఈ లెక్కలను జూలైలో తయారు చేశారని, తాజాగా మరోసారి లెక్కింపు ప్రక్రియ జరుగుతోందని ఓ అధికారి తెలిపారు. డాట్ లెక్కల ప్రకారం లైసెన్సు ఫీజుతో పాటు టెలికం సంస్థలు దాదాపు రూ. 55,054 కోట్ల మేర స్పెక్ట్రం యూసేజి చార్జీలు కూడా కట్టాల్సి ఉంది.

ప్యానాసోనిక్ నుంచి నూతన శ్రేణి ఏసీలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ప్యానాసోనిక్ 2020 సంవత్సరానికిగాను కొత్త ఎయిర్ కండీషనర్లను ప్రవేశపెట్టింది. మొత్తం 55 ఏసీలను అందుబాటులోకి తేగా.. వీటిలో ఇంటర్నెట్‌తో పనిచేసే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మిరాయ్ శ్రేణి కనెక్టెడ్ మోడళ్లు 30 దాకా ఉన్నాయి. ఏసీ ఉష్ణోగ్రత ఏ సమయంలో ఎంత ఉండాలో నిర్దేశించవచ్చు. ఇన్‌బిల్ట్ ఎయిర్ ప్యూరిఫయర్‌తోపాటు బ్యాక్టీరియాను తొలగించే సాంకేతికత ఉంది. 45 అడుగుల వరకు గాలి వీస్తుంది. పీసీబీపై 5 ఏళ్లు, కంప్రెసర్‌పై 10 ఏళ్ల వారంటీ ఆఫర్ చేస్తోంది. ధరల శ్రేణి రూ.35 వేలు మొదలుకుని రూ.2.5 లక్షల వరకు ప్రవేశపెట్టామని ప్యానాసోనిక్ ఎయిర్ కండీషనింగ్ గ్రూప్ బిజినెస్ హెడ్ గౌరవ్ సాహా గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. '2019లో దేశవ్యాప్తంగా అన్ని కంపెనీలవి కలిపి 70 లక్షల ఏసీలు అమ్ముడయ్యాయి. ఇందులో ప్యానాసోనిక్ వాటా 6 శాతం. ఈ ఏడాది 77 లక్షల ఏసీలు విక్రయం అవుతాయన్న అంచనా ఉంది. కంపెనీ 10 శాతం వాటా లక్ష్యంగా చేసుకుంది' అని వివరించారు.

మళ్లీ నష్టాలు

- అంతంతమాత్రంగా అంతర్జాతీయ సంకేతాలు
- 153 పాయింట్ల పతనంతో 41,170కు సెన్సెక్స్
- 45 పాయింట్లు నష్టపోయి 12,081కు నిఫ్టీ

అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండటంతో గురువారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం పతనం కావడం, విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరిస్తుండటం ప్రతికూల ప్రభావం చూపించాయి. ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 153 పాయింట్లు పతనమై 41,170 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 45 పాయింట్లు నష్టపోయి 12,081 పాయింట్ల వద్ద ముగిశాయి. ఈ వారంలో సెన్సెక్స్ 87 పాయింట్లు, నిఫ్టీ 33 పాయింట్లు పతనమయ్యాయి.

266 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాల్లో ఆరంభమైనప్పటికీ, ఆ వెంటనే నష్టాల్లోకి జారిపోయింది. నిఫ్టీ వీక్లీ డెరివేటివ్స్ కాంట్రాక్టుల చివరి రోజు కావడంతో చివరి గంట వరకూ లాభ, నష్టాల మధ్య దోబూచులాడింది. చివరి గంటలో నష్టాలు పెరిగాయి. ఒక దశలో 77 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ మరో దశలో 189 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 266 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. కోవిడ్-19(కరోనా) వైరస్ సోకి మరణించిన వారి సంఖ్య చైనాలో 2,118కు పెరిగింది. కొత్త కేసులు తగ్గాయి. అయితే దక్షిణ కొరియా ఇతర దేశాల్లో వైరస్ సోకిన వ్యక్తుల సంఖ్య పెరిగింది. అంతే కాకుండా ఈ వైరస్ కారణంగా ఆర్థికంగా సంభవించే నష్టాల ఆందోళనలు తగ్గకపోవడంతో ప్రపంచ మార్కెట్లు పతనమయ్యాయి.

ఆగని ఐఆర్‌సీటీసీ జోరు

ఐఆర్‌సీటీసీ షేరు జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.1,976ని తాకింది. చివరకు 5% లాభంతో రూ.1,928 వద్ద ముగిసింది. ఇక ఎమ్ఎస్‌టీసీ, ఓల్టాస్, పీవీఆర్, అదానీ గ్యాస్, అపోలో హాస్పిటల్స్, బజాజ్ ఫైనాన్స్, దివీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐనాక్స్ లీజర్, జేకే సిమెంట్స్, ముత్తూట్ ఫైనాన్స్, ట్రెంట్, ఎస్ఆర్ఎఫ్ షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి.

- షేర్ల బైబ్యాక్ వార్తలతో థామస్ కుక్ షేర్ 20 శాతం ఎగసి రూ.49 వద్ద ముగిసింది.
- గ్రూప్ కంపెనీల్లో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోలేదని తేలడంతో ఇండియాబుల్స్ గ్రూప్ షేర్లు 11 శాతం మేర ర్యాలీ జరిపాయి.

నేడు సెలవు

మహాశివరాత్రి సందర్భంగా నేడు (శుక్రవారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడింగ్ జరగదు.

అదానీ గ్యాస్‌లో వాటా విక్రయానికి ఆమోదం

న్యూఢిల్లీ: మాతృసంస్థ నుంచి విడిపోవడానికి(డీ మెర్జ్) అదానీ గ్యాస్‌కు ఆమోదం లభించింది. అంతేకాకుండా ఈ కంపెనీలో కొంత వాటాను ఫ్రాన్స్ చమురు దిగ్గజం టోటల్ కంపెనీకి విక్రయించడానికి కూడా పీఎన్‌జీఆర్‌బీ పచ్చజెండా ఊపింది. డీ మెర్జర్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించలేదంటూ గత ఏడాది నవంబర్‌లో ఒక షోకాజ్ నోటీసును పీఎన్‌జీఆర్‌బీ(పెట్రోలియమ్ అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డ్) జారీ చేసింది. నిబంధనలకు అనుగుణంగానే అన్ని వివరాలను వెల్లడించామని అదానీ గ్యాస్ స్పందించడంతో ఈ నోటీసును పీఎన్‌జీఆర్‌బీ వెనక్కి తీసుకుంది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	42,370	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	40,350	▲ 250
వెండి (కిలో)	51,600	▼ 200
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	41,770	▲ 140
బంగారం (22 క్యారెట్లు)	39,780	▲ 130
వెండి (కిలో)	51,600	▼ 200
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	41,750	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	38,660	▲ 240
వెండి (కిలో)	48,700	▲ 160
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	42,600	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	39,510	▲ 30
వెండి (కిలో)	49,500	▲ 500
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	42,990	▲ 80
బంగారం (22 క్యారెట్లు)	39,780	▲ 130
వెండి (కిలో)	49,000	▲ 200

గమనిక: గీట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	54.03 (రాత్రి 11.30కు)	$ 53.49 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	59.56 (రాత్రి 11.30కు)	$ 59.12 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 21-2-2020

విశాఖ	390-00
చిత్తూరు	403-00
వరంగల్	343-00
విజయవాడ	355-00
గోదావరి	355-00
20-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	340-00

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,676
ఎన్ఎస్ఈ	43,923
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	33,14,285
ఎఫ్ఐఐ	1,495
డీఐఐ	-700

వచ్చే ఏడాది డ్రూమ్ ఐపీఓ అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్!

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ మార్కెట్ ప్లేస్ డ్రూమ్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) వచ్చే ఏడాది రానున్నది. ఐపీఓకు రాకముందే 15 కోట్ల డాలర్ల నిధులను సమీకరిస్తామని డ్రూమ్ వ్యవస్థాపకులు, సీఈఓ కూడా అయిన సందీప్ అగర్వాల్ వెల్లడించారు. ఈ ఏడాది చివరికల్లా లాభాల్లోకి వస్తామని పేర్కొన్నారు. తమ ప్లాట్‌ఫార్మ్‌పై గత ఏడాది 120 కోట్ల డాలర్ల విలువైన వస్తువుల వ్యాపారం జరిగిందని, 3.2 కోట్ల నికర రాబడిని ఆర్జించామని తెలిపారు.

హైదరాబాద్‌లో గోద్రెజ్ 'సోషల్ ఆఫీస్'

అనిల్ మాథుర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫర్నీచర్ రంగ సంస్థ గోద్రెజ్ ఇంటీరియో దక్షిణాదిన తొలి 'సోషల్ ఆఫీస్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. కొండాపూర్‌లో 4,100 చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొన్న ఈ కేంద్రంలో కార్యాలయాలకు అవసరమయ్యే అత్యాధునిక ఫర్నీచర్ అందుబాటులో ఉంటుందని గోద్రెజ్ ఇంటీరియో సీవోవో అనిల్ మాథుర్ గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. 'ఇప్పటికే ముంబై, కోల్‌కతలో ఇటువంటి సెంటర్లను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. బెంగళూరు, పుణే, చెన్నై, చండీగఢ్‌లోనూ తెరవనున్నాం. రెండు మూడేళ్లలో ఈ విభాగం నుంచి రూ.200 కోట్ల ఆదాయం ఆశిస్తున్నాం. గోద్రెజ్ ఇంటీరియో 2018-19లో రూ.2,000 కోట్ల టర్నోవర్ సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,400 కోట్లు, 2020-21లో రూ.3,000 కోట్లు లక్ష్యంగా చేసుకున్నాం' అని వివరించారు.

హైదరాబాద్‌లో సీజీఎస్ నూతన కార్యాలయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికాకు చెందిన సాంకేతిక రంగ కంపెనీ కంప్యూటర్ జనరేటెడ్ సొల్యూషన్స్ (సీజీఎస్) హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం 500 మంది ఉద్యోగులున్నారు. ఏడాదిన్నరలో 800 మందికి, ఐదేళ్లలో 2 వేల మంది ఉద్యోగులను నియమించుకుంటామని ప్రెసిడెంట్ అండ్ సీఈఓ ఫిలిప్ ఫ్రైడ్‌మన్ తెలిపారు. త్వరలోనే ఈ సెంటర్‌లో సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ (సీఎస్ఓఎస్)ను కూడా నెలకొల్పుతామని.. ఇందులో ఆగ్యుమేటెడ్ రియాలిటీ (ఏఐ) ఆధారిత సేవలందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, సైయంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, యూఎస్ కాన్సులేట్ జనరల్ జోయిల్ రీఫ్‌మన్, సీజీఎస్ ప్రెసిడెంట్ అండ్ సీఈఓ ఫిలిప్ ఫ్రైడ్‌మన్, సీజీఎస్ ఇండియా ఎండీ జీతు భట్టు గురువారం సీజీఎస్ హైదరాబాద్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ సెంటర్ నుంచి మా కస్టమర్లకు ఆర్ అండ్ డీ, అప్లికేషన్ డెవలప్‌మెంట్, కస్టమర్‌కేర్ సెంటర్ సేవలను అందిస్తున్నామని. మైక్రోసాఫ్ట్, ఐబీఎం, డెల్, ఏటీఅండ్‌టీ, అవయ, తోషిబా, రెమాండ్స్ వంటి కంపెనీలు మా కస్టమర్లుగా ఉన్నారని పేర్కొన్నారు. దేశంలోని టాప్ టెక్నాలజీ కంపెనీ కాల్‌సెంటర్‌ను ఈ సెంటర్ నుంచే నిర్వహిస్తున్నామని చెప్పారు. సీజీఎస్ గ్లోబల్‌కు యూఎస్, యూకే, కెనడా, ఇజ్రాయిల్, రొమానియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో కార్యాలయాలున్నాయి. 45 దేశాల్లో ఫ్యాషన్, అపెరల్, ఈ- కామర్స్, హెల్త్‌కేర్, రిటైల్ వంటి పరిశ్రమలకు ఎంటర్‌ప్రైజెస్ సొల్యూషన్స్‌ను అందిస్తుంది. ప్రస్తు తం 8 వేల మంది ఉద్యోగులున్నారని.. ఈ ఏడాది ముగింపు నాటికి 10 వేల మందికి చేరుకుంటామని తెలిపారు.

థాయ్‌ల్యాండ్‌లో రికార్డు ఐపీవో

బ్యాంకాక్: థాయ్‌ల్యాండ్‌కి చెందిన రిటైల్ దిగ్గజం సెంట్రల్ రిటైల్ కార్పొరేషన్ (సీఆర్‌సీ) ఆ దేశ చరిత్రలోనే అతి పెద్ద ఐపీవోకి తెరతీసింది. దాదాపు 71 బిలియన్ బాహత్‌ల (సుమారు 2.26 బిలియన్ డాలర్లు) సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూ ప్రకటించింది. దీని ప్రకారం కంపెనీ మార్కెట్ క్యాప్ దాదాపు 8.1 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండనుంది.

దూసుకెళ్తున్న ఎంజీ హెక్టార్

న్యూఢిల్లీ: హెక్టార్ ఎస్‌యూవీ వాహన విడుదలతో 8 నెలల కిందట దేశీ మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చిన బ్రిటిష్ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్.. 50,000 బుకింగ్స్ మైలురాయిని అధిగమించింది. ఈ సందర్భంగా సంస్థ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ గౌరవ్ గుప్తా మాట్లాడుతూ.. '6 సీట్లు కలిగిన హెక్టార్ ప్లస్ కారును విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది మూడవ త్రైమాసికంలో ప్రవేశపెట్టనున్నాం' అని వెల్లడించారు.

నియంత్రణ కాదు... పర్యవేక్షణ ప్రధానం: సన్యాల్

న్యూఢిల్లీ: దేశంలో నియంత్రణ కన్నా, సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరమని ప్రధాన ఆర్థిక సలహాదారు సంజీవ్ సన్యాల్ అభిప్రాయపడ్డారు. ఈ తరహా విధానం, ధోరణి వ్యవస్థలో సమర్థతను పెంచుతుందని, క్లిష్టతర సమస్యలను తగ్గిస్తుందని పేర్కొన్నారు. 'ఇబ్బందులు- అనిశ్చితి: పర్యవేక్షణ, పరిపాలన, పర్యవసానాలు'' అన్న అంశంపై ఒక చర్చా పత్రంలో సన్యాల్ మాట్లాడా రు. ''క్రియాశీల, సమర్థవంతమైన పర్యవేక్షణతో కూడిన సరళతర నియం త్రణ విధానం మంచి ప్రయోజనాలను అందిస్తుంది'' అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రెగ్యులేటరీ విధా నాలకన్నా, అత్యుత్తమ పర్యవేక్షణా విధానాల ద్వా రా ఐఎల్అండ్ఎఫ్ఎస్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం వంటి సంక్షోభాలను సైతం నివారించడం సాధ్యమయ్యేదని కూడా ఆయన అభిప్రాయపడ్డం విశేషం.

రీసర్జర్ మైన్స్ చైర్మన్, డైరెక్టర్లపై సెబీ నిషేధం

న్యూఢిల్లీ: జీడీఆర్ ఇష్యూ విషయంలో అక్రమాలకు పాల్పడిన రీసర్జర్ మైన్స్ అండ్ మినరల్స్ ఇండియా సంస్థ చైర్మన్, ఎండీ సుభాష్ శర్మ, హోల్‌టైమ్ డైరెక్టర్ అమిత్ శర్మ, నాన్ ఎగ్జిక్యూటివ్ ఇండిపెంటెండ్ డైరెక్టర్ నితిత్‌సేథిలను సెక్యూరిటీస్ మార్కెట్లలోకి ప్రవేశించకుండా సెబీ మూడేళ్ల పాటు నిషేధం విధించింది. ఈ కంపెనీ 2010లో 5.21 మిలియన్ డాలర్ల జీడీఆర్‌లను జారీ చేయడం ద్వారా 53.75 మిలియన్ డాలర్లను సమీకరించింది. ఈ జీడీఆర్‌లు అన్నింటినీ వింటేజ్ ఎఫ్‌జెడ్ఈ అనే ఒకే సంస్థ యూరోపియన్ అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్‌బ్యాంకు ఏజీ నుంచి రుణం పొందడం ద్వారా సబ్‌స్క్రయిబ్ చేసుకున్నట్టు సెబీ గుర్తించింది. వింటేజ్ సంస్థ తీసుకున్న రుణాలకు రీసర్జర్ గ్యారంటీ ఇచ్చినట్టు తేలింది. ఈ విధమైన అవగాహన ద్వారా విదేశీ ఇన్వెస్టర్ల నుంచి జీడీఆర్‌కు మంచి స్పందన వచ్చిందంటూ దేశీయ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించడమేనని సెబీ పేర్కొంది.

మార్కెట్లోకి బీఎస్-6 హోండా షైన్

ధర రూ. 67,857

ముంబై: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఎస్ఐ)... భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న 'షైన్' బైక్‌ను గురువారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 125 సీసీ ఇంజిన్ కలిగిన కొత్త వేరియంట్.. మునుపటి వెర్షన్‌తో పోల్చితే ఇంధనాన్ని 14 శాతం ఆదా చేస్తుందని ప్రకటించింది. దీని ప్రారంభ ధర రూ. 67,857 (ఎక్స్‌షోరూం, ఢిల్లీ)గా నిర్ణయించింది.

కృత్రిమ గడువులు నిర్ణయించాలని అనుకోవడం లేదు

ట్రంప్ వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ స్పందన

న్యూఢిల్లీ: వాణిజ్యం విషయంలో అమెరికాతో భారత్ సరిగ్గా వ్యవహరించడం లేదన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను భారత్ లైట్ తీసుకుంది. కృత్రిమ గడువులను భారత్ ఏర్పాటు చేసుకోవాలనుకోవడం లేదని స్పష్టం చేసింది. ట్రంప్ వ్యాఖ్యలు బ్యాలన్స్ ఆఫ్ ట్రేడ్‌కు సంబంధించి చేసినవని, ఈ విషయంలో అమెరికా ఆందోళనలను పరిష్కరించేందుకు భారత్ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవనీష్‌కుమార్ గురువారం ఢిల్లీలో మీడియాకు తెలిపారు. భారత్‌కు అమెరికా ఆరో అతిపెద్ద చమురు సమీకరణ దేశంగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే, భారీ సంఖ్యలో పౌర విమానాలను కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. అమెరికా భారత్‌కు వస్తు సేవల పరంగా అతిపెద్ద వాణిజ్య భాగస్వామ్య దేశంగా ఉందని వివరించారు. ''వాణిజ్య ఒప్పందానికి తొందరపడదలుచుకోలేదు. ఎందుకంటే ఇందులో ఎన్నో క్లిష్టమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. ఇందుకు సంబంధించి తీసుకునే నిర్ణయాల ప్రభావం పౌరులు, దేశాల ఆర్థిక ప్రయోజనాలపై దీర్ఘకాలం పాటు ఉంటుంది'' అని రవనీష్ కుమార్ వివరించారు.

రాష్ట్రీయం

గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ విఠల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కె.రామచంద్రమూర్తి, తమ్మినేని వీరభద్రం తదితరులు

డాక్టర్ విఠల్.. ధన్యజీవి

విఠల్ సంస్మరణ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్: జీవించినంత కాలం ప్రజల కోసమే పనిచేసిన ధన్యజీవి డాక్టర్ ఏపీ విఠల్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కొనియాడారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అభ్యుదయ వాదుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కమ్యూనిస్టు మేధావి, ప్రజా వైద్యుడు డాక్టర్ ఏపీ విఠల్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా విఠల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. విధానాలు, సిద్ధాంతాల పట్ల ఆయనకి ఉన్న అవగాహన ఎవరికీ లేదన్నారు. ఆయనతో స్నేహం చేయని వారు ఉండరని పేర్కొన్నారు. గురువుగా, సిద్ధాంత కర్తగా భావిస్తున్న తరుణంలోనే 'నీవు మాస్ లీడర్‌వి'అని తనకు సర్టిఫికెట్ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ విఠల్ చనిపోయేంత వరకు సీపీఎంని ప్రేమించారని పేర్కొన్నారు. మార్క్సిని మార్క్సిస్టుగా పని చేయకుండా ఏ శక్తీ ఆపలేదని చెప్పడానికి డాక్టర్ విఠల్ ఒక ఉదాహరణ అని తమ్మినేని కొనియాడారు. కొండపల్లి పవన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.రామచంద్రమూర్తి, ప్రముఖ గేయ రచయితలు గోరటి వెంకన్న, జయరాజు, టఫ్ అధ్యక్షురాలు విమలక్క, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు మన్నారం నాగరాజు, అంబేడ్కర్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ బహుదూర్, ప్రముఖ నవలా రచయిత కె.వి.కృష్ణ కుమారి, మోదుగుపూల ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, జి.రాములు, సీపీఐ నాయకుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అతిక్రమిస్తే కఠిన చర్యలు

నిబంధనలు పాటించని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ప్రభుత్వం హెచ్చరిక

ఫైర్ సేఫ్టీ విషయంలో అగ్నిమాపక శాఖ చర్యలు చేపట్టాల్సిందే

శిక్షణ సంస్థలు, అకాడమీలు అనుబంధ గుర్తింపు తీసుకోవాలి

ఇకపై కండిషనల్ అఫిలియేషన్లు ఉండవు.. సమీక్షా సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిబంధనలు పాటించని ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనలు అతిక్రమించే కాలేజీలపై చర్యలు తప్పవని పేర్కొంది. విద్యా సంస్థల భవనాలు, నిబంధనల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫైర్ సర్వీసెస్ డీజీ, హోం సెక్రెటరీ, జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, కళాశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు అధికారులు పాల్గొన్నారు. అగ్నిమాపక నిబంధనల ప్రకారం ఎన్ని కాలేజీలు ఉన్నాయి.. ఎన్ని కాలేజీలు లేవు అన్న అంశాలను తేల్చేందుకు ఆ శాఖ తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే గుర్తించిన నిబంధనలు పాటించని కాలేజీలపై ఎందుకు ఆయా శాఖలు చర్యలు చేపట్టడం లేదని చిత్రా రామచంద్రన్ ప్రశ్నించినట్లు తెలిసింది. కాలేజీలు అయినందునా తమకు సంబంధం లేదని వదిలేయకూడదని, ఎవరి శాఖ తరపున వారు నిబంధనలు పాటించని వాటిపై చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. ముందుగా ఆయా కాలేజీలకు నోటీసులు ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. అలాగే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతోనూ సమావేశం నిర్వహించి, నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనన్న విషయాన్ని స్పష్టం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

హాస్టళ్లు, అకాడమీలు బోర్డు పరిధిలోకి..

అనుమతి లేని హాస్టళ్లు, శిక్షణ సంస్థలు, ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహించే అకాడమీలను ఇంటర్ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని, అవన్నీ కచ్చితంగా బోర్డు నుంచి అనుబంధ గుర్తింపు తీసుకోవాలని నిర్ణయించారు. ఇకపై కండిషనల్ అఫిలియేషన్ల విధానం ఉండదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఫైర్ సేఫ్టీ, ఇతర నిబంధనల మేరకు లేని భవనాల నుంచి ఆయా కాలేజీలను ఇతర భవనాల్లోకి తరలించాలని యాజమాన్యాలకు తేల్చి చెప్పాలని నిర్ణయించారు. నిబంధనలు పాటించని కాలేజీలను అవసరమైతే మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

వచ్చే నెలలో అనుబంధ గుర్తింపు..

అనుబంధ గుర్తింపు కోసం వచ్చే నెలలో నోటిఫికేషన్ జారీ చేయాలని, మే నెలాఖరులోగా గుర్తింపు జారీ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. అఫిలియేషన్ల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడే సంబంధిత సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేస్తేనే దరఖాస్తు ఆమోదం పొందేలా, సర్టిఫికెట్లు లేకుంటే రిజెక్ట్ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. 2019-20 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 2,786 జూనియర్ కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం రిజిస్టర్ చేసుకోగా, 2,570 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. అందులో 1,486 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. అవికాకుండా మరో 79 ప్రైవేటు కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వలేదని, అయినా అవి కొనసాగుతున్నట్లు బోర్డు తేల్చింది. అందులో 45 కాలేజీలు రెండు ప్రముఖ విద్యా సంస్థలకు చెందినవేనని తేల్చారు. వాటికి ముందుగానే నోటీసులివ్వాలని నిర్ణయించారు.

'ఔటా సమస్యల పరిష్కారానికి కృషి'

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారం కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) ప్రతినిధులు వినోద్‌కుమార్‌ని కలిసి తమ సమస్యలపై చర్చించారు. వర్సిటీలో అధ్యాపకులు, మినిస్టీరియల్ సిబ్బంది బాగా తగ్గిపోతున్నారని వినోద్ దృష్టికి తీసుకువచ్చారు. అధ్యాపకుల వయోపరిమితిని 60 నుంచి 65 ఏళ్లకు పెంచే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ విభాగము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము
(భూసేకరణ), జోగులాంబ గద్వాల జిల్లా

ఫారం - VII
(పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) ననుసరించి)

జి.నెం. 23/19 తేది: 12-12-2019
జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల తేది: 15-01-2020
ఫైల్ నెం. సి/107/17
ప్రత్యేక ఉప కలెక్టరు తేది: 12-12-2019
ఫైల్ నెం. సి/107/07

ఈ దిగువ నిర్దిష్టపరిచిన జోగులాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలము, వాగాపురం గ్రామము విస్తీర్ణము ఎ. 1.55 సెం.లు ప్రజా ప్రయోజనం నిమిత్తము అనగా జవహరు (నెట్టింపాడు) లిఫ్ట్ ఇరిగేషన్ పథకము యొక్క కుడి ప్రధాన కాలువ ప్యాకేజి నెం. 100 నిర్మాణ నిమిత్తము అవసరమైయున్నదని భావించనైనది.

కావున జోగులాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలము, వాగాపురం గ్రామము విస్తీర్ణము ఎ. 1.55 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

క్ర. సం.	సర్వే నెం.	భూమి విధం (పట్టా/ ప్రభుత్వ ఇనాం మొ.)	భూ రకం (మెట్ట/ తరి మొ.)	భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.సెం.లు	పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు)	చెట్లు రకం/ సంఖ్య కట్టడం రకం/ విస్తీర్ణము చ.గజాలలో
1	658	పట్టా	మెట్ట	0.50	1)దాగాపురం రామారావు తండ్రి వెంకట్రావు	-
2	659	పట్టా	మెట్ట	1.00	1)దాగాపురం రామారావు తండ్రి వెంకట్రావు	-
3	700	పట్టా	మెట్ట	0.05	1) గొల్ల లక్ష్మిదేవి భర్త క్రిష్ణయ్య 2) పద్మమ్మ భర్త సదిపి క్రిష్ణ 3) గొల్ల వెంకటస్వామి తండ్రి పాన్నన్న	-
				1.55		

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013 క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో, బొగ్గు, ఇసుక, స్టేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టుకు నిర్మాణములకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించవలదును లేనిచో స్వీకరించవలదు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్, ఇవహారు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు,

మెదక్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 14 డిగ్రీలు

సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువ

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గత 24 గంటల్లో మెదక్‌లో రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువగా 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండలో సాధారణం కంటే 4.5 డిగ్రీలు తక్కువగా 16.4 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. తమిళనాడు నుంచి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. తెలంగాణలో ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో రాగల మూడ్రోజులు వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

పోలవరం ముంపు ప్రభావంపై కమిటీ

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ముంపు ప్రభావాన్ని అధ్యయనం చేయాలంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతో ఒక కమిటీ నియమిస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఏకే గోయల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించి ఈ ఆదేశాలు జారీ చేసింది.

8 ఏబీసీడబ్ల్యూవో పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బీసీ సంక్షేమ సహాయ అధికారుల (ఏబీసీడబ్ల్యూవో) పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. బీసీ సంక్షేమ శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం 8 ఏబీసీడబ్ల్యూవో పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసుకునేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రొనాల్డ్‌రాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన అన్ని వివరాలను వెంటనే టీఎస్‌పీఎస్సీకి పంపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యా వలంటీర్ల సమస్యలు పరిష్కరించండి: టీవీవీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న విద్యా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యా వాలంటీర్ల సంఘం (టీవీవీఎస్) డిమాండ్ చేసింది. గురువారం ఈ మేరకు ఆర్థిక మంత్రి హరీశ్‌రావును టీవీవీఎస్ అధ్యక్షుడు జోగినాథ్ యాదవ్ కలసి వినతి పత్రం సమర్పించారు.

గ్రైండర్‌లో బంగారం.. బయటపడిన బండారం

హైదరాబాద్: దుబాయ్ నుంచి అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. గురువారం దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి లగేజీని అధికారులు పరిశీలించారు. అందులో ఉన్న గ్రైండర్‌ను విప్పిచూడగా 149 గ్రాముల బరువు కలిగిన బంగారం బయటపడింది. దీని విలువ 6.39 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాతబస్తీ పరిణామాలపై కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా
యెమన్ పౌరుడికి పాస్‌పోర్టుపై రాష్ట్ర పోలీసులు సీరియస్

కేంద్రం నిఘా నేత్రం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని నకిలీ ధ్రువీకరణ పత్రాల అంశంలో పలు కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. 127 మంది రోహింగ్యాలకు ఆధార్ కార్డుల వ్యవహారం, విదేశీయుల వద్ద భారత పాస్‌పోర్టుల అంశాలు కలకలం రేపడంతో దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. కొందరు స్థానికులు కావాలనే వీరికి ఈ పత్రాలు ఇప్పిస్తున్నారని గుర్తించారు. ఇప్పటికే వారిని గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర ఇంటెలిజెన్స్ కూడా సమాచారం సేకరించింది. పాతబస్తీలో అక్రమంగా నివసిస్తోన్న విదేశీయుల అక్రమాలపై కేంద్ర నిఘా వర్గాలు ఎప్పటికప్పుడు ఢిల్లీకి నివేదికలు పంపుతూనే ఉన్నాయి. విదేశీయులు ఈ కార్డులు కలిగి ఉండటం వల్ల దేశభద్రతకు భంగం వాటిల్లడమే కాకుండా, ఈ కార్డులతో వేరే దేశాల్లో ఉగ్రచర్యలు, ఆత్మాహుతి దాడులకు పాల్పడితే.. ఆ నింద మన దేశం మోయాల్సి వస్తుందని పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా పరిగణిస్తోన్న పోలీసులు..

యెమన్ దేశస్తుడికి పాస్‌పోర్టు వచ్చిన విషయంపై తెలంగాణ పోలీసులు కూడా సీరియస్‌గా దృష్టి పెట్టారు. ఈ వ్యవహారంలో అంతర్గత విచారణకు ఆదేశించారని సమాచారం. చూడగానే విదేశీయుడు అని తెలిసిపోతున్నా.. యెమన్ దేశస్తుడు ముబారక్‌కు భారత పాస్‌పోర్టు ఎలా వచ్చిందనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అతని పాస్‌పోర్టు విచారణకు వెళ్లిన పోలీసు అధికారిని ప్రశ్నించేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తెలిసే తప్పు జరిగిందని, డబ్బులు తీసుకునే విచారణలో అతడికి అనుకూలంగా రిపోర్టు ఇచ్చి పాస్‌పోర్టు వచ్చేలా సహకరించారని ఉన్నతాధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. భారత ధ్రువీకరణ కార్డులతో విదేశాలకు వెళ్లి అక్కడ ఉగ్రచర్యలకు పాల్పడితే.. ఆ నింద మన దేశం మోయాల్సి ఉంటుందని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎలా తీసుకుంటున్నారంటే..?

దేశంలో అక్రమంగా చొరబడి నగర శివార్లలో తలదాచుకుంటున్న వేలాది మందికి పాతబస్తీలో పలువురు ఆశ్రయం కల్పిస్తున్నారు. వీరిలో పలువురు కాంట్రాక్టర్లు, చిన్న చిన్న పరిశ్రమల నిర్వాహకులు ఉన్నారు. తమ ఖార్ఖానాల్లో తక్కువ జీతానికి వీరిని పెట్టుకుంటున్నారు. రాత్రి పూట సంచరించే సమయంలో, తరచుగా శివారు కాలనీల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ చేస్తున్నప్పుడు ధ్రువీకరణ పత్రాలు అడుగుతుండటం ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆశ్రయం కల్పించిన నిర్వాహకులే తమ ఇంటి కరెంటు బిల్లులు ఇచ్చి ఓటరు, ఆధార్, పాన్ తదితర ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తున్నారు. పాతబస్తీలో డబ్బులు తీసుకుని పనిచేసే కొందరు ఏజెంట్లు కూడా ఈ తతంగానికి సహకరిస్తున్నారు.

పౌరసత్వం వచ్చినట్లు కాదు

ఆధార్, పాన్, ఓటరు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉన్న విదేశీయులను ఇప్పటికే పదుల సంఖ్యలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టారు. ఈ గుర్తింపు కార్డులతో భారతీయులు అయిపోరని చెబుతున్నారు. తప్పుడు సమాచారంతో కార్డులు పొందడం, వారికి సహకరించడం నేరమన్న సంగతిని మరవొద్దని హెచ్చరిస్తున్నారు.

'కుప్పం' గ్యాంగ్ చిక్కింది

- బ్యాంకుల డబ్బు డ్రా చేసిన వృద్ధులే వీరి టార్గెట్
- వారి దృష్టి మళ్లించి తస్కరించే ఘరానా గ్యాంగ్
- మొత్తం నలుగురు నిందితుల్లో ఇద్దరు అరెస్టు

సీసీ కెమెరాలకు చిక్కిన నిందితులు

సాక్షి, హైదరాబాద్: బ్యాంకు నుంచి నగదు డ్రా చేసిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టి మళ్లించి ఆ డబ్బుల్ని దొంగిలించే ఓజీ కుప్పం గ్యాంగ్ నగర పోలీసులకు చిక్కింది. హైదరాబాద్ సహా దక్షిణాదిలోని అనేక నగరాలు, పట్టణాల్లో తమ పనికానిచ్చింది. నలుగురున్న ఈ గ్యాంగులో ఇద్దరిని పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.9.4 లక్షల నగదు, నాలుగు బైక్‌లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్, డీసీపీ పి.రాధాకిషన్‌రావుతో కలసి గురువారం మీడియాకు వెల్లడించారు.

రైళ్లలో వాహనాలతో సహా వచ్చి..

ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలో తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఓరన్ ధంగల్ గొల్ల కుప్పంను ఓజీ కుప్పంగా పిలుస్తారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం 20 మంది నేరగాళ్లు 12 గ్యాంగ్‌లుగా పని చేస్తున్నారు. గ్యాంగ్ లీడర్లు మినహా సభ్యులు ఒక్కోసారి ఒక్కో గ్యాంగ్‌లో కలిసి 'పని'కి వెళ్తుంటారు. తెలుగు, తమిళం బాగా, హిందీ ఓ మోస్తరుగా తెలిసిన వీళ్లు దక్షిణాదినే లక్ష్యంగా చేసుకుంటారు. ఓ నగరం /పట్టణాన్ని టార్గెట్‌గా చేసుకుని వారంతా ఆ ప్రాంతానికి బైక్‌లు తీసుకుని బయల్దేరతారు. లక్ష్యంగా చేసుకున్న ప్రాంతానికి వాహనాలను రైల్వే పార్సల్ ద్వారా తాము వెళ్లే రైల్లోనే తీసుకువస్తారు. అక్కడకు చేరుకుని లాడ్జిల్లో లేదా శివార్లలో ఇల్లు అద్దెకు తీసుకుని బస చేస్తారు. అనంతరం ఓ బ్యాంకుపై దృష్టి సారించి ముగ్గురు వ్యక్తులు బ్యాంకు బయట, మరో వ్యక్తి బ్యాంకులోపల ఉంటారు. అక్కడ నగదు డ్రా చేస్తున్న వ్యక్తులను, ప్రధానంగా వయసు మళ్లిన వారిని లక్ష్యంగా చేసుకుని అతడి కదలికలను ఎప్పటికప్పుడు బయటివారికి దొంగిలించిన సెల్‌ఫోన్ ద్వారా చేరవేస్తుంటాడు. డబ్బు డ్రా చేసిన వ్యక్తి బయటకొచ్చినప్పటి నుంచి ఈ గ్యాంగ్.. అదను కోసం వేచి చూస్తూ అతడిని వెంబడిస్తుంది. ఖాతాదారుడు కారులో వస్తే టైర్‌కు రంధ్రం చేసి, లేదా కారులో డ్రా చేసిన డబ్బు తీసుకువెళ్లేటప్పుడు యజమానితో పాటు డ్రైవర్ కూడా ఉంటే రూ.50, రూ.100 నోట్లు పక్కన పడేయటం ద్వారా అవి మీవే అంటూ తీసుకునేలా చేసి తమ పని పూర్తి చేస్తారు. ఒకవేళ బైక్‌లోని డిక్కీలో నగదు పెడితే పార్క్ చేసేంత వరకు తెలియకుండా వెంటబడతారు. అనంతరం డిక్కీని పగలగొట్టి డబ్బును దొంగిలిస్తారు.

ఈ మూడు కాకపోతే వీరి వద్ద దురదపుట్టించే ఓ స్ప్రే సిద్ధంగా ఉంటుంది. ఓ ముఠా సభ్యుడు తమ టార్గెట్ గమనించకుండా అతడి పై దీన్ని స్ప్రే చేసి వెళ్లిపోతాడు. బాధితుడు ఆ దురదతో ఇబ్బంది పడుతుంటే వెనుక వచ్చే గ్యాంగ్ సభ్యులు సహకరిస్తున్నట్లు నటించి డబ్బు కాజేస్తారు.

300 కెమెరాల ఫీడ్ విశ్లేషించి..

నగరాన్ని టార్గెట్ చేసిన ఈ ముఠా గత నెల, ఈ నెల కలిపి నల్లకుంట, అంబర్‌పేట్, ఫలక్‌నుమ, మీర్‌పేట్ ఠాణాల పరిధుల్లో నాలుగు నేరాలు చేసి రూ.16 లక్షలు ఎత్తుకుపోయారు. ఈ కేసుల్ని ఛేదించడానికి నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు నేతృత్వంలో ఎస్సైలు జి.రాజశేఖర్‌రెడ్డి, బి.పరమేశ్వర్, కె.శ్రీకాంత్‌లతో పాటు గతంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన ఫలక్‌నుమ డీఏ కేఎస్ రవి సైతం బృందంగా ఏర్పడ్డారు. వీరు నేరం జరిగిన నాలుగు ప్రాంతాల్లోని సుమారు 300 సీసీ కెమెరాల్లో రికార్డైన ఫీడ్‌ను సేకరించి విశ్లేషించారు. రెండు వాహనాలపై తిరుగుతున్న నలుగురు వ్యక్తులు ఈ నేరాలు చేశారని, నేరం తర్వాత తమ ముఖాలు కప్పుకుని తప్పించుకుంటున్నారని గుర్తించారు. సాంకేతికంగా దర్యాప్తు చేసిన అధికారులు తమ వేగుల సాయంతో ఆ నలుగురూ ఓజీ కుప్పం ప్రాంతానికి చెందిన ఆకుల కిరణ్, జి.తులసింధర్, ప్రభుదాస్, శామ్యూల్‌రాజ్‌గా నిర్ధారించారు. అనంతరం వీరికోసం ఓజీ కుప్పం వెళ్లారు. దాదాపు 15 రోజుల పాటు అక్కడే ఉండి నిందితులు కిరణ్, తులసింధర్‌లను పట్టుకుని నగరానికి తీసుకొచ్చారు. వీరి నుంచి రూ.9.4లక్షల నగదు, నాలుగు బైక్‌లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నగరంలో నాలుగు నేరాలతో పాటు ఏపీలోని పెనమలూరు, పామర్రు, చిలకలపూడి, కర్ణాటకలోని బీదర్, తుముకూర్‌ల్లోనూ నేరాలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. గతంలో 23 కేసుల్లో నిందితుడిగా ఉన్న కిరణ్‌పై మూడు ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నాయి. తులసింధర్‌పై గతంలో 17 కేసులు ఉన్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నేరగాళ్ళను పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.

వారసత్వ సంపద పరిరక్షణ మన బాధ్యత

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వారసత్వ సంపద పరిరక్షణ మన బాధ్యత అని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ అన్నారు. నగరంలో చారిత్రక ప్రదేశాల పునర్నిర్మాణ పనుల పురోగతిపై రవీంద్ర భారతిలోని తన కార్యాలయంలో గురువారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర వైభవానికి ప్రతీకగా నిలిచిన వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్టులో భాగంగా పరిరక్షణ పనులు నిర్వహిస్తున్న కుతుబ్ షాహీ, పైగా టొంబ్స్‌లతో పాటు హయత్ భక్షి, రేమండ్ టొంబ్స్‌ల పరిరక్షణ పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. పరిరక్షణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సంబంధిత శాఖలను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని ఇనుమడింపజేసేలా పనుల నాణ్యత ఉండాలని సూచించారు. పనుల పురోగతిని పరిశీలించేందుకు త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో మూసీ రివర్ ప్రాజెక్టు అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ సుధీర్‌రెడ్డి, హెరిటేజ్ తెలంగాణ అధికారులు నారాయణ, టూరిజం అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు అశోక్, సరిత, పర్వేది, అగఖాన్ ట్రస్ట్‌కు చెందిన ఇంజనీర్లు యశ్వంత్ పురోహిత్, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.